www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

విజయవాడ సిటీ**

ANDHRAJYOTHI

మంగళవారం | 22-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 187

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి రా. 1.29 తదుపరి సప్తమి; నక్షత్రం: ఆర్ద్ర తె. 5.39 తదుపరి పునర్వసు; వర్జ్యం: మ. 2.10-3.46; దుర్ముహూర్తం: ఉ. 8.31-9.18, రా. 9.50-10.39; అమృతఘడియలు: రా. 7.44-9.19; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.13; సూర్యాస్తమయం: 5.45

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జగన్ మీడియాపై కేంద్ర సమాచార శాఖకు 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఫిర్యాదు

'సాక్షి' చానల్‌కు కేంద్ర హోం శాఖ నుంచి సెక్యూరిటీ క్లియరెన్స్ లేదన్న విషయమూ ఫిర్యాదులో ప్రస్తావన

శాటిలైట్ ఫ్రీక్వెన్సీ హ్యాకింగ్‌పై విజయవాడలో కేసు

ABN ఆంధ్రజ్యోతి

13



కృష్ణా తీరంలో జరిగే షో కోసం డ్రోన్ల రిహార్సల్స్

జాతీయ డ్రోన్ కేపిటల్‌గా అమరావతి!

1000 కోట్ల పెట్టుబడులు.. 6,000 కోట్ల రాబడి

12,500 మందికి ఉద్యోగాల కల్పనే లక్ష్యం

నేడు, రేపు అమరావతి డ్రోన్-2024 సదస్సు

వివిధ రంగాల్లో వినియోగంపై ఆవిష్కరణలు

జాతీయ, అంతర్జాతీయ నిపుణుల రాక

నేడు కృష్ణా తీరంలో 5,500 డ్రోన్‌లతో షో

14

మాజీ మంత్రి పినిపే తనయుడి అరెస్టు

14

వలంటీర్ హత్య కేసులో సూత్రధారిగా గుర్తింపు

తమిళనాడులోని మదురైలో సినీఫక్కీలో కారును చేజ్ చేసి శ్రీకాంత్‌ను పట్టుకున్న ఏపీ పోలీసులు

జగన్ నీకు సిగ్గులేదా?



దోచుకోవడం, దాచుకోవడం తప్ప విద్యార్థుల ఫీజులు చెల్లించడం తెలియదా?

రాజశేఖరరెడ్డి కొడుకువై ఉండి 3,500 కోట్ల ఫీజు బకాయిలా?: షర్మిల

13

దీపంతో దీపావళి!



పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో అమరులపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో హోంమంత్రి అనిత, సీఎస్ నీరబ్, డీజీపీ ద్వారకా తిరుమలరావు

31 నుంచే ఉచిత గ్యాస్ సిలిండర్లు.. 24 నుంచి బుకింగ్‌కు ఏర్పాట్లు



అర్హులందరికీ పథకం అందేలా చర్యలు

ప్రతి నాలుగు నెలలకు ఒకటి..

డెలివరీ తీసుకున్న రెండు రోజుల్లో ఖాతాల్లో సిలిండర్ సబ్సిడీ మొత్తం జమ

పథకం అమలుకు ఏటా 2,684 కోట్లు

అధికారులు, కంపెనీలతో సీఎం సమీక్ష

మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

'దీపం' గొప్ప ముందడుగు: చంద్రబాబు

'సూపర్ 6' హామీల అమలుకు శ్రీకారం

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): 'సూపర్ సిక్స్'లో తొలి హామీ అమలుకు ముహూర్తం కుదిరింది. దీపావళి కానుకగా పేదల వంటిళ్లలో 'దీపం' వెలిగించాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. అర్హులైన వారికి ఏటా మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇచ్చే పథకాన్ని దీపావళి నుంచి ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇదివరకే ప్రకటించారు. ఈ పథకం అమలు, విధివిధానాలపై సోమవారం సచివాలయంలో పౌరసరఫరాల మంత్రి

మిగతా 13వ పేజీలో...

ఉచిత ఇసుక దుర్వినియోగం కావొద్దు

బ్లాక్ మార్కెటింగ్‌ను పూర్తిగా నిరోధించండి

ఇతర రాష్ట్రాలకు తరలించకుండా నిఘా

సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు

నిర్వహణ, రవాణా చార్జీల భారం తగ్గించాలి

ఇసుకపై సీనరేజీ ఫీజు రద్దు చేయాలి

ట్రాక్టర్ వెసులుబాటు దుర్వినియోగం కారాదు

గనుల శాఖకు సీఎం చంద్రబాబు ఆదేశాలు

ప్రైవేటు ఏజెన్సీలతో సరఫరాపై అధ్యయనం

ఉచిత ఇసుకపై సమీక్షలో కీలక నిర్ణయాలు

శాంతిభద్రతలపై రాజీపడొద్దు

పోలీసులకు అన్ని విధాలా అండగా ఉంటాం

ఆడబిడ్డలపై అత్యాచారాలకు పాల్పడే వారికి శిక్షలు కఠినంగా ఉండాలి

గత ప్రభుత్వం పోలీసుల స్థాయిని దిగజార్చింది

ఆ ప్రభుత్వం పెట్టిన రూ. 763 కోట్ల బకాయిలు విడతల వారీగా చెల్లిస్తాం

పోలీసు సంక్షేమానికి ఏటా రూ.20 కోట్లు ఇస్తాం: సీఎం

₹99 లిక్కర్‌పై క్రేజ్

సరఫరాకు పెద్ద కంపెనీల ఆసక్తి

ఇప్పటికే ఏడు బ్రాండ్లకు అనుమతి

30 వేల కేసుల మద్యం ఉత్పత్తి

ప్రభుత్వ డిపోలకు చేరిన సరుకు

నెలాఖరుకు అందుబాటులోకి 2.4 లక్షల కేసులు

13



రుషికొండ ప్యాలెస్‌లను పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. చిత్రంలో ఎంపీ భరత్, ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఉన్నారు.

జలజీవన్ మిషన్ కింద గత ఐదేళ్లు కేంద్రం నిధులు మంజూరు చేసినా రాష్ట్రం తన వాటా నిధులు ఇవ్వలేదు. 15వ ఆర్థిక సంఘం, పంచాయతీల నిధులను గత పాలకులు దారిమళ్లించారు. దీంతో పంచాయతీల నిర్వహణ కష్టతరంగా మారింది. అప్పటి పాపాలు ఇప్పుడు ప్రజలను పూర్తి స్థాయిలో చుట్టు ముడుతున్నాయి.

– డిప్యూటీ సీఎం పవన్

పల్లెలకివ్వకుండా ప్యాలెస్‌కు 500 కోట్లా?

అవి మంచినీటికి కేటాయిస్తే బావుండేది.. జగన్ సర్కారుపై డిప్యూటీ సీఎం ఫైర్

డయేరియా ప్రబలిన గుర్లలో పర్యటన.. ఆస్పత్రిలో బాధితులకు పరామర్శ

మృతుల కుటుంబాలకు భరోసా.. సొంతంగా రూ.లక్ష సాయం ప్రకటన

కలుషిత నీటితో పది మంది చనిపోవడం బాధాకరం

గత ఐదేళ్లలో ఆర్థిక సంఘం, పంచాయతీల డబ్బు దారిమళ్లించారు

పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేశారు.. ఆ ప్రభుత్వంపై నెట్టేసి బాధ్యత నుంచి తప్పించుకోం

సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టిపెట్టారు.. నివేదిక రాగానే ఎక్స్‌గ్రేషియాపై నిర్ణయం: పవన్

రుషికొండ ప్యాలెస్‌ను సందర్శించిన డిప్యూటీ సీఎం

విజయనగరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): 'రుషికొండలో ప్యాలెస్‌లు కట్టడానికి 500 కోట్లు ఖర్చుచేశారు. కానీ... గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, మంచినీటి సరఫరా కోసం నిధులిచ్చేందుకు మాత్రం నాటి వైసీపీ పాలకులకు మనసు రాలేదు. ఆ నిధులు సద్వినియోగం చేసుకుని ఉంటే ఇలాంటి పరిస్థితులు వచ్చి ఉండేవి కాదు' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. డయేరియా ప్రబలిన విజయనగరం జిల్లా గుర్ల గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. ఆ తర్వాత కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, అక్కడే మీడియాతో మాట్లాడారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు ప్రాథమిక హక్కు అని, గుర్లలో డయేరియాతో 10 మంది వరకు చనిపోవడం బాధాకరమని అన్నారు. మృతుల సంఖ్య విచారణలో తెలుస్తుందన్నారు. గత ప్రభుత్వాలు చేసిన

మిగతా 14వ పేజీలో...

భారత్ లౌకిక దేశంగా ఉండాలని లేదా?

- పిటిషనర్లకు సుప్రీంకోర్టు సూటి ప్రశ్న
- రాజ్యాంగ పీఠిక నుంచి సోషలిస్ట్, సెక్యులర్.. పదాలను తొలగించాలన్న పిటిషన్లపై విచారణ

న్యూఢిల్లీ, అక్టోబరు 21: రాజ్యాంగ పీఠిక నుంచి సోషలిస్ట్ (సామ్యవాద), సెక్యులర్ (లౌకిక) అనే పదాలను తొలగించాలన్న వాదనలపై సుప్రీంకోర్టు సూటిగా స్పందించింది. భారత రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలోనే ఈ పదాలు ఇవి ఒడి ఉన్నాయని తెలిపింది. ఈ విషయాన్ని న్యాయస్థానాలు పలుమార్లు తమ తీర్పుల్లో స్పష్టం చేశాయని గుర్తు చేసింది. రాజ్యాంగ పీఠిక నుంచి ఈ పదాలను తొలగించాలని కోరుతూ బీజేపీ మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి తదితరులు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్‌ల ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్లలో ఒకరైన న్యాయవాది విష్ణుశంకర్‌జైన్ వాదనలు వినిపిస్తూ.. సోషలిస్ట్, సెక్యులర్ పదాలను చేర్చేందుకు 1976లో చేపట్టిన 42వ రాజ్యాంగ సవరణపై పార్లమెంటులో చర్చే జరగలేదన్నారు. దీంతో.. ఈ పదాలకు అనేక వివరణలు ఉన్నాయని, కానీ.. వాటిని భిన్నంగా అన్వ



యించుకుంటున్నారని దీనిపై జస్టిస్ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. మరో న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ వాదనలు వినిపిస్తూ 42వ సవరణ అమల్లోకి వచ్చేనాటికి నాటి ప్రధాని ఇందిర దేశంలో ఎమర్జెన్సీ విధించారని తెలిపారు. దీనిపై సంజీవ్‌ఖన్నా స్పందిస్తూ, "మీరు.. భారత్ సెక్యులర్ దేశంగా ఉండాలనుకోవడంలేదా?"అని ప్రశ్నించారు. అయితే తాము అలా అనడంలేదని, ఆ సవరణను మాత్రమే సవాలు చేస్తున్నామని న్యాయవాది జైన్ చెప్పారు. పీఠికలో ఈ రెండు పదాలను చేర్చడం ద్వారా కొత్త నిర్ణయాలకు అవకాశం కల్పించినట్లయిందని అన్నారు. బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి వాదనలు వినిపిస్తూ.. పీఠికలో 1949 నవంబరు 26 తేదీ ఉండడం తప్పు అని నిరూపిస్తానన్నారు. పీఠిక రెండు భాగాలుగా ఉండొచ్చని, ఒకటి తేదీతో, మరొకటి తేదీ లేకుండా ఉండొచ్చని అన్నారు. సోషలిస్ట్, సెక్యులర్ పదాలను పీఠికలో చేర్చేందుకు దేశ ప్రజలు అంగీకరించారని చెప్పడం సరికాదన్నారు. దీంతో ఇందుకు సంబంధించిన పత్రాలను పిటిషనర్లు సమర్పిస్తే పరిశీలిస్తామని ధర్మాసనం పేర్కొంది. నోటీసులు జారీ చేసేందుకు మాత్రం నిరాకరించింది. విచారణను నవంబరు 18కి వాయిదా వేసింది.

లోకం తీరు

దిక్కుతోచక దిగొచ్చిన జగన్...షర్మిలతో చర్చలు!



భారత ఆకాంక్షలు నెరవేరేదాకా విశ్రాంతి లేదు

- అప్పటిదాకా కష్టపడి పనిచేస్తూనే ఉంటాం: మోదీ
- ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ఆపే శక్తి భారత్‌కు ఉంది: కామెరాన్



న్యూఢిల్లీ, అక్టోబరు 21: భారతదేశ ఆకాంక్షలు నిజమయ్యేదాకా తమ ప్రభుత్వం కష్టపడి పనిచేస్తూనే ఉంటుందని, విశ్రాంతికి అవకాశమే లేదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. "భారతదేశం ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. అనేక మైలురాళ్లు చేరుకుంది. సంస్కరణలు అమలు చేసింది. అయినా ఇంకా ఎందుకు కష్టపడి పనిచేస్తున్నారు? అని నన్ను కలిసిన చాలా మంది అంటుంటారు. అప్పుడు నేను.. గడిచిన పదేళ్లలో 12 కోట్ల మరుగుదొడ్లు నిర్మించాం. 16 కోట్ల ఇళ్లకు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాం. ఇది సరిపోతుందా? అని అడుగుతా. కచ్చితంగా సరిపోదు. ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోనే అత్యధికంగా యువత ఉన్న దేశం. మన యువత మనల్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకెళుతుంది" అని మోదీ చెప్పారు. భారతదేశ కలలు, ఆకాంక్షలు, ప్రతినలు నెరవేరేదాకా విశ్రమించే ప్రసక్తే లేదని సోమవారం ఎన్డీటీవీ నిర్వహించిన 'ప్రపంచ సమ్మేళనం'లో ప్రధాని వ్యాఖ్యానించారు. కాగా, ఇదే సదస్సులో బ్రిటన్ మాజీ ప్రధాని డేవిడ్ కామెరాన్ మాట్లాడుతూ.. రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ఆపే శక్తి భారత్‌కు ఉందన్నారు. ఇరు దేశాల మధ్య మధ్యవర్తిత్వం వహించే సామర్థ్యం భారత దేశానికి ఉందని వ్యాఖ్యానించారు.



ఉగ్రవాదంపై పోరు ఆగదు

- జవాన్ల త్యాగంతోనే దేశాభివృద్ధి: షా

న్యూఢిల్లీ, అక్టోబరు 21: దేశంలో గత పదేళ్లుగా ప్రశాంత పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఉగ్రవాదంపై పోరును ఆపబోమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. జమ్మూ-కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో మునుపటితో పోల్చితే శాంతి నెలకొందని చెబుతూ ఉగ్రవాదం, అక్రమ చొరబాట్లు, మతపర సెంటిమెంట్లను రెచ్చగొట్టేందుకు జరుగుతున్న కుట్రలపై మాత్రం పోరాటాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. సోమవారం ఇక్కడ జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నేషనల్ పోలీసు మెమోరియల్ వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ భద్రతా దళాల త్యాగం కారణంగానే ప్రశాంత పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇంత వరకు విధి నిర్వహణలో 36,438 మంది పోలీసులు అమరులయ్యారని, ఒక్క గత ఏడాదే 216 మంది చనిపోయారని అమిత్ షా చెప్పారు..

గడ్చిరోలి అడవుల్లో ఎన్‌కౌంటర్

- నలుగురు మావోయిస్టుల మృతి.. ఒక జవాన్‌కు గాయాలు

చర్ల, అక్టోబరు 21: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో సోమవారం మధ్యాహ్నం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎదురుకాల్పుల్లో ఒక జవాన్ గాయపడ్డారు. గడ్చిరోలి జిల్లాలోని భామ్రాగడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొప్రి అటవీ ప్రాంతంలో నక్సలైట్లు ఉన్నట్లు సమాచారం అందడంతో సీ-60 బెటాలియన్‌కు చెందిన బలగాలు అడవుల్లో గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఎన్‌కౌంటర్ జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. ఘటనా స్థలం నుంచి నక్సలైట్లకు చెందిన తుపాకులు, ఇతర వస్తువులను పోలీస్ బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతి చెందిన మావోయిస్టుల వివరాలు ఇంకా గుర్తించలేదు. మృతదేహాలను గడ్చిరోలి జిల్లా కేంద్రానికి తరలించినట్లు తెలుస్తోంది.

భర్త దీర్ఘాయుష్షుకు వ్రతం చేసి.. రాత్రికి అన్నంలో విషంపెట్టి చంపిన భార్య!

లఖ్‌నవూ, అక్టోబరు 21: భర్త దీర్ఘాయుష్షు కోసం నిష్ఠగా సంకటహర చతుర్థి వ్రతం చేసిన ఆమె అదే రోజు రాత్రి భర్తను హత్యచేసింది. తన వ్రతం కోసం ఉదయం నుంచి పొద్దంతా ఏర్పాట్లతో బిజీగా ఉన్న భర్తతో సాయంత్రం గొడవపడి, రాత్రి అతడికి భోజనంలో విషం పెట్టింది. తీవ్ర అస్వస్థతకు గురైన అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. యూపీలోని కౌశంబీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇస్మాయిల్‌పూర్‌లో ఆదివారం ఈ ఘటన జరిగింది. మృతుడు అదే గ్రామానికి చెందిన శైలేశ్. నిందితురాలు అతడి భార్య సవిత. ఆదివారం రోజంతా ఉపవాసం ఉన్న సవిత, సాయంత్రం వ్రతం పూర్తయ్యాక భర్తతో గొడవపడింది. అయితే కొద్దిసేపటికే ఆ గొడవ సద్దుమణిగింది. రాత్రి ఇద్దరు కలిసి భోజనం చేశారు. చేతులు కడుక్కున్న తర్వాత ఏదో పనిచెప్పి పొరుగింటికి వెళ్లి రావాలని భర్తను పురమాయించింది. కొద్దిసేపటికి అతడు అస్వస్థతకు గురై ఇంటికొచ్చేసరికి ఇంట్లోంచి పారిపోయింది. శైలేశ్‌ను అతడి సోదరుడు అఖిలేశ్ ఆస్పత్రిలో చేర్పించాడు. అక్కడ చికిత్స పొందుతూ శైలేశ్ మృతిచెందాడు. అంతకుముందు.. శైలేశ్ స్టేట్‌మెంట్‌ను వీడియో రూపంలో రికార్డు చేశారు. భోజనంలో భార్య తనకు విషం పెట్టిందని శైలేశ్ స్టేట్‌మెంట్ ఇచ్చాడు.

మచిలీపట్నం మెడికల్ కాలేజీకి.. పింగళి వెంకయ్య పేరు

- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హర్షం

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీలకు కూటమి ప్రభుత్వం ప్రముఖుల పేర్లు పెట్టేందుకు ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా మచిలీపట్నం మెడికల్ కాలేజీకి పింగళి వెంకయ్య పేరు పెడుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులిచ్చారు. మచిలీపట్నం మెడికల్ కాలేజీకి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య పేరు పెట్టాలని వైసీపీ ప్రభుత్వ హయంలోనే విజ్ఞప్తులు వచ్చాయి. కానీ జగన్ సర్కార్ పట్టించుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వ తాజా నిర్ణయంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. పింగళి వెంకయ్య పేరును నిర్ణయించిన సీఎం చంద్రబాబు, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

జగన్.. దమ్ముంటే అసెంబ్లీకి రా!

- ఎమ్మెల్యేలను ప్రజలు ఎన్నుకున్నది అందుకే: స్పీకర్

నాతవరం(అనకాపల్లి జిల్లా), అక్టోబరు 21: మాజీ సీఎం, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్‌కి దమ్ముంటే నవంబరులో జరిగే అసెంబ్లీ సమావేశాలకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. సోమవారం అనకాపల్లి జిల్లా నాతవరం మండలం గొలుగొండపేట గ్రామంలో 68 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న రహదారికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేలను ప్రజలు ఎన్నుకుంది అసెంబ్లీకి వచ్చి సమస్యలను ప్రస్తావించడానికేనని, ఈ విషయాన్ని జగన్మోహన్‌రెడ్డి తెలుసుకోవాలని హితవు పలికారు.

కేజ్రీవాల్‌కు సుప్రీంలో చుక్కెదురు

- పరువు నష్టం కేసుపై పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, అక్టోబరు 21: ప్రధాని మోదీ విద్యార్హతలపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి తనకు జారీ అయిన సమన్లను కొట్టేయాలని ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. దీంతో ఆయనపై గుజరాత్ కోర్టులో పరువునష్టం కేసు విచారణ జరగనుంది. ప్రధాని విద్యార్హతలపై కేజ్రీవాల్, ఆప్ నేత సంజయ్ సింగ్ వ్యంగ్యంగా చేసిన వ్యాఖ్యలపై గుజరాత్‌లోని మెట్రోపాలిటన్ కోర్టు వారిద్దరికి సమన్లు జారీ చేసింది. కాగా ఆప్ నేత సంజయ్ సింగ్ ఇదే అంశంపై దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం మరో బెంచ్ ఏప్రిల్ 8న కొట్టేసిన విషయాన్ని జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ కేజ్రీవాల్ పిటిషన్ విచారణ సందర్భంగా గుర్తుచేసింది.

1-19 నడుమ ఎయిరిండియా విమానాలు ఎక్కొద్దు

దాడి చేస్తామని ఉగ్రవాది పన్నూన్ వార్నింగ్



న్యూఢిల్లీ, అక్టోబరు 21: ఖలిస్థాన్ ఉగ్రవాది, సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే) వ్యవస్థాపకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూన్ భారత్‌కు తాజాగా మరో హెచ్చరిక చేశాడు. నవంబరు 1 నుంచి 19 మధ్య ఎయిరిండియా విమానాలపై దాడిచేస్తామని ప్రకటించాడు. సిక్కు వ్యతిరేక అల్లర్లు జరిగి 40 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా.. ఆ తేదీల నడుమ ఎయిరిండియా విమానాల్లో ప్రయాణించవద్దని సోమవారం ఓ వీడియోలో హెచ్చరించాడు. 'సిక్కుల మారణహోమం' 40వ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఏదో ఒక ఎయిరిండియా విమానంపై దాడిచేసే అవకాశం ఉందని తెలిపాడు. అమెరికా, కెనడాల ద్వంద్వ పౌరసత్వాన్ని కలిగి ఉన్న పన్నూన్ గత ఏడాది కూడా ఇలాంటి హెచ్చరికే చేశాడు. ఇందుకుగాను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అతడిపై నేరపూరిత కుట్ర, వివిధ వర్గాల నడుమ మత విద్వేషాలను రెచ్చగొడుతున్నాడన్న ఆరోపణలతో కేసు నమోదు చేసింది. నిరుడు డిసెంబరు 13లోపు భారత పార్లమెంటుపై దాడిచేస్తానని కూడా ప్రకటించాడు. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవాన పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఆ రాష్ట్ర డీజీపీ గౌరవ్ యాదవ్‌లను చంపుతామనీ బెదిరించాడు. గ్యాంగ్‌స్టర్లు అంతా ఏకమై జనవరి 26న మాన్‌పై దాడిచేయాలని పిలుపిచ్చాడు. ఓపక్క భారత్‌లో పలు విమానాలకు బాంబు బెదిరింపులు(ఎక్కువ నకిలీవే) వస్తుండడం, మరో ఖలిస్తానీ ఉగ్రవాది హర్‌దీప్‌సింగ్ నిజ్జర్ హత్య దరిమిలా కెనడాతో భారత్ దౌత్య సంబంధాలు క్షీణించిన నేపథ్యంలో పన్నూన్ తాజా వార్నింగ్‌కు ప్రాధాన్యం ఏర్పడింది. వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తున్న ఇతడిని కేంద్ర హోం శాఖ 2020 జూలైలో ఉగ్రవాదిగా ప్రకటించింది. అంతకు ఏడాది ముందే ఎస్ఎఫ్‌జేను చట్ట విరుద్ధ సంస్థగా పేర్కొంటూ నిషేధం విధించింది. పన్నూన్ హత్యకు భారత గూఢచార సంస్థ రా మాజీ అధికారి వికాస్ యాదవ్ కుట్ర పన్నినట్లు అమెరికా ఈ నెల 17న ఆరోపించడం.. ఇది నిరాధార ఆరోపణగా భారత్ తోసిపుచ్చిన సంగతి తెలిసిందే.

గతంలోనూ బెదిరించారు: విదేశాంగ మంత్రి

ఎయిరిండియాకు, దాని ప్రయాణికులకు సోమవారం వచ్చిన హెచ్చరిక గురించి భారత ప్రభుత్వానికి తెలియదని విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. అయితే గతంలో కూడా భారత ఎయిర్‌లైన్స్‌కు, పార్లమెంటుకు, మన దౌత్యవేత్తలకు, హైకమిషన్లకు, మన నేతలకు బెదిరింపులు రావడం చూశామని.. ఇది ఆందోళనకరమని ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. ఇదే సందర్భంగా కెనడా ప్రభుత్వంపై విమర్శలు చేశారు. 'చాలా తెలివైన పదాలతో ఈ బెదిరింపులు చేశారు. కెనడా ప్రభుత్వానికి మాత్రం ఇది వాక్‌స్వాతంత్ర్యం' అని అన్నారు. నిలదీశారు. భారతీయ దౌత్యవేత్తల విషయంలో కెనడా రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. భారత్‌లో తమకు లైసెన్సు లభించినట్లుగా ఆ దేశ రాయబారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

విమానాలకు బెదిరింపు కాల్స్ చేస్తే జీవిత ఖైదే

కేంద్ర మంత్రి రామ్మోహన్ హెచ్చరిక

న్యూఢిల్లీ, అక్టోబరు 21: ఇటీవల భారత్‌లో పౌర విమానాలకు బాంబు బెదిరింపులు ఎక్కువవుతున్నాయి. ఈ నెల 14 నుంచి వారం రోజుల వ్యవధిలోనే సుమారు 100 బెదిదిరింపు కాల్స్ వచ్చాయి. ఈ నేపథ్యంలో కాల్స్, సోషల్ మీడియాలో ఫేక్ పోస్టుల ద్వారా బెదిరింపులకు పాల్పడేవారికి జీవిత ఖైదు విధించేలా చట్టంలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు హెచ్చరించారు. విమానయాన భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, బెదిరింపు కాల్స్ చేసే వారిని నో ఫ్లై జాబితాలో చేర్చేలా నిబంధనలు సవరిస్తామని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకూ వచ్చిన బెదిరింపు కాల్స్ అన్నీ ఫేక్ అని తేలిందని చెప్పారు. బెదిరింపు కాల్స్ వచ్చినప్పటి నుంచి అనేక విమానయాన సంస్థలతో పలుమార్లు సమావేశాలు నిర్వహించామని తెలిపారు. సేఫ్టీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ యాక్ట్ (ఎస్‌యూఏసీఎస్ఏ)ను సవరించే అంశంపైనా వివిధ శాఖలతో చర్చిస్తున్నామని చెప్పారు. విమానం గాలిలో ఉన్నప్పుడు ఫేక్ బెదిరింపు కాల్స్ చేసేవారికి ఎస్‌యూఏసీఎస్ఏ చట్టం ప్రకారం ప్రస్తుతం జీవిత ఖైదు విధిస్తున్నారు. అయితే దీనితోపాటు వారిని నో ఫ్లై జాబితాలో చేర్చేందుకు నిబంధనలు సవరించే పనిలో ఉన్నామని మంత్రి తెలిపారు. "గతవారం రోజుల్లో పలు బెదిరింపు కాల్స్ రావడంతో ఎనిమిది విమానాలను దారి మళ్లించాం. ప్రతి అంశాన్నీ సమగ్రంగా విశ్లేషించి వేగంగా నిర్ణయాలు తీసుకున్నాం. అవి ఫేక్ కాల్స్ అని తెలిసినా.. మేం తేలికగా తీసుకోలేదు. భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. ప్రయాణికుల ప్రాణాలే మాకు ముఖ్యం. బెదిరింపు కాల్స్‌పై హోంశాఖ, ఇతర ఏజెన్సీలతో కలిసి దర్యాప్తు వేగవంతం చేస్తున్నాం. అందరి సమష్టి కృషితో త్వరలోనే మెరుగైన పరిస్థితి తీసుకొస్తాం' అని రామ్మోహన్ నాయుడు వివరించారు. కాగా, విమానాశ్రయాల్లో భద్రతకు బాధ్యత వహించే ఏవియేషన్ సెక్యూరిటీ బాడీ బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌తో కేంద్ర హోం శాఖ సోమవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించింది. కాగా, భారత్‌లో విమానాలకు ఆదివారం కూడా 20కిపైగా బాంబు బెదిరింపు కాల్స్ వచ్చాయి. దీంతో అక్టోబరు 14 నుంచి ఇలా వచ్చిన కాల్స్ సంఖ్య 100కు చేరింది. నాలుగు విమానాలకు బెదిరింపు కాల్స్ చేసిన 17 ఏళ్ల బాలుడిని ముంబై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సరిహద్దు గస్తీపై భారత్, చైనా ఒప్పందం

- ఎల్ఏసీ వెంబడి 2020 నాటి స్థితి పునరుద్ధరణ చాన్స్

న్యూఢిల్లీ, అక్టోబరు 21: గాల్వన్ లోయలో ఉద్రిక్తతలు ఏర్పడటానికి(2020 మే) ముందు సరిహద్దులో భారత్, చైనా సైన్యం ఏ విధంగానైతే గస్తీ నిర్వహించేవారో తిరిగి అదే విధంగా గస్తీ నిర్వహించుకునేందుకు అవకాశం ఏర్పడిందని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. సోమవారం ఢిల్లీలో ఒక ఆంగ్ల టీవీ చానల్ సదస్సులో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. 'గస్తీపై ఒక ఒప్పందానికి వచ్చాం. 2020 నాటి పరిస్థితికి తిరిగి వెళ్తున్నాం. తద్వారా చైనాతో ఉద్రిక్తతలు ముగిశాయనుకోవచ్చు. 2020 తర్వాత వివిధ కారణాలతో వారు మనల్ని దూరం పెడితే, మనం వారిని దూరం పెట్టాం. ఇప్పుడు ఇరుపక్షాలూ ఒక అవగాహనకు వచ్చాం. దీంతో 2020 వరకు ఏ విధంగా గస్తీ నిర్వహించామో మళ్లీ అదే విధంగా గస్తీ నిర్వహించుకునేందుకు అవకాశం ఏర్పడింది' అన్నారు. '2020 సెప్టెంబరు నుంచి చర్చలు జరుపుతూనే ఉన్నాం. మరింత సంక్లిష్టంగా ఉన్నప్పటికీ ఇది చాలా సహనంతో కొనసాగిన ప్రక్రియ' అన్నారు. కాగా, ప్రధాని మోదీ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనే నిమిత్తం చేపట్టనున్న రష్యా పర్యటన వివరాలను సోమవారం మీడియాకు వెల్లడించిన విదేశాంగశాఖ కార్యదర్శి విక్రం మిస్రీ కూడా ఈ విషయాన్ని వెల్లడించారు. వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వెంబడి గస్తీ విషయంలో భారత్, చైనా ఒక ఒప్పందానికి వచ్చాయని చెప్పారు. ఇరుదేశాల నుంచి చర్చల్లో పాల్గొనే వారు కొన్ని వారాలుగా పరస్పరం అందుబాటులో ఉన్నారన్నారు. 'ఎల్ఏసీ వెంబడి గస్తీపై భారత్, చైనా ఒక ఒప్పందానికి వచ్చాయి. 2020లో తలెత్తిన అంశాలపై ఒక పరిష్కారానికి వచ్చాయి' అన్నారు.

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

- నేడు వాయుగుండంగా.. రేపు తుఫాన్‌గా బలపడే చాన్స్: ఐఎండీ

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అండమాన్ సముద్రం, దానికి ఆనుకుని తూర్పు మధ్య బంగాళాఖాతంలో సోమవారం ఉదయం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి సాయంత్రానికి తీవ్ర అల్పపీడనంగా బలపడి తూర్పు మధ్య బంగాళాఖాతంలో స్థిరంగా కొనసాగుతోంది. తర్వాత ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి మంగళవారం ఉదయానికి వాయుగుండంగా, బుధవారం ఉదయానికి తుఫాన్‌గా బలపడుతుంది. ఆ తర్వాత వాయవ్యంగా పయనించే క్రమంలో తీవ్ర తుఫాన్‌గా బలపడి వాయవ్య బంగాళాఖాతంలో ప్రవేశిస్తుంది. అదే దిశలో కొనసాగి.. 24వ తేదీ అర్ధరాత్రి లేదా 25వ తేదీ తెల్లవారుజామున పూరి, సాగర్ దీవులు (పశ్చిమ బెంగాల్) మధ్య పారాదీప్ సమీపంలో తీరం దాటుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది.

రేపటి నుంచి విశాఖలో వానలు

వాయుగుండం తుపాన్‌గా మారిన తర్వాత బుధవారం రాత్రి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ప్రవేశించే క్రమంలో విశాఖపట్నానికి సమాంతరంగా రానుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. అందువల్ల 23వ తేదీ రాత్రి నుంచి విశాఖపట్నం జిల్లాలో వర్షాలు ప్రారంభమవుతాయని చెప్పారు. తర్వాత తీవ్ర తుఫాన్‌గా బలపడి ఒడిశా వైపు పయనిస్తుందన్నారు. ఈ నెల 24, 25వ తేదీల్లో ఉత్తరాంధ్రలో పలుచోట్ల భారీవర్షాలు కురుస్తాయన్నారు. కాగా.. మంగళవారం వాయుగుండంగా మారనున్నందున సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, ఈ నెల 23 నుంచి ఉత్తరాంధ్రలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరించారు.

వయనాడ్‌తో నయాజోష్ వచ్చేనా?

- కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకంగా మారిన ఎన్నిక
- తొలిసారిగా ఎన్నికల బరిలో ప్రియాంక
- గెలుపునకు సర్వశక్తులొడ్డుతున్న కాంగ్రెస్
- రేపు ప్రియాంక నామినేషన్ సోనియా, రాహుల్, ఖర్గే హాజరు

న్యూఢిల్లీ, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): వయనాడ్ ఉప ఎన్నిక గెలుపు కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకంగా మారింది. గాంధీ కుటుంబానికి చెందిన ప్రియాంక తొలిసారిగా ఎన్నికల బరిలో నిలవడంతో అధిష్ఠానం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ప్రియాంక గాంధీ గెలుపు కోసం యావత్ కాంగ్రెస్ దృష్టి కేంద్రీకరించింది. గత లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ వయనాడ్‌తో పాటు రాయ్ బరేలీ స్థానం నుంచి పోటీ చేసి, రెండు చోట్లా విజయం సాధించారు. రాయ్ బరేలీ నుంచి ఎంపీగా కొనసాగుతూ వయనాడ్ స్థానానికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. గాంధీ కుటుంబాన్ని రాయ్ బరేలీ, అమేథీ తర్వాత అక్కున చేర్చుకున్న నియోజకవర్గం వయనాడ్. 2019లో కాంగ్రెస్ కంచుకోట అమేథీలో రాహుల్ గాంధీ ఓటమి పాలవగా, వయనాడ్ మాత్రం అఖండ విజయాన్ని అందించింది. 2024 లోకసభ ఎన్నికల్లోనూ అక్కడి ప్రజలు రాహుల్ గాంధీని అక్కున చేర్చుకున్నారు. అత్యధిక మెజారిటీతో గెలిపించారు. అందుకే.. గాంధీ కుటుంబానికే చెందిన ప్రియాంకను బరిలో నిలపడం ద్వారా వయనాడ్ తమకెంతో ప్రత్యేకమని చెప్పేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది.

రేపు ప్రియాంక నామినేషన్..

వయనాడ్‌లో యూడీఎఫ్ తరఫున కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రియాంక గాంధీ ఈ నెల 23న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ విషయాన్ని ఏఐసీసీ సోమవారం అధికారికంగా ప్రకటించింది. నామినేషన్ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరవుతారని ఏఐసీసీ తెలిపింది. కాంగ్రెస్ జాతీయ, రాష్ట్ర నేతలతోపాటు ముఖ్యమంత్రులు కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతారని స్పష్టం చేసింది.



ముగ్గురి మధ్య హోరాహోరీ

గాంధీ కుటుంబాన్ని ఓడించి వయనాడ్ స్థానాన్ని సొంతం చేసుకోవాలని బీజేపీ యోచిస్తోంది. ఇప్పటికే బీజేపీ, సంఘ్ శ్రేణులు వయనాడ్‌లో ఆపరేషన్ ప్రారంభించాయి. స్థానికంగా మంచి పేరున్న విద్యావంతురాలైన నవ్య హరిదాస్‌ను రంగంలోకి దింపింది. ప్రియాంక గాంధీ స్థానికేతరురాలు అనే ప్రచారం చేస్తూ, స్థానిక సెంటిమెంట్‌ను రగిలించాలని బీజేపీ ప్రయత్నిస్తున్నట్టు పలువురు రాజకీయ విమర్శకులు అభిప్రాయ పడుతున్నారు. మరోవైపు.. వామపక్ష పార్టీలకు కంచుకోట కేరళ. అక్కడ అధికార పార్టీ కూడా వామపక్షాలదే. అందుకే.. ఈ సారి ఎలాగైన వయనాడ్‌ను సొంతం చేసుకోవాలని ఎల్‌డీఎఫ్ పట్టుదలగా ఉంది. గత లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్‌లో లెఫ్ట్ పార్టీకి రాహుల్ గాంధీకి మధ్యనే పోటీ నెలకొంది. రాహుల్ గాంధీకి 6,47,445 ఓట్లు రాగా, ఎల్డీఎఫ్ నుంచి బరిలో నిలిచిన సీపీఐ అభ్యర్థి అనీ రాజాకు 2,83,023 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి సురేంద్రన్ 1,41,045 ఓట్లతో మూడోస్థానానికి పరిమితం కావాల్సి వచ్చింది. అందుకే.. ఈ సారి ఎల్‌ఎఫ్ సైతం వ్యూహాత్మకంగా తమ అభ్యర్థిని మార్చింది. క్షేత్రస్థాయిలో ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఈ పోటీలో విజయం ఎవరిదనే అంశంపై నవంబరు 13న జరిగే పోలింగ్‌తో స్పష్టత రానుంది. నవంబరు 23న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

మోదీపై అన్నాచెల్లెళ్ల యుద్ధం..

దేశంలో దశాబ్దకాలంగా అధికారంలో ఉన్న ప్రధాని మోదీని నిలువరించేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలను ముమ్మరం చేసిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే మోదీ ప్రాభవం తగ్గిందని భావిస్తున్న కాంగ్రెస్.. వచ్చే ఎన్నికలలోపు మరింత బలమైన పార్టీగా ఎదిగేందుకు వ్యూహాలకు పదును పెట్టిందని అంటున్నారు. ఇప్పటికే.. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ తనదైన పాత్ర పోషిస్తున్నారని భావిస్తున్న కాంగ్రెస్.. మరోశక్తిగా ప్రియాంక గాంధీని తయారు చేయాలని ఆశిస్తున్నదని చెబుతున్నారు. అందులో భాగంగానే ఆమెను వయనాడ్ నుంచి ఎన్నికల బరిలో నిలుపుతున్నారని అభిప్రాయ పడుతున్నారు. వయనాడ్‌లో ప్రియాంక విజయం సాధిస్తే రాహుల్, ప్రియాంక చెరోవైపు దేశంలోని ప్రజల తరఫున నిలిచేలా పార్టీ ప్రణాళికలు రచిస్తోందని అంటున్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ ఇప్పటి నుంచే వ్యూహ రచన చేస్తున్నదని, అందులో భాగంగానే ప్రియాంకను బరిలోకి దింపుతున్నదని అభిప్రాయ పడుతున్నారు.

ఇజ్రాయెల్ హెచ్చరికలతో బీరుట్ ఖాళీ

- ప్రాణభయంతో వీధుల్లోకి ప్రజలు.. మూటాముల్లెతో పరుగులు
- సురక్షిత ప్రాంతాలకు పయనంతో భారీగా ట్రాఫిక్ జామ్



బీరుట్, టెల్ అవీవ్, గాజా, అక్టోబరు 21: లెబనాన్ రాజధాని బీరుట్‌ను వదిలిపోవాలన్న ఇజ్రాయెల్ హెచ్చరికలతో ప్రజలు పరుగులు తీశారు. ప్రాణభయంతో సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు జనం పెద్ద ఎత్తున వీధుల్లోకి రావడంతో భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. బీరుట్ జనాభా 24 లక్షలు కాగా ఉన్నపళంగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలనడంతో చాలా మంది ఇళ్లను వదిలిపెట్టేశారు. వాస్తవానికి హెజ్‌బొల్లా ఆర్థిక మూలాలు దెబ్బతీసే లక్ష్యంతో వారికి ఆర్థిక వనరులను సమకూర్చే అల్ ఖర్ద్-అల్ హసన్ అసోసియేషన్ శాఖలపై ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించింది. అల్ ఖర్ద్-అల్ హసన్‌కు 30 శాఖలుండగా అందులో 15 బీరుట్‌లో అత్యంత రద్దీగా ఉండే ప్రదేశాలు, కిక్కిరిసిన జనావాసాల మధ్యలో ఉన్నాయి. ఐడీఎఫ్ హెచ్చరించిన కాసేపటికే బీరుట్ శివార్లలోని చియా ప్రాంతంలో పేలుళ్లు సంభవించాయి. దీంతో బీరుట్ వాసులు ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీయాల్సివచ్చింది. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ బీరుట్‌లో పర్యటించడానికి కొద్ది గంటల ముందు ఇజ్రాయెల్ ఈ దాడులకు దిగింది.

నష్టంపై హెజ్‌బొల్లా నాయకత్వం ఆరా!

అల్ ఖర్ద్-అల్ హసన్ అసోసియేషన్‌ను 1983లో ఏర్పాటు చేశారు. ఇస్లామిక్ మత విధానాలకు అనుగుణంగా సేవా భావంతో సామాన్యులకు రుణాలను అందిస్తుంది. హెజ్‌బొల్లాకు ఆర్థిక వనరులు సమకూరుస్తున్నారనే ఆరోపణలతో అమెరికా దీనిపై 2007లో ఆంక్షలు విధించింది. హెజ్‌బొల్లాను నాశనం చేయాలని నిర్ణయించుకున్న ఇజ్రాయెల్ దానికి ఆర్థిక వనరులు అందకుండా అల్ ఖర్ద్-అల్ హసన్ అసోసియేషన్ శాఖలన్నింటిపై దాడులకు ఉపక్రమించింది. ఇజ్రాయెల్ దాడులతో జరుగుతున్న నష్టంపై హెజ్‌బొల్లా నాయకత్వం ఆరా తీసింది.

హెజ్‌బొల్లా రాకెట్ దాడులు

ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా రాకెట్ దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా 30కి పైగా రాకెట్లను ఇజ్రాయెల్‌పైకి ప్రయోగించింది. వీటిని విజయవంతంగా కూల్చేశామని ఐడీఎఫ్ ప్రకటించింది. స్పష్టమైన కారణాలు వెల్లడించకుండానే బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసేసింది.

ఒక్కో జంట 16 మంది పిల్లల్ని కనాలేమో!

- 'డీలిమిటేషన్'తో ఇలాగే ఆలోచించాల్సి వస్తుందేమో: తమిళనాడు సీఎం స్టాలిన్

చెన్నై, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనలో తమిళనాడులో లోక్‌సభ స్థానాలు తగ్గే అవకాశం ఉండడంతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జనాభా నియంత్రణ కారణంగా రాష్ట్రంలో ఎంపీ స్థానాలు తగ్గే పరిస్థితి తలెత్తుతున్నప్పుడు.. పిల్లల్ని కనే విషయంలో పరిమితులు ఎందుకు విధించుకోవాలనే ఆలోచన వస్తోందన్నారు. చెన్నైలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో 31 జంటలకు సామూహిక వివాహాలు జరిపించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పూర్వం కొత్తగా పెళ్లయిన జంటలను పెద్దలు.. 16 సంపదలతో వర్ధిల్లాలని ఆశీర్వదించేవారు. ఇప్పుడు 16 సంపదలకు బదులుగా 16 మంది పిల్లల్ని కనాల్సిందిగా దీవించాల్సివస్తుందేమో!" అని వ్యాఖ్యానించారు. పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన విధానాన్ని చూస్తే ఇలాగే ఆలోచించాలేమోనన్నారు.

డయాఫ్రం వాల్‌కు టైం పడుతుంది!

» 2026 వరకు గడువు కోరుతున్న బావర్

» తర్వాత మూడేళ్లకు ఈసీఆర్ఎఫ్ డ్యాం పూర్తి: మేఘా

» సమయం కుదించుకోవాలన్న మంత్రి నిమ్మల

» అనంతరం సీఎంతో భేటీ ఏర్పాటు

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రం వాల్, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం పనులు ఒకదాని వెంట ఒకటిగా ప్రారంభించి.. వీటినెంత త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర జల వనరుల శాఖ ఆశిస్తుండగా.. నిర్మాణ సంస్థలైన బావర్, మేఘా ఇంజనీరింగ్ మాత్రం మరింత సమయం పడుతుందని అంటున్నాయి. నవంబరులో వాల్ నిర్మాణ పనులు ప్రారంభించి.. వచ్చే ఏడాది నవంబరు నాటికి పూర్తి చేయాలని కేంద్ర జలశక్తి శాఖ, కేంద్ర జల సంఘం, రాష్ట్ర జల వనరుల శాఖ నిర్ణయించాయి. నిర్మాణ సంస్థలు మాత్రం ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల మధ్య సీపేజీ జలాలు ఉన్నందున అప్పటికి పూర్తిచేయలేమని స్పష్టం చేస్తున్నాయి. సోమవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు-ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు నిర్మాణ సంస్థలతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. వాస్తవానికి సోమవారం నాటికి వాల్ నిర్మాణ షెడ్యూల్‌ను జలవనరుల శాఖకు మేఘా ద్వారా బావర్ అందించాలి. కానీ అందించలేదు. పైపెచ్చు యంత్రాల సమీకరణలో మరింత జాప్యం జరుగుతుందని.. ఎగువ దిగువ కాఫర్ డ్యాంల నడుమ సీపేజీ జలాలు ఎక్కువగా ఉన్నందున అత్యంత ఖరీదైన యంత్రాలు పాడైపోయే ప్రమాదం ఉందని ఆ సంస్థ పేర్కొంది. డయాఫ్రం వాల్‌ను 2026 ఫిబ్రవరి నాటికి పూర్తిచేస్తామని తెలిపింది. ఆ తర్వాత ఈసీఆర్ఎఫ్ డ్యాం నిర్మాణానికి మూడు సీజన్లు పడుతుందని.. 2029 నాటికి అది పూర్తయ్యే అవకాశం ఉందని మేఘా సంస్థ తెలిపింది. గతంలో ఎల్అండ్‌టీ, బావర్ కలసి డయాఫ్రం వాల్‌ను ఏడాదిన్నరలోగా పూర్తి చేశారని మంత్రి నిమ్మల గుర్తుచేశారు.. ఇప్పుడు అనుభవం వచ్చినందున సమయం కుదించుకోవాలని సంస్థలకు స్పష్టం చేశారు. మంగళ, బుధవారాల్లో వరుస సమీక్షలు జరిపాక.. సీఎం చంద్రబాబు సమక్షంలో ఒక భేటీని ఏర్పాటు చేయడం ఉత్తమమని ఆయన భావిస్తున్నారు. కాగా.. వెలగపూడి సచివాలయంలో వెలిగొండ ప్రాజెక్టు పనులపై మంత్రి రామానాయుడు సమీక్షించారు. రెండు రెగ్యులేటర్ల మధ్య వాల్ కట్టాల్సి ఉందని, దీనితో పాటు సొరంగాలు తవ్వడం ద్వారా వచ్చిన నాలుగు లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని టన్నెల్ చివరన కొత్తూరుకు తరలించాల్సి ఉందని అధికారులు ఆయనకు వివరించారు. లింక్ కెనాల్ పనులు, ఎత్తిపోతల పథకాలు, డిస్ట్రిబ్యూటరీ పనులపైనా మంత్రి సమీక్షించారు. హంద్రీ-నీవా ప్రధాన కాలువ విస్తరణ, లైనింగ్ పనులను నవంబరులో మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

న్యాయవాదులకు ఇళ్లస్థలాలు కేటాయించండి

» సీఎం చంద్రబాబుకు అడ్వొకేట్స్ అసోసియేషన్ వినతి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిదంబరం

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అడ్వొకేట్ల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.చిదంబరం నేతృత్వంలోని బృందం ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేసింది. అడ్వొకేట్ అసోసియేషన్ సభ్యత్వం ఉన్న న్యాయవాదులకు ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు వంద ఎకరాలు కేటాయించాలని, లేదా అపార్ట్‌మెంట్ విధానంలో ఇళ్ల నిర్మాణం కోసం 50 ఎకరాలు కేటాయించాలని సీఎంను కోరింది. న్యాయవాదుల సంక్షేమం కోసం రూ.10 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని విన్నవించింది. న్యాయవాదులలో వృత్తి నైపుణ్యం పెంచేందుకు అడ్వొకేట్ అకాడమీ ఏర్పాటుకు స్థలం కేటాయించడంతో పాటు నిర్మాణం కోసం అవసరమైన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసింది.

టీటీడీ మాజీ హెల్త్ ఆఫీసర్ బొబ్బా భీష్మయ్య నాయుడు కన్నుమూత



తిరుపతి, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): టీటీడీ విశ్రాంత హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బొబ్బా భీష్మయ్య నాయుడు (70) సోమవారం మృతిచెందారు. అనారోగ్యానికి గురైన ఆయన హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ తుదిశ్వాస విడిచారు. భీష్మయ్య నాయుడు భౌతికకాయాన్ని స్వగ్రామమైన తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం శేషాపురం గ్రామానికి తీసుకురానున్నారు. మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు తమ స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. భీష్మయ్య నాయుడు నారావారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, కళ్యాణి డ్యామ్ పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో, తిరుపతి మున్సిపల్ కార్యాలయంలో వైద్యాధికారిగా పనిచేశారు. అనంతరం తిరుమలలో హెల్త్ ఆఫీసర్‌గా పని చేస్తూ పదవీ విరమణ చేశారు. పనిచేసిన ప్రతిచోటా ఆయన తనదైన ముద్ర వేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మందుల్లేక ప్రాణాలు కోల్పోతున్నారు

» ఆర్టీసీ విశ్రాంత సిబ్బందికి న్యాయం చేయండి

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పాతిక, ముప్పై సంవత్సరాలు ప్రజా రవాణా సంస్థలో పనిచేసి పదవీ విరమణ చేసిన సిబ్బందికి మందులు కూడా ఇవ్వకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారని ఉద్యోగుల సంఘం, ఆర్టీసీ ఉన్నతాధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు రవి వర్మ(ఏ), చెంగల్ రెడ్డి(ఈ), అప్పల రాజు(ఓ), సుధాకర్(ఎఫ్ఏ)ను సంఘం నేతల బృందం కలిసింది. 'ఏపీఎస్ఆర్టీసీలో కార్మికులకు ఉన్న సౌలభ్యాలను 2020 తర్వాత విలీనంతో తొలగించడం అన్యాయం. పదవీ విరమణ చేసి ఉద్యోగికి అటు పెన్షన్ రాకపోగా ఎప్పటి నుంచో ఇస్తున్న జనరల్ మెడిసిన్స్(బీపీ, షుగర్) కూడా రద్దు చేస్తే ప్రాణాలు ఎలా నిలుస్తాయి? ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలి' అని అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.

నేటి నుంచి నీటి సంఘాల ఎన్నికలు

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగునీటి వినియోగదారుల సంఘాలకు మంగళవారం నుంచి ఎన్నికలు జరగనున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరపాలన్న ఆలోచనే రాలేదు. నిధులూ ఇవ్వలేదు. రాష్ట్రంలో 21,060 మేజర్, 3192 మీడియం, 24,768 మైనర్ మొత్తంగా 49,020 ప్రాదేశిక సంఘాలు, 6,149 సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. వీటికి ఎన్నికలు నిర్వహించడం ద్వారా సాగునీటి వనరులను పరిరక్షించుకునే విధానం ఉమ్మడి ఏపీలో టీడీపీ ప్రభుత్వం హయాంలో అమలులోకి వచ్చింది. దీనిని 2019 దాకా కొనసాగించారు. అయితే, 2019-24 మధ్య ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణ తరహాలోనే సాగునీటి సంఘాలనూ నాటి సీఎం జగన్ నిర్వీర్యం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు.

పోలవరం ప్రాజెక్టు వద్ద డీవాటరింగ్



సోమవారం పోలవరం దిగువ కాఫర్ డ్యాం వద్ద మోటార్ల ద్వారా నీటిని తోడేస్తున్న దృశ్యం

కాఫర్ డ్యాంల మధ్య ఉన్న వరద నీటిని 45 మోటార్లతో తోడేస్తున్న అధికారులు

» డయాఫ్రం వాల్ నిర్మాణం దిశగా చర్యలు

» యంత్రాలు, వాహనాల రాకపోకలకు అంతర్గత రహదారి పూర్తి

పోలవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని ఐదు నెలల్లో పూర్తి చేయాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఇంజనీరింగ్ అధికారులు అడుగులు వేస్తున్నారు. సీపేజీ జలాలకు తోడు ఇటీవలి వర్షాలు, వరదలకు ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల నడుమ పెద్దఎత్తున నీరు చేరడంతో పెద్దసంఖ్యలో మోటార్లను పెట్టి నీటిని తోడేసే పని ముమ్మరంగా సాగుతోంది. నవంబరు నుంచి మార్చి నెలాఖరు వరకూ రూ.1,183 కోట్ల విలువైన పనులు చేయాల్సి ఉంది. ఇప్పటికే ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల నడుమ యంత్రాలు, వాహనాల రాకపోకలు సాగించేందుకు అంతర్గత రహదారి నిర్మాణం పూర్తి చేశారు. ప్రధాన డ్యాం ఇరువైపులా కొండలను కొంతమేర తొలిచి అక్కడి నుంచి వాల్ నిర్మించేందుకు మట్టి పనులను, నిర్మాణాల కొలతలను ముమ్మరం చేశారు. వాల్ డిజైన్ ఖరారు కావలసి ఉంది. కాఫర్ డ్యాంల నడుమ సీపేజీ జలాల నీటిమట్టం 16 మీటర్లకు చేరిందని.. 80హెచ్‌పీ సామర్థ్యం ఉన్న 45 మోటార్ల ద్వారా కాఫర్ డ్యాంల నడుమ నీటిని నెలరోజులుగా డీవాటరింగ్ చేస్తున్నామని, కొంతమేర జలాలు స్లూయిజ్ ద్వారా దిగువకు ప్రవహిస్తున్నాయని ఈఈ సుధాకర్ తెలిపారు. అల్పపీడన ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. ఆ ప్రభావంతో ఎగువ కాఫర్ డ్యాం నుంచి సీపేజీ ఎగదన్నడం తీవ్రమైంది. కాఫర్ డ్యాంలకు ఇరువైపులా కొండలపై కురిసిన వర్షపు నీరు కాఫర్ డ్యాంల నడుమకు చేరడంతో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఈ సీజన్‌లో డయాఫ్రంవాల్ నిర్మాణ పనులు వేగవంతానికి వర్షం అడ్డంకిగా మారింది.



అనంతపురం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్రం కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్

హామీలను నెరవేర్చకుంటే కూటమికి వైసీపీకి పట్టిన గతే: గఫూర్

అనంతపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ అన్నారు. హామీలను నెరవేర్చకపోతే వైసీపీకి పట్టిన గతే కూటమికీ పడుతుందని అన్నారు. అత్యంత వెనుకబడిన రాయలసీమ ప్రజానీకానికి తాగు, సాగు నీరు అందించే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలనే ప్రధాన డిమాండ్‌తో సీపీఎం అనంతపురం జిల్లా కమిటీ కలెక్టరేట్ ఎదుట సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. పాలకులకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా అత్యంత కరువు జిల్లా అయిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు సాగు నీటిని సరఫరా చేయాలని, రైతాంగాన్ని ఆదుకోవాలని అన్నారు. ఉమ్మడి అనంతను సస్యశ్యామలం చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని చంద్రబాబు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ఉక్కు ప్రైవేటీకరణ సహించం: హర్షకుమార్

గుంటూరు(తూర్పు), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తామంటే సహించేది లేదని మాజీ ఎంపీ హర్షకుమార్ స్పష్టం చేశారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ స్థానిక అమరావతి రోడ్డులో అమృతరావు విగ్రహం వద్ద 'ఉక్కు దీక్షలు', బహిరంగ సభ నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో మాజీ ఎంపీ హర్షకుమార్ మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రసంగించారు.

తేమ ఎక్కువుంటే పత్తి కొనలేం: సీసీఐ జీఎం

గుంటూరు సిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉంటే కొనుగోలు చేయలేమని జనరల్ మేనేజర్ పీ.అమర్నాథ్ రెడ్డి అన్నారు. గుంటూరులోని సీసీఐ ప్రధాన కార్యాలయంలో ఆయన సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. సీసీఐ కేంద్రాలు తెరిచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అయితే 8 నుంచి 12 శాతం మేరకు మాత్రమే తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేయాలన్న నిబంధనలు ఉన్నాయని అన్నారు.

శారదాపీఠాన్ని వ్యాణిజ్య కేంద్రంగా మార్చారు

» స్వామి శ్రీనివాసానంద ఆగ్రహం

పొందూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ శారదాపీఠాన్ని హిందూధార్మిక సంస్థగా కాకుండా వాణిజ్య కేంద్రంగా మార్చేశారని ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వరూపానందేంద్ర గత సీఎం సేవలలో తరించారని విమర్శించారు. శారదాపీఠం అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని, తీసుకున్న భూమిని వెనక్కి తీసుకోవాలన్నారు.

ఆటోను ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

» ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి, నలుగురికి గాయాలు.. అన్నమయ్య జిల్లాలో ఘటన



నుజ్జునుజ్జు అయిన ఆటో

కలకడ, అక్టోబరు(ఆంధ్రజ్యోతి) 21: అన్నమయ్య జిల్లా కలకడ శివార్లలో సోమవారం రాత్రి దాదాపు 10గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాయచోటి నుంచి కలకడవైపు వస్తున్న ఓ ఆటోను, చిత్తూరు నుంచి హైదరాబాదుకు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న వారందరూ ఒకే కుటుంబానికి చెందిన వారు. వీరిలో అన్నమయ్య జిల్లా కలికిరి మండలం టి.సండ్రేవారిపల్లె (సొరకాయలపేట) పంచాయతీ దూదేకులపల్లెకు చెందిన వారు ఆరుగురు ఉండగా చిత్తూరు జిల్లా సోమల మండలం నెల్లిమంద గ్రామానికి చెందిన ఇద్దరు ఉన్నారు. మృతి చెందిన వారిలో దూదేకులపల్లెకు చెందిన బుజ్జమ్మ(55), ఆమె అల్లుళ్లు ఖాదర్ వలీ(30), నూరుల్లా(35), ఆమె వియ్యంకురాలు ఫకీరాబీ(60) ఉన్నారు. ఈ ప్రమాదంలో బుజ్జమ్మ భర్త ఎ.హసానుల్లా(60), ఆమె కుమార్తె దిల్‌షాద్(25), దిల్‌షాద్ కుమార్తె సారా(04), వారి బంధువు అమ్మాజీ(26) తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.

వేటగాళ్ల ఉచ్చుకు చిరుత బలి



యాదమరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వేటగాళ్ల ఉచ్చులో పడి చిరుతపులి అసువులు బాసింది. చిత్తూరు జిల్లా యాదమరి మండలం తాళ్లమడుగు గ్రామ సమీపంలోని అటవీప్రాంతంలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. అటవీశాఖ అధికారుల కథనం మేరకు... అటవీ ప్రాంతంలో దుర్వాసన వస్తోందని, అక్కడో చిరుత కళేబరం పడివుందని పశువుల కాపర్లు సమాచారం ఇవ్వడంతో చిత్తూరు డీఎఫ్‌వో భరణి, ఎఫ్ఆర్‌వో బాలకృష్ణారెడ్డి, ఎస్ఐ ఈశ్వర్ సిబ్బందితో కలసి వెళ్లి పరిశీలించారు. చిరుత మరణించి నాలుగైదు రోజులైందని, చిరుత కాళ్లు, దంతాలు కనిపించకపోవడంతో అపహరించారని నిర్ధారించారు. చిరుత కళేబరానికి తిరుపతి జూ వెటర్నరీ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించాక అటవీశాఖ అధికారులు దహనం చేశారు.

మానవ మృగాలపట్ల కఠినంగా వ్యవహరించాలి: సీపీఐ

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మానవ మృగాల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. కడప జిల్లా బద్వేల్‌లో బాలికపై పెట్రోల్ పోసి చంపిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సోనేమార్గ్ దగ్గర ఒక భారీ నిర్మాణ ప్రాజెక్టులో పనిచేస్తున్న ఏడుగురిని ఆదివారం సాయంత్రం మిలిటెంట్లు కాల్చిచంపడంతో జమ్మూకశ్మీర్ 'ప్రశాంతత' మరోసారి భగ్నమైంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న సొరంగమార్గం పనులలో పాల్గొంటున్న సిబ్బందిని లక్ష్యంగా పెట్టుకుని మిలిటెంట్లు కాల్పులు జరిపారు. కశ్మీర్ స్థానికుడైన ఒక వైద్యుడు, పక్క రాష్ట్రాల నుంచి వచ్చిన ఇంజనీర్లు, కార్మికులు ఆరుగురు ఈ దాడిలో మరణించారు. నిర్మాణంలోని సొరంగమార్గం జమ్మూకశ్మీర్ నుంచి లడఖ్‌కు వెళ్లేమార్గాన్ని సుగమం చేసి, పర్యాటకాభివృద్ధికి దోహదం చేస్తుంది. జమ్మూకశ్మీర్‌కు ఇతర ప్రాంతాల నుంచి కార్మికులు, ఉద్యోగులు రావడాన్ని, వనరులను అన్యాక్రాంతం చేయడానికి అనువైన అభివృద్ధిని చేపట్టడాన్ని కశ్మీరీ తీవ్రవాదులు వ్యతిరేకిస్తున్నారు. లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ఒకటి ఈ కాల్పులకు తమదే బాధ్యత అని ప్రకటించింది. యథావిధిగా దేశ హోంమంత్రి, కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఈ హింసాత్మక దాడిని ఖండించారు. అబ్దుల్లా ప్రమాణస్వీకారం తరువాత ఈ రకం సంఘటన ఇది రెండోది.

జమ్మూకశ్మీర్ ప్రతిపత్తిని నిర్వచించే 370 ఆర్టికల్ నిర్వీర్యంచేసి , కేంద్ర ప్రభుత్వం 2019లో కీలకనిర్ణయం తీసుకున్నది. మిలిటెంట్ సంస్థల సానుభూతిపరులనే కాక, ప్రధాన రాజకీయపార్టీల నేతలను కూడా నిర్బంధంలో ఉంచింది. సాధారణ ప్రజలు ఇటువంటి పరిష్కారాన్నే కోరుకుంటున్నారని, ఫలితంగా లభించే అభివృద్ధిని చూసి సంతోషిస్తారని ప్రభుత్వం చెప్పింది. వేర్పాటు, అధిక అధికారాలు వంటి విషయాలను పక్కనబెడితే, రాజ్యాంగంలోని 370 ఆర్టికల్‌తో పాటు, 35(ఎ) కూడా డొల్లగా మారిపోవడంతో, జమ్మూకశ్మీర్ ప్రజలకు ఉండిన ప్రత్యేక హక్కులు పోయాయి. నివసించే, ఆస్తి కలిగి ఉండే హక్కు రాష్ట్రంలోని స్థానికులకు మాత్రమే ఉండేది. అది వారి వనరులకు, ఉపాధికి గ్యారంటీగా ఉండేది. అధిక ప్రతిపత్తి కలిగి ఉండే రాష్ట్రం స్థాయి నుంచి, కేంద్రానికి అధీనంగా మిగిలే కేంద్రపాలిత ప్రాంతం స్థాయికి, జమ్మూకశ్మీర్ ప్రభ తగ్గిపోయింది. ప్రజలలో దీనిపై ఉన్న తీవ్ర అసంతృప్తి ఇటీవలి ఎన్నికలలో వ్యక్తమైంది.

హింసావలయం

స్థానికేతరుల మీద దాడులు రెండు మూడేళ్లుగా జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల కొద్దికాలం ఏ సంఘటనా లేకపోయేసరికి, కశ్మీర్ పూర్తి ప్రశాంత స్థితికి వచ్చిందని, తమ విధానాలు ఫలించాయని కేంద్ర ప్రభుత్వం చెప్పుకోసాగింది. సాపేక్ష ప్రశాంతపరిస్థితి ఏర్పడింది కాబట్టి, ఎన్నికలను నిర్వహించగలుగుతున్నామని చెప్పింది. నిజానికి ఎన్నికల నిర్వహణకు తీవ్రవాదుల నుంచి ఆటంకాలు వస్తాయని కేంద్రం భయపడలేదు, ఎన్నికలలో, పూర్తి వ్యతిరేక ఫలితాలు వస్తాయని, కొత్తగా వచ్చే ప్రభుత్వం 370 పునరుద్ధరణ కోరే తీర్మానాన్ని రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెడుతుందేమోనని కేంద్రం అనుమానించింది. అటువంటి ప్రమాదాన్ని నివారించడానికి వీలుగా రాష్ట్ర అసెంబ్లీ నిర్మాణాన్ని, గవర్నర్ అధికారాలను పకడ్బందీగా నిర్వచించింది. ఏ తీర్మానం ప్రవేశపెట్టాలన్నా, రాష్ట్రప్రభుత్వం గవర్నర్ అనుమతి కోరవలసిందే.

తమకు ఉన్న అవకాశాల మేరకు ప్రజలు కేంద్రానికి వ్యతిరేక తీర్పే ఇచ్చారు. అదే సమయంలో, భారతీయ జనతాపార్టీ జమ్మూ ప్రాంతంలో తన ప్రాబల్యాన్ని పెంచుకున్నది. 370 సంగతి పక్కనబెట్టినా, స్థానికులకు వనరులపై, ఉపాధిపై ఉన్న ప్రత్యేక హక్కును పునరుద్ధరించాలని కోరిన పక్షంలో కాంగ్రెస్‌కు జమ్మూలో కొంత ఆదరణ లభించి ఉండేది. కానీ, కాంగ్రెస్ ఆచితూచి, భయంభయంగా కశ్మీర్‌లో పోటీచేసింది. రాజకీయంగా వ్యక్తీకరణకు ఆస్కారం లేకపోయేసరికి, మిలిటెంట్లకు అవకాశం చిక్కుతుంది. స్థానికేతరుల మీద దాడులు గురిపెట్టి వారు తమ ఉనికిని, ఉద్దేశ్యాలను చాటుతున్నారు.

పొట్టకూటి కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చి పనిచేసే నిరుపేద కార్మికులను లక్ష్యం చేసుకుని దాడులు చేయడం ఏ మాత్రం సమర్థనీయం కాదు. ఉద్యోగులు, నిపుణులు విషయంలో అయినా సరే, తుపాకులు గురిపెట్టడం అమానుషం. ప్రభుత్వ విధానాలకు వారు ఏ విధంగానూ బాధ్యులుకారు. ప్రభుత్వం నిర్మిస్తున్న రహదారి, సొరంగ మార్గాలలో కార్మికులకు వైద్య సేవలందించే ఒక వైద్యుడిని కూడా తీవ్రవాదులు చంపారు. స్థానికుడైన ఆ డాక్టర్ అంత్యక్రియలకు వేలాది మంది హాజరయ్యారు. హతులైన ఇంజనీర్ల భార్యాబిడ్డల రోదనలు హృదయవిదారకంగా ఉన్నాయి.


చిన్న పోలీసు కానిస్టేబుల్‌ను కూడా బదిలీచేసే, నియమించే, తొలగించే అధికారం ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వానికి లేదు. ఆయన ఏ విధంగానూ ఇటువంటి చర్యలను నిరోధించలేరు, అణచివేయలేరు. కానీ, నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం వచ్చిన తరువాత హింస పెరిగిందన్న అపవాదు మాత్రం క్రమంగా పెరిగి పెద్దదవుతుంది. ఏదో ఒక సమయంలో తిరిగి గవర్నర్ పాలనకు సమర్థన పెరుగుతుంది. కశ్మీర్ మౌలిక సమస్యలు, ఆకాంక్షలను పట్టించుకుని, ఏదో ఒక స్థాయి పరిష్కారాన్ని అన్వేషించకపోతే, ఈ హింసా వలయం కొనసాగుతూనే ఉంటుంది.

నోబెల్ గ్రహీతల రాజకీయోపనిషత్తులు!

ప్రవచనాల్లేని యుగం లేదు! ఒక్కో యుగంలో ఒక్కో ప్రవచనం ప్రబలంగా ఉంటుంది. స్వామి భక్తినీ ప్రభు భక్తినీ ప్రదర్శించాలన్న ప్రవచనం మధ్యయుగాల్లో రాజ్యమేలింది. ఎంతో సాహిత్యం దీనిపైనే వచ్చింది. ఆధునిక యుగంలో బాగా ప్రచారమున్న ప్రవచనం ఏదైనా ఉందంటే అది ఆర్థిక వ్యవస్థకు చెందిందే! ఆర్థిక అంశాలను రాజకీయాలకు దూరంగా ఉంచాలన్నదే ఆ ప్రవచనం! ఆర్థిక శాస్త్రానికి ఆద్యుడిగా భావించే ఆడంస్మిత్ కాలం నుంచీ అది వినిపిస్తున్నా 1990ల్లో బాగా ఊపందుకుంది. రాజకీయాలకు అతీతంగా ఉండే ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో ఎప్పుడైనా, ఎక్కడైనా ఉందా? అని ఎంత శోధించినా లభించే జవాబు ఒక్కటే! అట్లాంటిది ఎక్కడా లేదు. వారం క్రితం ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని పొందిన డారా అసిమొగ్లు, జేమ్స్ ఎ. రాబిన్‌సన్, సైమన్ జాన్సన్ రచనలు చూసినా ఇదే అర్థం అవుతుంది. ఆర్థిక వ్యవస్థపై రాజకీయాల మంచిచెడుల ప్రభావాన్ని వివరించటానికి చేసిన కృషికే ఆ ముగ్గురికీ నోబెల్ వచ్చింది.

ఇంతకీ రాజకీయాల్లో మంచేమిటి? చెడేమిటి? ఈ రెంటికీ వివిధ దేశాల మధ్య నెలకొన్న అసమానతలకు సంబంధం ఏమిటి? కొన్ని దేశాలు అద్భుతమైన ప్రగతిని ఎందుకు సాధించాయి? మరికొన్ని అట్టడుగున ఎందుకున్నాయి? కారణాలేమిటి? ఆ దేశాలకున్న వనరుల్లో ఉన్న తేడానా? లేక అత్యుత్తమ ఆర్థిక విధానాలను అర్థం చేసుకుని చేపట్టటంలో నాయకుల వైఫల్యమా? కొన్ని దేశాల్లో వంద లేళ్లు పాతుకుపోయిన సంప్రదాయ సంస్కృతి సాహసోపేత అడుగులు వేయకుండా ప్రజల చొరవను నీరుగారుస్తోందా? ఈ మూడు ప్రశ్నలకు జవాబులిస్తూ.. ఆర్థిక ప్రగతికి తోడ్పడే రాజకీయాలను, సంస్థాగత ఏర్పాట్లను వివరిస్తూ 12 ఏళ్ల క్రితం "వై నేషన్స్ ఫేల్" అనే పుస్తకాన్ని డారా అసిమొగ్లు, జేమ్స్ ఎ. రాబిన్‌సన్ రాశారు.

సంపన్న దేశాలు ఇప్పుడు 30 దాకా కనపడతాయి. వీటిలో యూరప్, ఉత్తర అమెరికాలో ఉన్నవే ఎక్కువ. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా, తైవాన్‌లు కూడా ఈ జాబితాకు చెందినవే. ఇక అట్టడుగున ఉన్న 30 దేశాల జాబితాను పరిశీలిస్తే అవన్నీ చాలా మేరకు సబ్-సహారా ఆఫ్రికాలోనే కనపడతాయి. వీటికి అఫ్ఘనిస్థాన్, హైతీ, నేపాల్ లాంటి దేశాలు కూడా కలపొచ్చు. 50 ఏళ్ల వెనక్కి వెళ్లినా జాబితాలో కొన్ని మార్పులే కనపడతాయి. సింగపూర్, దక్షిణ కొరియా లాంటి కొన్ని దేశాలు 50 ఏళ్లలో ధనిక దేశాల జాబితాలో చేరాయి. అలాగే పేద దేశాల జాబితాలో ఆనాడు వేరేవి కొన్ని ఉండేవి. ఇవి మినహా 100–150 ఏళ్ల వెనక్కి వెళ్లినా జాబితాలో స్వల్పమార్పులే కనపడతాయి! 2008 నాటికి పేద దేశాల సగటు తలసరి వార్షిక ఆదాయం 2000 డాలర్లు కాగా ధనిక దేశాల ఆదాయం 20000 డాలర్లు. అమెరికా ఖండంలో యూఎస్ఏ, కెనడాలు ఆదాయపరంగా పైభాగాన ఉంటే చిలీ, అర్జెంటీనా, బ్రెజిల్, మెక్సికో, ఉరుగ్వే, వెనెజులా తర్వాతి స్థానంలో నిలిచాయి. మూడో స్థానంలో కొలంబియా, డొమినికన్ రిపబ్లిక్, ఈక్వెడార్, పెరూ ఉంటే అట్టడుగున బొలీవియ, గ్వాటమాల, పరాగ్వేలు నిలిచాయి. ఈ ఖండంలో సైతం 50 నుంచి 150 ఏళ్ల వెనక్కి వెళ్లినా దేశాల మధ్య పరిస్థితిలో పెద్ద మార్పు కనపడదు. సౌదీ అరేబియా, కువైత్ లాంటి చమురు ఆధారిత మధ్య ప్రాచ్య దేశాల్లో తలసరి ఆదాయం ధనిక దేశాలకు కాస్త అటుఇటుగానే ఉంటుంది. కానీ చమురు ధరల్లో తేడా వస్తే వాటి ఆదాయం పడిపోతుంది. మధ్య ప్రాచ్యంలో చమురు నిల్వలు పెద్దగా లేని దేశాలైన ఈజిప్టు, జోర్డాన్, సిరియాల ఆదాయం పెరూ, గ్వాటమాలకు సమానంగానే ఉంటుంది.



> ఎన్నికల్లో వేలకోట్లు వెదజల్లే రాజకీయ సంస్కృతి, అడుగడుగునా పైరవీలు, అన్నిస్థాయిల్లో లంచాలు, పాలక పార్టీలకు అధికారులకు తోకల్లా మారటం, ప్రజా జీవితంలో నైతికతకు ప్రాధాన్యం ఇవ్వని మత సంస్కృతి, సంకుచిత తత్వాన్ని ప్రోత్సహించే కులభావాలు.. ప్రబలంగా ఉన్నంత వరకూ అసలైన అభివృద్ధికి మనం చాలా దూరంలో ఉండిపోతాం. దేశాల మధ్యా, దేశాల లోపలా అసమానతలకు మూలం రాజకీయ విధానాలు, వ్యవస్థల్లో ఉందన్న విశ్లేషణ.. నిజమైన ప్రజాస్వామ్య పాలన కోసం ఉద్యమించే వారికి కొంతైనా తోడ్పడతాయి! అంతమేరకు నోబెల్ గ్రహీతల సూత్రీకరణలు విలువైనవే!

పారిశ్రామిక విప్లవం ఆరంభం నాటి నుంచి చూస్తే వివిధ దేశాల మధ్య సంపద, ఆదాయాల్లో తేడాలు కొద్ది మార్పులతో కొనసాగుతున్నట్లే కనపడుతుంది. ఆ విప్లవానికి ముందు దేశాల మధ్య ఇంత తేడాల్లేవు. ఇక్కడ నాలుగు ప్రశ్నలు తలెత్తుతాయి. ఒకటి... పారిశ్రామిక విప్లవం తర్వాత పాశ్చాత్య దేశాలు (అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సహా) ఎందుకు వెనుకంజ వేయలేదు? రెండు.. అమెరికా ఖండంలో దేశాల మధ్య అసమానతలు ఇంకా ఎందుకు కొనసాగుతున్నాయి. మూడు.. సబ్-సహారా, మధ్యప్రాచ్య దేశాలు పాశ్చాత్య దేశాల వేగాన్ని ఎందుకు అందుకోలేకపోయాయి. నాలుగు.. తూర్పు ఆసియా దేశాలు ఆర్థికంగా ఎందుకు పురోగమించాయి.



■ రాహుల్ కుమార్

ఈ ప్రశ్నలకు సామాజిక శాస్త్రవేత్తల వివరణలు పరిశీలిస్తే అందులో ముఖ్యమైనవి మూడే కనపడతాయి. లోతుగా చూస్తే అవేవి సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వవు. భౌగోళిక పరిస్థితులకు పెద్దపీట వేస్తూ అందించిన వివరణను మొదటిదిగా చెప్పుకోవచ్చు. దక్షిణాసియా, ఆఫ్రికా, మధ్య అమెరికాలోని పేద దేశాలన్నీ ఉష్ణమండల ప్రాంతంలోనూ ధనిక దేశాలన్నీ సమశీతోష్ణ ప్రాంతాలలోనూ ఉన్నాయనీ అసమానతలకు ఈ భౌగోళిక తేడాలనే కారణాలుగా చెప్పే వాదన 18వ శతాబ్దంలో ఫ్రెంచ్ రాజకీయ శాస్త్రవేత్త మాంటెస్క్యూతో మొదలైంది. ఉష్ణమండలాల ప్రజలు స్తబ్దులు.. సోమరులు.. కొత్త విషయాలపై కుతూహలం ఉండదు... నియంతల పాలన కింద కొనసాగుతారు... ఇలా చాలానే ఆ ప్రాంత ప్రజల స్వాభావిక లక్షణాలుగా చెప్పారు. సోమరితనం నుంచి దారిద్ర్యం, కుతూహల లోపంతో విజ్ఞానాల్లో వెనుకబడటం... ఫలితంగా సంపద సృష్టిలో అట్టడుగున ఉండటం... ఉష్ణమండల దేశాలకు సహజం అన్నట్లుగా సూత్రీకరించారు. మాంటెస్క్యూనే కాదు జెఫ్రీసాక్స్ లాంటి కొందరు సమకాలీన ఆర్థికవేత్తలదీ ఇదే ధోరణి. వాతావరణం ఆలోచనలు, పనితీరును ప్రభావితం చేస్తుందని చెప్పటమే కాదు.. ప్రజల ఆరోగ్యం, వ్యవసాయ ఉత్పాదకతపై ప్రతికూల ప్రభావాన్ని చూపిందనీ వాదించారు. ఈ వివరణ సమర్థనీయం కాదని చెప్పటానికి ఇటీవల పరిణామాలనే పేర్కొనొచ్చు. ఇప్పటి దక్షిణ–ఉత్తర కొరియాలను, ఒకనాటి తూర్పు–పశ్చిమ జర్మనీలను పరిశీలిస్తే అభివృద్ధిలో తేడాలకు భౌగోళిక అంశాలు కారణాలు కాదని తేలికగానే తెలుస్తుంది. ఆ దేశాల్లోని వేర్వేరు రాజకీయ వ్యవస్థలు అభివృద్ధి స్థాయిని విపరీతంగా ప్రభావితం చేశాయి. అలాగే ఉత్తర-దక్షిణ అమెరికా, యూరపు-ఆఫ్రికాల మధ్య తేడాలను భౌగోళిక అంశాల ప్రాతిపదికనే వివరించలేం. చరిత్రలోకి చూస్తే ఉష్ణమండల దేశాలు ఎల్లకాలం పేద దేశాలుగా లేవు. ఉత్తర అమెరికా కంటే ఒకనాడు (500 ఏళ్ల క్రితం) మెక్సికో, మధ్య అమెరికా, పెరు, బొలివియా దేశాలే ఆర్థికంగా పైస్థాయిలో ఉండేవి. అజ్‌టెక్, ఇన్కా నాగరికతలు అక్కడే విలసిల్లాయి. చైనా, భారత్‌లు గొప్ప ప్రాచీన నాగరికతలకు నిలయాలు. ఉష్ణమండలాలు వ్యాధులకు నిలయాలనీ, ఇక్కడి నేలలు పోషకాలను నిలుపుకోలేవన్న వాదనలు కూడా పరిశీలనలకు నిలబడవు. ప్రభుత్వాలు చేపట్టే ప్రజారోగ్య పరిరక్షణ చర్యలతో చాలా దేశాల్లో అనేక వ్యాధులు అదుపులోకి వచ్చాయి. ఆ చర్యలు చేపట్టక ముందు బ్రిటన్ కూడా ఒకప్పుడు చాలా అనారోగ్యకరంగా ఉండేది.

సంస్కృతికీ సంపద సృష్టికీ సంబంధం ఉందనే వాదన జర్మన్ సామాజిక శాస్త్రవేత్త మాక్స్ వెబర్ చాలా ప్రాచుర్యం లోకి తెచ్చారు. క్యాథలిక్ చర్చి వ్యవస్థలో సంస్కరణలు కోరుతూ 16వ శతాబ్దంలో మొదలైన మత ఉద్యమం (ప్రొటెస్టంట్ రెఫమేషన్) నైతికవర్తనకు దారితీసిందనీ అది చివరికి పశ్చిమ యూరపులో పారిశ్రామిక సమాజం పురోగమించటానికి కారణమైందనీ వెబర్ సూత్రీకరించారు. 'కష్టం చేస్తే దేవుడు ఆశీర్వదిస్తాడు.. సంపాదనతో పాటు పొదుపు కూడా చేయాలి... సమయపాలనతో కచ్చితంగా పనిచేయాలి'.. ఈ మూడు బోధనలు ప్రొటెస్టంట్ నైతికతలో ప్రధానమైనవిగా చెబుతారు. పెట్టుబడిదారులు ప్రధాన పాత్ర వహించే ఆర్థిక వ్యవస్థకు ఇవి ప్రాణప్రదమైనవి. అయినా ప్రొటెస్టంట్ మతం ఉన్నచోటల్లా ఈ బోధనలు అభివృద్ధికి దారితీశాయని చెప్పలేం. ఈ మతమే ప్రధానంగా ఉన్న తూర్పు, పశ్చిమ జర్మనీల మధ్య ఒకనాటి ఆర్థికపరమైన తేడాలే ఇందుకు నిదర్శనం. అభివృద్ధిలో ఆ రెండిటి మధ్య చాలా అంతరం ఉండేది. రెండు దేశాల్లో విభిన్నంగా ఉన్న రాజకీయ సంస్థలు, విధానాలు, ఎన్నికలు– పాలనా పద్ధతులు, పౌరహక్కులు, న్యాయవ్యవస్థ లాంటివి ఆర్థికాభివృద్ధిపై ఎంతో ప్రభావాన్ని చూపించాయి. చైనా సంస్కృతి, కన్ఫ్యూషన్ విలువలను ఒకనాడు ఆర్థిక ప్రగతికి అడ్డంకిగా భావించేవారు. కానీ ఆ ప్రభావం ఉన్న దేశాలు కూడా ఆర్థిక ప్రగతిలో ముందుకు వెళుతున్నాయి. ఫ్రాన్స్ క్యాథలిక్ దేశమైనా ప్రగతికి అది అడ్డంకి కాలేదు.

పేద దేశాల విధానకర్తలు, ఆర్థికవేత్తలు అవగాహన లేమితో సరైన విధానాలను అనుసరించకపోవటం వల్లే అభివృద్ధిలో వైఫల్యం చెందుతున్నారన్న సూత్రీకరణ కూడా విశ్లేషణకు నిలబడదు. వెనుకబడిన ఏ దేశాన్ని తీసుకున్నా అక్కడ అవగాహనా లోపం కంటే అప్పటికే ఆర్థికంగా ఆధిపత్యం ఉన్న వర్గాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉద్దేశపూర్వకంగానే సరైన విధానాలు చేపట్టలేదనేది స్పష్టమవుతుంది. లాటిన్ అమెరికా దేశాల్లో ఇది స్పష్టంగా కనపడుతుంది. భారత్‌లో భూసంస్కరణల విషయంలోనూ దీన్నే చూడొచ్చు.

రాజకీయ విధానాలు, సంస్థలు కల్పించే అవకాశాలు, అడ్డంకులను పక్కనపెట్టి ఆర్థిక అసమానతలను అర్థం చేసుకోలేం. రాజకీయ విధానాల్లోనే విషయమంతా ఉంది. సమన్యాయ పాలనలో లోపాలు, ఆశ్రిత పక్షపాతాలు, మార్కెట్‌లో గుత్తాధిపత్యాలు, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణలో వైఫల్యాలు, న్యాయవ్యవస్థ స్వతంత్రతకు పగ్గాలు, విద్యావ్యాప్తికి అవరోధాలు, కొత్త ఆవిష్కరణలు చేసే వారికి కొరవడే ప్రోత్సాహకాలు, వ్యక్తుల చొరవకు అడ్డంకులు.. వీటన్నిటినీ అసిమొగ్లు బృందం అభివృద్ధికి నిరోధకాలుగా పేర్కొంది. వీటి కోణం నుంచి చూస్తే భారత్ ప్రయాణం అస్తవ్యస్తంగానే కనపడుతుంది. ఎన్నికల్లో వేలకోట్లు వెదజల్లే రాజకీయ సంస్కృతి, అడుగడుగునా పైరవీలు, అన్నిస్థాయిల్లో లంచాలు, పాలక పార్టీలకు అధికారులకు తోకల్లా మారటం, ప్రజా జీవితంలో నైతికతకు ప్రాధాన్యం ఇవ్వని మత సంస్కృతి, సంకుచిత తత్వాన్ని ప్రోత్సహించే కులభావాలు.. ప్రబలంగా ఉన్నంత వరకూ అసలైన అభివృద్ధికి మనం చాలా దూరంలో ఉండిపోతాం. దేశాల మధ్యా, దేశాల లోపలా అసమానతలకు మూలం రాజకీయ విధానాలు, వ్యవస్థల్లో ఉందన్న విశ్లేషణ.. నిజమైన ప్రజాస్వామ్య పాలన కోసం ఉద్యమించే వారికి కొంతైనా తోడ్పడతాయి! అంత మేరకు నోబెల్ గ్రహీతల సూత్రీకరణలు విలువైనవే!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడడానికే ఈ యుద్ధోన్మాదం!

ప్రపంచం అల్లకల్లోలంగా ఉంది. అమెరికా సామ్రాజ్యవాదుల నేతృత్వంలో పాశ్చాత్య సామ్రాజ్యవాదులు బరితెగించి ఫాసిస్టు శక్తులను ఎగదోసి ప్రపంచ యుద్ధానికి కాలు దువ్వుతున్నారు. ప్రపంచ యుద్ధ కారుమేఘాలు దట్టంగా అలముకున్నాయి. సామ్రాజ్యవాదులు ప్రపంచ యుద్ధం ద్వారానే తీవ్రతరమవుతున్న ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడాలనీ ఉవ్విళ్లూరుతున్నారు. ప్రాంతీయ యుద్ధాలను రావణకాష్టంలా మండిస్తూ ప్రపంచ శాంతి సుస్థిరతలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నారు.

1991లో సోవియట్ యూనియన్ కూలిపోయి, సామ్రాజ్యవాదంలో సాపేక్షిక స్థిరత్వం ఏర్పడడం వల్ల గ్లోబలైజేషన్ ఒక ముఖ్య పరిణామంగా ముందుకొచ్చింది. సామ్రాజ్యవాదానికి సంబంధించి ఒక రూపమే ప్రపంచీకరణ. రష్యా, చైనా వైఫల్యాల కారణంగా సామ్రాజ్యవాదులు తమకు అనుకూలంగా ఏర్పడిన పరిస్థితులను ఉపయోగించుకుని ఆర్థిక కార్యకలాపాలను విస్తరించుకుంటూనే నయా ఉదారవాద విధానాల ముసుగులో వెనుకబడిన దేశాల మీద, అక్కడి ప్రజల మీద పాశవికమైన దాడులు చేశారు. ఇరాక్, అఫ్ఘానిస్తాన్, లిబియా, యుగోస్లావియా దేశాల మీద యుద్ధాలు ప్రకటించారు. మూడవ ప్రపంచ దేశాధినేతల నివాస భవనాల మీదనే బాంబుల వర్షం కురిపించి, వాటిని ధ్వంసం చేసి వాళ్లను లొంగదీసుకోవాలని, ఆ నాయకులను తరిమి కొట్టి, నిర్బంధించి, ఉరితీయడం వంటి దమనకాండలను కొనసాగించారు. కానీ ఈ దురాక్రమణ చర్యలేవీ వారిని సంక్షోభ సుడిగుండం నుంచి కాపాడలేకపోయాయి. ప్రపంచ ఆర్థిక పరిస్థితి క్రమక్రమంగా మారుతూ వస్తోంది. 2008లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మొదలైన మాంద్యం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. దాని నుంచి ఇంపీరియలిజం బయటపడలేకపోవడం, సంక్షోభం రోజురోజుకూ విస్తరిస్తున్న పరిస్థితుల పూర్వరంగంలో మూడవ ప్రపంచ యుద్ధం సంభవించే దిశలో పరిణామాలు జరుగుతున్నాయి. అదే ప్రస్తుత పరిస్థితికి సంబంధించిన ప్రధాన లక్షణం.



> ప్రపంచవ్యాప్తంగా ప్రజలు నయా ఉదారవాద విధానాలను తిప్పికొడుతూ పోరాటాలలో సమైక్యమవుతున్నారు. ఈ పరిణామాలన్నీ అమెరికా, యుకె, యూరప్ పాశ్చాత్య సామ్రాజ్యవాదుల ప్రపంచాధిపత్యానికి తీవ్ర అవరోధంగా తయారయ్యాయి. ప్రపంచ శాంతి, సుస్థిరత, సామాజిక న్యాయం, సోషలిజం లక్ష్యాలుగా పెంపొందుతున్న ఈ ఉద్యమాలను నిర్మూలించాలనే పథకంలో భాగంగానే నేడు సామ్రాజ్యవాదులు ప్రపంచ యుద్ధ సన్నాహాలను ముమ్మరం చేస్తున్నారు.

సోవియట్ యూనియన్‌ను విచ్ఛిన్నం చేయడమే గాక ఆ యూనియన్‌లోని పలు దేశాలను నాటో మిలిటరీ కూటమిలో చేర్చుకుని రష్యా ఆర్థిక వనరులను కొల్లగొట్టడానికి వీలుగా దానిని పాదాక్రాంతం చేసుకోవడం కోసం అమెరికన్ సామ్రాజ్యవాదులు ఉక్రెయిన్‌లో అక్రమంగా ఫాసిస్టు రాజ్యాన్నే నెలకొల్పి, రష్యాపై పాశవిక దురాక్రమణకు పాల్పడ్డారు. రెండు సంవత్సరాలకు పైగా అక్కడ భీకర యుద్ధం కొనసాగుతూనే ఉంది. అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ ఫాసిస్టు పాలకులు గత పది నెలలుగా గాజాలో కొనసాగిస్తున్న హత్యాకాండలో నలభై వేల మంది పాలస్తీనా పౌరులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో అత్యధికులు నిరాయుధులైన స్త్రీలు, పిల్లలే. యుద్ధ బాధితులకు అండగా నిలిచిన ఐరాస స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలను కూడా పెద్దయెత్తున మట్టుబెట్టడం కనీవినీ ఎరుగనిది. ఇరాన్‌పై ప్రత్యక్షంగా క్షిపణులతో దాడులు చేస్తూ అది యుద్ధానికి తలపడేలా కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. అమెరికన్ సామ్రాజ్యవాదులు చైనాను చుట్టుముట్టి దెబ్బతీయాలని శతవిధాల ప్రయత్నిస్తున్నారు. మిత్ర దేశాలతో సైనిక ఒప్పందాలు చేసుకుని అనేక సైనిక స్థావరాలను నెలకొల్పి విధ్వంసకరమైన మారణాయుధాలు పోగు చేసుకుని టెర్రరిస్టులుగా పేరొందిన ఫాసిస్టు గ్యాంగులను పెంచి పోషిస్తున్నారు. వెనుకబడిన దేశాలను తమ నయా వలసలుగా మార్చుకుని దోపిడీ పీడనలను నిరాటంకంగా కొనసాగించాలనేది వారి వ్యూహం.

అమెరికా యుద్ధోన్మాద చర్యలన్నీ కదిలిపోతున్న తమ ఏక ధృవ ప్రపంచ ప్రాబల్యాన్ని కాపాడుకోవడానికే ఉద్దేశించినవి. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా గణనీయంగా వృద్ధి చెందింది. పాశ్చాత్య దేశాలకు దీటుగా చైనా బలమైన ఆర్థిక శక్తిగా పెంపొందింది. లాటిన్ అమెరికా దేశాలలో వామపక్ష శక్తుల విజయపరంపర కొనసాగుతోంది. మాలి, బుర్కినాఫాసో, నైజర్ మొదలైన ఆఫ్రికా దేశాలలో స్వాతంత్ర్య పోరాటాలు బలోపేతమవుతున్నాయి. రష్యాపై ఆంక్షలు విధించి దానిని ఆర్థికంగా కృంగదీయాలనే ప్రయత్నాలు విఫలమయ్యాయి. యూరప్ ప్రజలు తమ జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకోవడం కోసం పెద్దయెత్తున సంఘటితపడి వీధుల్లోకి వచ్చి పోరాడుతున్నారు. భారత ప్రజానీకం హిందుత్వ ఫాసిస్టు పాలకుల విధానాలను ప్రతిఘటిస్తున్నారు. చైనా, క్యూబా, వియత్నాం, ఉత్తర కొరియా దేశాలలో ప్రజలు సోషలిస్టు లక్ష్యాలకు పునరంకితమవుతున్నారు. ఒక్క దేశమేమిటి, ప్రపంచవ్యాప్తంగా ప్రజలు నయా ఉదారవాద విధానాలను తిప్పికొడుతూ పోరాటాలలో సమైక్యమవుతున్నారు. ఈ పరిణామాలన్నీ అమెరికా, యుకె, యూరప్ పాశ్చాత్య సామ్రాజ్యవాదుల ప్రపంచాధిపత్యానికి తీవ్ర అవరోధంగా తయారయ్యాయి. ప్రపంచ శాంతి, సుస్థిరత, సామాజిక న్యాయం, సోషలిజం లక్ష్యాలుగా పెంపొందుతున్న ఈ ఉద్యమాలను నిర్మూలించాలనే పథకంలో భాగంగానే నేడు సామ్రాజ్యవాదులు ప్రపంచ యుద్ధ సన్నాహాలను ముమ్మరం చేస్తున్నారు.

సామ్రాజ్యవాదం అంటేనే యుద్ధం. సామ్రాజ్యవాదం ఉన్నంతవరకు ప్రపంచ యుద్ధ ప్రమాదాలు సమసిపోవు. రెండవ ప్రపంచ యుద్ధం ముందు కాలం నాటి పరిస్థితులు నేడు పునరావృతమవుతున్నాయి. గత సంవత్సరం రోమ్ నగరంలో 40 దేశాల కమ్యూనిస్టు నాయకులు, వర్కర్స్ పార్టీల ప్రతినిధులు సమావేశమై ప్రపంచ ప్రజలు సమైక్యంగా ఫాసిస్టు శక్తులను ఓడించాలనీ పిలుపునివ్వడం గమనించదగిన పరిణామం. హిట్లర్ నాజీ సైన్యాలను మట్టికరిపించిన సోవియట్ ప్రజల త్యాగాన్నీ, సాహసాన్నీ స్ఫూర్తిగా తీసుకుని ప్రపంచ కార్మికులు, కమ్యూనిస్టులు, ప్రజాస్వామికవాదులు, అభ్యుదయకాముకులు, వామపక్షీయులు సంఘటితమై మూడవ ప్రపంచ యుద్ధ ప్రమాదాన్ని నివారించడానికి ముందుకు రావాలి. అందుకు అంతర్జాతీయ ఫాసిస్టు వ్యతిరేక ఐక్య సంఘటన ఏర్పాటు బాటలు వేస్తుంది. ఇంపీరియలిస్టు మిలిటరిజాన్నీ, నయా ఫాసిజాన్నీ, నయా వలసవాదుల యుద్ధోన్మాదాన్నీ నిరసిస్తూ కలిసివచ్చే శక్తులన్నింటినీ కలుపుకుని కమ్యూనిస్టులు అగ్రభాగాన నిలిచి పోరాడినపుడే విస్తృత ప్రజా ఐక్యసంఘటన సుసాధ్యమవుతుంది.

● డాక్టర్ శ్రీనివాస్
కె.ఎస్. మెమోరియల్ కమిటీ

సోమసుందర్ శతజయంతి సదస్సు

సాహిత్య అకాడమీ – క్రియ సొసైటీ, కాకినాడ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఆవంత్స సోమసుందర్ శత జయంత్యుత్సవ సదస్సు అక్టోబర్ 26 ఉదయం 10 గంటల నుంచి గాంధీ భవన్, కాకినాడలో జరుగుతుంది. ప్రారంభ సమావేశంలో అధ్యక్ష్యోపన్యాసం సి. మృణాళిని; ముఖ్య అతిథి చందు సుబ్బారావు; గౌరవ అతిథులు కె. వెంకట్రావు, ఎర్రమిల్లి ఉషాకుమారి; కీలకోపన్యాసం నందిని సిధారెడ్డి, వందన సమర్పణ ఎస్.ఎస్.ఆర్ జగన్నాథరావు. జి. సీతా రామస్వామి అధ్యక్షత వహించే మొదటి సమావేశంలో వక్తలు– ఎన్. ఈశ్వరరెడ్డి, బొల్లోజు బాబా, వాడ్రేవు వీరలక్ష్మి దేవి. వాడ్రేవు వీరలక్ష్మిదేవి అధ్యక్షత వహించే రెండవ సమావేశంలో వక్తలు– కస్తూరి నాగమురళి శంకర్, నండూరి రాజగోపాల్, ఆర్. సీతారామారావు. మేకా మన్మథరావు అధ్యక్షత వహించే ముగింపు సమావేశంలో ముగింపు సందేశం శిఖామణి.

– సాహిత్య అకాడమీ

సవరణ: ఆంధ్రజ్యోతి సాహిత్య పేజీ వివిధ నిన్నటి సంచికలో (21.10.2024) జి.ఎన్. సాయిబాబా ఇంగ్లీష్ కవితకు శివప్రసాద్ తెలుగు అనువాదాన్ని అచ్చు వేశాం. కానీ అచ్చులో సాయిబాబా పేరు రాలేదు. ఈ పొరపాటుకు చింతిస్తున్నాం. – ఎడిటర్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

అభివృద్ధికి మార్గం, ఉపాధికి ఊతం

ప్రపంచంలో పలు దేశాల ఆర్థిక వ్యవస్థకు, ఉపాధి కల్పనకు ఎంఎస్ఎంఈ (మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్)లు పునాదిగా ఉన్నాయి. యూఎస్ఏలో 99.9 శాతం, జపాన్, ఈయు (యూరోపియన్ యూనియన్)లో 99 శాతం, చైనాలో 90 శాతం వ్యాపారం ఎంఎస్ఎంఈల ద్వారానే జరుగుతోంది. ఆయా దేశాల జీడీపీలో ఈ రంగం వాటా చూస్తే... ఈయులో 85 శాతం, చైనాలో 69, జపాన్‌లో 55, జర్మనీ, యూఎస్ఏలలో 50 శాతంగా ఉంది. ఈయు, చైనా, జర్మనీ, జపాన్, అమెరికా దేశాల్లో వరుసగా 85, 80, 75, 70, 50 శాతం ఉపాధి అవకాశాలను ఎంఎస్ఎంఈలు కల్పిస్తున్నాయి. ప్రపంచంలో 90 శాతం వ్యాపారం, 70 శాతం వరకు ఉద్యోగాల కల్పన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ద్వారానే జరుగుతోంది. అందుచేతనే మౌలిక సదుపాయాల కల్పన, సాంకేతిక నవీకరణ, పెట్టుబడులు, మార్కెట్ విస్తరణలో సహాయం, పన్ను రాయితీలు, పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డి) కోసం ఆర్థిక సాయం అందించడం ద్వారా అభివృద్ధి చెందిన దేశాలు ఎంఎస్ఎంఈల పురోభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నాయి.

భారతదేశంలో కూడా ఆర్థికాభివృద్ధి, ఉపాధి, పారిశ్రామికరంగ ఎదుగుదలలో ఎంఎస్ఎంఈలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు సృష్టించి ఉపాధి, ఆర్థికాభివృద్ధి సాధించడంతో పాటు ప్రాంతీయ అసమానతలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. మన దేశంలో ఈ ఏడాది అక్టోబర్ 3 వరకు 5.17 కోట్ల ఎంఎస్ఎంఈలు నమోదు కాగా, వాటిలో 98 శాతం సూక్ష్మ పరిశ్రమలు. వీటి ద్వారా సుమారు 22 కోట్ల మందికి ఉపాధి లభించడమే కాకుండా దేశ జీడీపీకి 30 శాతం ఈ రంగమే సమకూరుస్తోంది. భారత్ ఎగుమతుల్లో 50 శాతం వాటా ఎంఎస్ఎంఈ లదే. దేశం మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో 45 శాతం వరకు, ఎగుమతులలో సుమారు 40 శాతం వరకు ఈ రంగం అందిస్తూ, ప్రధాని మోదీ 'మేక్ ఇన్ ఇండియా' నినాదాన్ని సాకారం చేస్తున్నది. పెద్ద పరిశ్రమలకు అవసరమైన అనేక ఉత్పత్తులను సరఫరా చేసి పారిశ్రామికాభివృద్ధికి తోడ్పడుతున్నది. సమీప భవిష్యత్తులో దేశంలో ఎంఎస్ఎంఈలు 7.5 కోట్ల యూనిట్లకు చేరుకునే అవకాశం ఉందని, తద్వారా మరో 10 కోట్ల మందికి ఉపాధి లభించే అవకాశం వస్తుందని భావిస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా ఉండి భారీ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఈ రంగానికి, అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే ప్రభుత్వపరంగా లభిస్తున్న ప్రోత్సాహం, సహకారం తక్కువే.

డిజిటల్ సాంకేతికాలు, బిగ్ డేటా, ఆటోమేషన్ల పారిశ్రామిక యుగం నడుస్తుండగానే రోబోలు, స్మార్ట్ యంత్రాలతో మరో పారిశ్రామిక విప్లవం అడుగిడుటానికి సిద్ధంగా ఉంది. డిజిటల్ సాంకేతికలతో పారిశ్రామిక రంగాన్ని రూపాంతరం చెందించడానికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు పెట్టుబడులు పెడుతున్నాయి. ఎంఎస్ఎంఈ రంగానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తున్నా, ప్రస్తుత డిజిటల్ యుగంలో పోటీపడాలంటే కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా ఎనలిటిక్స్, ఈ-కామర్స్ వంటి ఆధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవాలి. వ్యాపార ఇంక్యుబేటర్ల సేవలు పొందడంతో పాటు, భారీ పరిశ్రమలతో భాగస్వామ్యం ఏర్పరుచుకుని నైపుణ్యాన్ని పెంచుకోవాలి. సాంప్రదాయ పంథా నుంచి డిజిటల్ మార్గానికి మరలాలి. భావి మార్కెట్ రీతులను అధ్యయనం చేసి తదనుగుణంగా ఉత్పత్తి, మార్కెటింగ్ చేపట్టడానికి 'ప్రిడిక్టివ్ ఎనలిటిక్స్', వినియోగదారుల అభిరుచి మేరకు అవసరమైన మేరకే ఉత్పత్తి చేసి సరఫరా చేయడానికి, సమర్థవంతంగా వ్యాపారం నిర్వహించడానికి 'డేటా ఎనలిటిక్స్'ను ఉపయోగించుకోవాలి. ఐఓటీ, బ్లాక్‌చైన్ సాంకేతికతలను ఉత్పత్తి ప్రక్రియలో వినియోగించుకోవాలి.

> ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో చిన్న పరిశ్రమల ప్రాముఖ్యతను, అవసరాన్ని రాష్ట్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం గుర్తించింది. ఇటీవల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ముసాయిదా పాలసీపై సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చే ఐదేళ్లలో ఈ రంగంలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, మరో 22 లక్షల కొత్త యూనిట్లను ఏర్పాటు చేయాలని మార్గ నిర్దేశనం చేశారు.



పారిశ్రామిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యంత్రాలను, నైపుణ్యాలను ఆధునీకరించకపోవడం, ప్రస్తుత మార్కెటింగ్ పద్ధతులను ఆకళింపు చేసుకోకపోవడం వల్ల చాలా వరకు ఎంఎస్ఎంఈలు నష్టపోతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో చిన్న పరిశ్రమల ప్రాముఖ్యతను, అవసరాన్ని రాష్ట్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం గుర్తించింది. ఇప్పటికి రాష్ట్రంలో 9.89 లక్షల ఎంఎస్ఎంఈలు ఉన్నాయి. ఇటీవల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ముసాయిదా పాలసీపై సమీక్షించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వచ్చే ఐదేళ్లలో ఈ రంగంలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, మరో 22 లక్షల కొత్త యూనిట్లను ఏర్పాటు చేయడం ద్వారా 2029 నాటికి కనీసం ఐదు లక్షలకు పైగా ఉపాధి అవకాశాలు కల్పించాలని.. 'ఒక కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త' అనే నినాదంతో చిన్న పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించాలని మార్గనిర్దేశనం చేశారు. ఇందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు పిపిపి విధానంతో ప్రైవేటు వ్యక్తులను భాగస్వాములను చేయడం ద్వారా కొత్తగా వంద ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. మొదటగా దేశం నుంచి భారీగా ఎగుమతి అవకాశాలున్న పది రంగాలకు సంబంధించిన ఉత్పత్తులను తయారుచేసే కనీసం 500 ఎంఎస్ఎంఈలను గుర్తించి అవసరమైన శిక్షణ, మౌలిక సదుపాయాలను కల్పించి, అంతర్జాతీయ మార్కెట్లో 'మేడిన్ ఆంధ్రా' బ్రాండుతో పోటీపడేలా తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. ఎంఎస్ఎంఈల ఏర్పాటు కోసం క్లస్టర్ల ఆధారంగా మౌలిక సదుపాయాలు కల్పించడం, కొత్తగా యూనిట్లు ఏర్పాటు చేసే వారికి మార్గదర్శకత్వం చేయడం, ఆర్థిక అవసరాలకు పరిష్కారాలు చూపడం, పోటీ తత్వాన్ని పెంచడం, ఉత్పత్తుల విక్రయాలకు సహాయపడటం, ఎగుమతులను ప్రోత్సహించడంతో పాటు వాటి అభివృద్ధికి సంబంధించిన ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించడమనే కీలకాంశాల ఆధారంగా అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన.

కొత్తగా ఏర్పాటు చేసే పరిశ్రమలతో పాటు ఇప్పటికే ఉత్పత్తి చేస్తూ సాంకేతికతను మెరుగుపరచుకుంటున్న పరిశ్రమలకు రాయితీలు, ప్రోత్సాహకాలను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'మేడిన్ ఆంధ్రా' బ్రాండ్ ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేందుకు ఉత్పత్తుల విక్రయాల ప్రదర్శనలు.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఈ-కామర్స్ పోర్టల్‌కు అనుసంధానం వంటి అంశాల్లో ప్రభుత్వం సహకారం అందిస్తుంది. అలాగే ప్రపంచ వాణిజ్య అవకాశాలు అందిపుచ్చుకునేందుకు వీలుగా విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలలో మూడు అంతర్జాతీయ వాణిజ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ముఖ్యమంత్రి దార్శనికతకు వాస్తవ రూపం ఇచ్చే విధంగా అధికారులు క్రియాశీలకంగా పనిచేస్తే ఎంఎస్ఎంఈ రంగంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత స్థానానికి చేరడమే కాక 'మేకిన్ ఇండియా' ఉత్పత్తులకు తోడుగా 'మేడిన్ ఆంధ్రా' ఉత్పత్తులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చలామణి కావడం అసాధ్యమేమీ కాదు.

■ లింగమనేని శివరామప్రసాద్





నేడే డ్రోన్ షో

పున్నమిఘాట్‌కు చేరిన 5,500 డ్రోన్లు

సాయంత్రం 7 గంటల తర్వాత షో

- 4 గంటల నుంచే వివిధ కార్యక్రమాలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న లేజర్ బీమ్ షో
- మ్యూజిక్ బ్యాండ్, బాణాసంచా హంగామా
- ప్రవేశం ఉచితం.. రేపు కూడా కొనసాగింపు



ఎప్పుడెప్పుడా.. అని ఎదురుచూస్తున్న డ్రోన్ షోకు వేళైంది. మంగళవారం సాయంత్రం పున్నమిఘాట్‌లో ఈ షో ప్రారంభంకానుంది. మొత్తం ఏడు థీమ్ చిత్రాలను డ్రోన్ల ద్వారా ప్రదర్శిస్తారు. విమానయానం.. తద్వారా డ్రోన్లయానానికి పితామహుడిగా రైట్ బ్రదర్స్ చిత్రాన్ని ముందుగా ఆవిష్కరిస్తారు. ఆ తర్వాత భారీ బోయింగ్ విమానం, డ్రోన్, రాజధాని అమరావతిని స్మరించేలా ధ్యానబుద్ధుడు, గ్లోబ్ చిత్రాలను ప్రదర్శిస్తారు. జాతీయ జెండాతో పాటు ఐసీఏవో లోగోను ఆవిష్కరిస్తారు. మొత్తం 5,500 డ్రోన్లతో ఆకాశంలో ఈ సప్తవర్ణ చిత్రాలు ఆవిష్కృతమవుతాయి. దాదాపు అరగంట పాటు షో జరుగుతుంది. ప్రత్యేకంగా అమర్చిన ఎల్ఈడీ లైట్ల ద్వారా వీటిని ఆవిష్కరిస్తారు. ఈ చిత్రాలన్నీ వరుస క్రమంలో చక్కగా కనిపించటానికి డ్రోన్లను ఆయా స్థానాల్లో నిలబెట్టేందుకు కంప్యూటర్ ప్రోగ్రామింగ్ దోహదపడుతుంది. ఇందులో భాగంగా సోమవారం డ్రోన్లన్నింటినీ సిద్ధం చేసుకున్నారు. ఈ ప్రదర్శన మంగళవారం రాత్రి 7 గంటల తర్వాత మొదలవుతుంది. సాయంత్రం 4 గంటల నుంచి బబ్బూరి గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ముంబయి డ్యాన్సర్ల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అవి పూర్తికాగానే లేజర్ బీమ్ షో ఉంటుంది. అలాగే, వీనులవిందైన సంగీతం వీక్షకులను కట్టిపడేస్తుంది. చివరిగా బాణాసంచా పేలుళ్లు ప్రదర్శనలో హైలైట్‌గా నిలుస్తాయి. - (ఆంధ్రజ్యోతి, విజయవాడ)

గుండెల్లో రైళ్లు

దయచేసి వినండి.. విజయవాడ రైల్వేస్టేషన్‌లో జాగ్రత్తండి..

- గంజాయి, బ్లేడ్‌బ్యాచ్, ఆకతాయిలకు అడ్డాగా ట్రాక్‌లు
- ఇటీవల లోకో పైలెట్ హత్య తర్వాత భయం భయం
- ఒంటరిగా తిరగడానికి బెదిరిపోతున్న ఉద్యోగులు
- గంజాయి బ్యాచ్‌కు ఆవాసాలుగా ఫుట్‌పాత్‌లు

నైజాంగేటు వద్ద పరిస్థితి మరీ దారుణం



నైజాంగేటు వద్ద ట్రాక్..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కొద్దిరోజుల క్రితం.. ఇంజన్‌ను తీసుకురావడానికి నైజాంగేటు వద్ద ఉన్న పాత ఎఫ్ క్యాబిన్ వద్దకు వెళ్లిన లోకో పైలెట్ ఎబునైజర్‌ను బిహార్‌కు చెందిన దేవేంద్ర సాహు అనే యువకుడు ఇనుప రాడ్డుతో కొట్టి చంపాడు. ఈ ఘటనకు ముందు నైజాంగేటు వద్ద ఆటోలో నిద్రపోతున్న డ్రైవర్‌పైనా దాడి చేశాడు. ఈ ఘటన తర్వాత రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలను ఓ రకమైన భయం ఆవహించింది. ఈ భయం అటు రైల్వే ఉద్యోగుల్లోనూ, ఇటు ప్రయాణికుల్లోనూ కనిపిస్తోంది. విధి నిర్వహణలో ట్రాక్‌పై నుంచి చీకటి ప్రదేశంలోకి వెళ్లడానికి సిబ్బంది గుండెలు గుప్పెట్లో పెట్టుకుంటున్నారు.

ఒంటరిగా రైల్వే ట్రాక్‌పై నడిచి వెళ్లాలంటే భయం. రైలు.. మధ్యలో ఆగితే కిందకు దిగాలంటే భయం. ఇదేదో సాధారణమైన, చిన్న రైల్వేస్టేషన్ దగ్గర పరిస్థితో కాదు. దేశంలోనే ఏ1 రైల్వేస్టేషన్‌గా పేరొందిన విజయవాడ రైల్వేస్టేషన్ వద్ద దుస్థితి. స్టేషన్ లోపలే కాదు.. బయటకు వెళ్లాలన్నా ఈ భయం వెంటాడుతోంది. ఆకతాయిలు, గంజాయి బ్యాచ్ సంచారం దడ పుట్టిస్తుంటే.. ఇటీవల జరిగిన లోకో పైలెట్ హత్య మరింత ఆందోళనలోకి నెట్టింది.

నైజాంగేటు వద్ద భయంగా..

గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు రైల్వేస్టేషన్‌ను కేంద్రంగా చేసుకుని కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. స్టేషన్‌కు పరిసర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు ఉన్నాయి. వాటిపై ఎక్కువగా యాచకులు, అనాథలు ఉంటారు. వారికి ఈ ఫుట్‌పాత్‌లే నివాస కేంద్రాలు. వర్షాలు కురిసినప్పుడు మాత్రం పరిసర ప్రాంతాల్లో తలదాచుకుంటారు. ఇలా ఫుట్‌పాత్‌లపై ఉంటున్న వారిలో గంజాయి బాబులు ఎక్కువ. పగలంతా వేర్వేరు ప్రదేశాల్లో తిరిగిన వారు రాత్రికి స్టేషన్ పరిసర ప్రాంతాలకు చేరుకుంటున్నారు. రైల్వేస్టేషన్‌లో మొత్తం పది ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. ఇవికాకుండా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఉన్నాయి. రైల్వేస్టేషన్‌లోకి చేరుకోవడానికి ప్రధాన ద్వారాలే కాకుండా వేర్వేరు మార్గాలున్నాయి. గంజాయి బాబులు ప్లాట్‌ఫాంలు దాటాక ఉన్న ప్రదేశాల్లో ఉంటున్నారు. అలాగే, రైల్వే కోర్టుకు కొంతదూరాన ఉన్న ట్రాక్‌లపై కొన్ని బోగీలు నిత్యం నిలిచి ఉంటాయి. కొంతమంది ఈ బోగీల్లో ఉంటున్నారు. నైజాంగేటు ప్రాంతంలో పరిస్థితి మరీ దారుణం. పాతరాజరాజేశ్వరిపేట, అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్ వరకు ఎలాంటి విద్యుద్దీపాలు ఉండవు. దీంతో గంజాయి బ్యాచ్ రైల్వేట్రాక్‌లపై సంచారం చేస్తోంది.

పట్టాలపైనే గంజాయి వ్యాపారం

గంజాయి అమ్మకాలు, కొనుగోళ్లు రైలు పట్టాలపైనే జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ బ్యాచ్ పట్టాలపై ఉండటానికి కారణం కూడా ఉంది. రాత్రి సమయాల్లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు గస్తీ నిర్వహిస్తారు. ఎవరైనా కనిపిస్తే అదుపులోకి తీసుకుంటారు. వారికి చిక్కకుండా - మిగతా 6లో

సస్పెక్ట్ షీటర్ హల్‌చల్

- గంజాయి సేవించి గ్యాంగ్‌తో కలిసి దౌర్జన్యం
- యువకులను చితకబాది బ్లేడ్లతో బెదిరింపు
- ఒకేరోజు మూడు ఫిర్యాదులు

8లో




నివాళి

పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సోమవారం ఘనంగా జరిగింది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనిత, సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, డీజీపీ ద్వారకా తిరుమలరావు, నగర పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు తదితరులు పాల్గొన్నారు.



నినాదం

తమ సమస్యలు పరిష్కరించాలని విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో వైద్య సేవలందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌వో) రోడ్డెక్కారు. స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహించి నినదించారు. 6లో



ఉధృతంగా కృష్ణమ్మ

ప్రకాశం బ్యారేజీ వద్దకు మరో 2 లక్షల క్యూసెక్కులు

విజయవాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలతో ప్రకాశం బ్యారేజీకి వరద పెరుగుతోంది. ఎగువ నుంచి 2లక్షల28వేల328 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో బ్యారేజీ 70 గేట్లను ఐదడుగుల మేర పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టు నుంచి 1.80 లక్షలు, పాలేరు నుంచి 510, కీసర నుంచి 58,600 క్యూసెక్కుల నీరు వస్తోంది. ఈ నీటి నుంచి కేఈ ప్రధాన కాల్వకు 5,309, కేడబ్ల్యూ కాల్వకు 2,519 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. సోమవారం రాత్రి నుంచి ఈ వరద తగ్గుముఖం పట్టింది. మంగళవారం మరింత తగ్గే అవకాశాలున్నాయి.

నీటి సంఘాల ఎన్నికలకు మోగిన నగారా

షెడ్యూల్ విడుదల చేసిన జలవనరుల శాఖ

- ఉమ్మడి జిల్లాలో ఎన్ఎస్‌పీ కింద 17 డీసీలు, 106 నీటి వినియోగ సంఘాలు
- డెల్టాలో 32 డీసీలు, 220 నీటి సంఘాలు


(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లాలో నీటి సంఘాల ఎన్నికలకు నగారా మోగింది. నవంబరు 20న నోటిఫికేషన్ వెలువడనుంది. దీనికి ముందు ఓటర్ల జాబితా సవరణలు, తుది ఓటర్ల జాబితా ప్రచురణ నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు 29 రోజుల షెడ్యూల్‌ను జలవనరుల శాఖ విడుదల చేసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ సాగు నీటి సంఘాలను నిర్వీర్యం చేసింది. సాగునీటి సంఘాలు, ప్రాజెక్టు కమిటీ పదవీకాలం - మిగతా 8లో

జాతీయపతాక రూపశిల్పికి

సముచిత గౌరవం



మచిలీపట్నం మెడికల్ కళాశాల



మచిలీపట్నం వైద్య కళాశాలకు పింగళి వెంకయ్య పేరు

జీవో ఎంఎస్ నంబరు 132ను జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్యకు కూటమి ప్రభుత్వం సముచిత గౌరవం కల్పించింది. సీఎం చంద్రబాబు చొరవతో మచిలీపట్నం మెడికల్ కళాశాలకు పింగళి వెంకయ్య పేరును ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబరు 132ను సోమవారం జారీ చేసింది. ఈ నెల 2న మచిలీపట్నం వచ్చిన ముఖ్య మంత్రిని బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి కలిసి మచిలీపట్నం మెడికల్ కళాశాలకు పింగళి వెంకయ్య పేరు పెట్టాలని అభ్యర్థించారు. ఆయన అభ్యర్థన మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై రెండు జిల్లాల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇన్నాళ్లకు జాతీయ నేతకు సముచిత స్థానం లభించింది.

- బందరు జాతీయ కళాశాల అధ్యాపకుడిగా పనిచేసిన పింగళి
- మహాత్మాగాంధీ సూచనతో జాతీయ పతాకానికి రూపకల్పన

సీఎం దృష్టికి 'పింగళి' విషయం తీసుకెళ్లిన ఎంపీ బాలశౌరి

(మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి) : పింగళి హనుమంతరాయుడు, వెంకటరత్నం దంపతులకు 1878, ఆగస్టు 2న భారత జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జన్మించారు. చల్లపల్లి మండలం యార్లగడ్డ, మొవ్వ మండలం భట్లపెనుమర్రు, మోపిదేవి మండలం పెదకళ్లేపల్లిలో ఆయన బాల్యం, విద్యాభ్యాసం కొనసాగింది. భట్లపెనుమర్రులో ప్రాథమిక విద్యను, మచిలీపట్నం హిందూ హైస్కూలులో ప్రాథమికోన్నత విద్యను పింగళి అభ్యసించారు. పామర్రు గ్రామ కరణం కుమార్తె రుక్మిణమ్మను వివాహం చేసుకున్నారు. ఉన్నతవిద్యాభ్యాసం పూర్తి చేసుకున్న పింగళి 19వ ఏట సైన్యంలో చేరేందుకు ముంబై వెళ్లారు. అప్పట్లో జరిగిన బోయర్ యుద్ధంలో ఆయన పాల్గొన్నారు. అక్కడ జాతిపిత మహాత్మాగాంధీని కలుసుకున్నారు. చదువుకోవాలనే అభిలాషతో ఆయన లాహోర్‌లోని డీఏవీ కళాశాలలో చేరారు. అక్కడ ఇంగ్లీష్, జపాన్, సంస్కృతం, ఉర్దూ భాషలను నేర్చుకుని వాటిపై పట్టు సాధించారు. జపాన్ భాషలో ఆయన అనర్గళంగా మాట్లాడేవారు. తనకు జపాన్ భాష నేర్పిన ప్రొఫెసర్ గోటేకు వెంకయ్య తెలుగుభాష నేర్పించారు. మచిలీపట్నంలోని ఆంధ్రా జాతీయ కళాశాలలో వెంకయ్య అధ్యాపకుడిగా ఎనిమిది సంవత్సరాల పాటు పనిచేశారు. వ్యవసాయంపైనా పింగళికి మక్కువ ఎక్కువ. 1909లో ఏలూరులో జరిగిన వ్యవసాయ పరిశోధనా ప్రదర్శనలో పింగళి ప్రతిభను గుర్తించి ఆయనకు బంగారు పతకాన్ని బహూకరించారు. పింగళి వ్యవసాయంలో చేసిన పరిశోధనలు గుర్తించిన బ్రిటీష్ ప్రభుత్వం రాయల్ అగ్రికల్చర్ సొసైటీలో ఆయనకు సభ్యత్వమిచ్చి గౌరవించింది.

- మిగతా 8లో

టీడీపీలోకి వైసీపీ కార్పొరేటర్లు, నేతలు

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే ఉమ

8లో

ట్రాఫిక్ అస్త్రం!

గూగుల్ మ్యాప్ ద్వారా అప్‌డేట్స్

నియంత్రణకు ప్రత్యేక యాప్‌ను రూపొందించిన కాప్స్

6లో

లిఫ్ట్ అడిగి.. కానరాని లోకాలకు..

నున్న శివారులో రోడ్డు ప్రమాదం

బైకర్ సహా లిఫ్ట్ అడిగిన భవానీ మృతి

విజయవాడ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విధి ఎప్పుడు, ఎలా, ఎవరిని బలి తీసుకుంటుందో ఎవరికీ తెలియదు. ఇందుకు నున్న శివారు పాలెం అడ్డరోడ్డులో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదమే నిదర్శనం. సెక్యూరిటీ గార్డుగా విధులకు వెళ్లాలని ఒకరు బైకుపై బయల్దేరగా, భవానీ మాలధారులకు సమయానికి భోజనం వండి పెట్టాలని మరొకరు బైకరును లిఫ్ట్ అడిగి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందారు. వివరాల ప్రకారం.. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన సుంకర దుర్గారావు (43) ఆర్మీలో పనిచేసి రిటైరై ఆగిరిపల్లిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. విధుల నిమిత్తం సోమవారం ఉదయం ద్విచక్రవాహనంపై నున్న మీదుగా ఆగిరిపల్లి వెళ్తుండగా, అదే గ్రామానికి చెందిన వంటమేస్త్రి సుంకర సాంబశివరావు (53) స్వాములకు వంట పనుల నిమిత్తం సూరంపల్లి వెళ్లేందుకు రోడ్డుపై నిలుచున్నారు. దుర్గారావును లిఫ్ట్ అడిగారు. దీంతో ఇద్దరూ కలిసి బైకుపై వెళ్తుండగా, పాలెం అడ్డరోడ్డు సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం వీరిని ఢీకొంది. దీంతో ఇద్దరూ వాహనంతో సహా ఎగిరి రోడ్డు పక్కనే ఉన్న చెట్లలో పడి అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న నున్న రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఒకరి మృతి

- మరొకరికి గాయాలు
- గుణదలలో ఘటన

8లో

బెజవాడ నగరంలో రోజురోజుకూ తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్యపై పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ప్రధాన సెంటర్లలో ట్రాఫిక్ నియంత్రణకు సాంతిక పరిజ్ఞానంతో ప్రత్యేక డ్రోన్‌లను వినియోగించనున్నారు. ట్రాఫిక్ జంక్షన్లుగా ఉన్న బెంజ్‌సర్కిల్, రామవరప్పాడురింగ్, వారధి, ప్రకాశం బ్యారేజీ, పీఎన్‌బీఎస్, గొల్లపూడి వైజంక్షన్ వంటి ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా రహదారులపై ట్రాఫిక్ వాస్తవ పరిస్థితిని గూగుల్ మ్యాప్ ద్వారా గమనిస్తు డ్రోన్లను ఎంజీ రోడ్డులో ఉన్న ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి నియంత్రణ చర్యలు చేపట్టనున్నారు.



ట్రాఫిక్ అస్త్రం!

- నియంత్రణకు ప్రత్యేక యాప్‌ను రూపొందించిన కాప్స్
- గూగుల్ మ్యాప్ ద్వారా అప్‌డేట్స్
- కీలక ప్రాంతాల్లో డ్రోన్లతో ప్రత్యేక వీక్షణ
- అప్పటికప్పుడు వ్యూహాత్మక ప్రణాళికలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

స్క్రూబ్రిడ్జి వైపు నుంచి బందరు రోడ్డులోకి వాహనాలు వెళ్లాల్సి ఉంది. ఈ వాహనాలన్నీ బెంజ్ సర్కిల్ వద్ద రెడ్‌సిగ్నల్ పడటంతో ఆగిపోయాయి. తర్వాత కాసేపటికి గ్రీన్‌సిగ్నల్ పడింది. సరిగ్గా ఆ వాహనాలు జంక్షన్ వద్దకు వచ్చేసరికి మళ్లీ రెడ్‌సిగ్నల్ పడింది. మళ్లీ గ్రీన్‌సిగ్నల్ పడే వరకు ఆ వాహనాలు కూడలి వద్ద ఆగిపోయాయి.

● ఎంజీ రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్ వైపు ట్రాఫిక్ కొన్నిసెకన్ల వ్యత్యాసంతో కదులుతోంది. ఆ తర్వాత నిర్మలా కాన్వెంట్ జంక్షన్ వంతు వస్తుంది. ఆ తర్వాత స్క్రూబ్రిడ్జి వైపు ట్రాఫిక్‌ను వదులుతారు. ఒక వైపున ఉన్న ట్రాఫిక్ మొత్తం క్లియరయ్యే వరకు మిగిలిన అన్ని వైపులా ట్రాఫిక్‌ను నిలుపుదల చేస్తారు. సిగ్నల్స్‌తో పనిలేకుండా ట్రాఫిక్‌ను నియంత్రిస్తే కనిపిస్తున్న సమస్య ఇది.

● విజయవాడ నుంచి గుంటూరుకు వెళ్లాలంటే వారధి ఎక్కాలి. ఒక్కోసారి వారధిపై ఏదో ఒక వాహనం బ్రేక్‌డౌన్ అవుతోంది. ఫలితంగా జాతీయ రహదారిపై వాహనాలన్నీ ఆగిపోతున్నాయి. ఈ ప్రభావం స్క్రూబ్రిడ్జి వరకు పడుతోంది.

● నగరంలో కీలకప్రాంతాల్లో ఉన్న ట్రాఫిక్ సమస్య ఇది. వాస్తవానికి ట్రాఫిక్ సమస్య విజయవాడను సతమతం చేస్తోంది. వాహనాల సంఖ్య పెరుగుతున్నంత వేగంగా ఇక్కడ సదుపాయాలు మెరుగుపడడం లేదు. విజయవాడలో ట్రాఫిక్ ప్రధానమైన సమస్యగా ఉందని ఇక్కడికి వచ్చిన ప్రతి పోలీసు కమిషనర్ అంగీకరిస్తున్నారు. ఆ అధికారులు ట్రాఫిక్‌ను గాడిలో పెట్టడానికి ఏదోఒక ప్రయత్నం చేసే లోపు దానికి బ్రేక్‌లు పడుతున్నాయి. నగరంలో ఏటీఎంఎస్ (అడాప్టివ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం) ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఈ లోపు ఎంతోకొంత మేరకు ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనదారుల ఇం'ధనాన్ని' ఆదా చేసుకునేలా చేయాలని పోలీసు అధికారులు భావించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో రహదారులపై వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అస్త్రం యాప్‌ను తీసుకొచ్చారు. ఆ సమయంలో ఈ యాప్ ద్వారా చాలావరకు ట్రాఫిక్ నియంత్రణ జరగడంతో దాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని నిర్ణయించారు.

గూగుల్ మ్యాప్స్‌ను జతచేసి..

నగరంలో ట్రాఫిక్ రద్దీ, అప్‌డేట్ కోసం అనేక యాప్‌లున్నాయి. ఎక్కువమంది వాహనదారులు గూగుల్ మ్యాప్స్‌ను ఉపయోగిస్తారు. పోలీసులు తయారు చేయించిన అస్త్రం యాప్‌ను గూగుల్ మ్యాప్‌కు అనుసంధానం చేశారు. ఈ మ్యాప్‌లో చూపించిన ట్రాఫిక్ రద్దీని యాప్ ట్రాఫిక్ పోలీసులకు చూపిస్తుంది. అంతేగాకుండా కీలక సమయాల్లో, కీలకమైన జంక్షన్లుగా ఉన్న బెంజ్‌సర్కిల్, రామవరప్పాడురింగ్, వారధి, ప్రకాశం బ్యారేజ్, పీఎన్‌బీఎస్, గొల్లపూడి వైజంక్షన్ వంటి ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా రహదారులపై ట్రాఫిక్ వాస్తవ పరిస్థితిని గమనిస్తున్నారు. ఈ డ్రోన్లను ఎంజీ రోడ్డులో ఉన్న ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. ఇక్కడున్న వీడియోవాల్‌పై ట్రాఫిక్ ఎంత దూరంలో ఆగిందో తెలుస్తుంది. మ్యాప్స్ ద్వారా తీసుకున్న సమాచారం జంక్షన్ ట్రాఫిక్ ఎన్నిమీటర్ల దూరంలో ఆగిపోయిందో అలర్ట్ ఇస్తుంది. దీంతో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ట్రాఫిక్ ఉన్నతాధికారులు ఆయా కూడళ్లలో ఇన్‌స్పెక్టర్లకు వైర్‌లెస్ సెట్‌లో సమాచారం చేరవేస్తున్నారు. అప్పటికప్పుడు ట్రాఫిక్ తక్కువగా ఉన్న రహదారులను గుర్తించి వాటిలోకి వాహనాలను మళ్లిస్తున్నారు. ట్రాఫిక్ తక్కువగా ఉన్న రహదారులపై వాహనాలను నిలుపుదల చేసి, ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న రహదారులకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణతోపాటు వాహనదారులు ట్రాఫిక్‌లో ఎక్కువసేపు చిక్కుకుని ఉండకుండా ఉండేందుకు అస్త్రం బాగా ఉపయోగపడుతోందని పోలీసు అధికారులు చెబుతున్నారు. నగరంలో కొత్త సిగ్నల్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చేవరకు అస్త్రం సేవలను వినియోగించుకునే యోచనలో అధికారులు ఉన్నారు.

గణపవరంలో ఇసుక దొంగలు!

- గణపతిగట్టు వద్ద గుట్టలు పోసి అక్రమ రవాణా
- లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలింపు
- లారీ ఇసుకను రూ.30వేలకు విక్రయం
- ఉచిత పథకానికి తూట్లు పొడుస్తున్న మాఫియా
- గ్రామ అధ్యక్షుడు దురుసు ప్రవర్తనపై వీఆర్వో ఫిర్యాదు



గణపవరం గణపతి గట్టు వద్ద గుట్టలుగా ఇసుక

మైలవరంరూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రకటిస్తే.. కొంతమంది అక్రమార్కులు దానికి తూట్లు పొడుస్తున్నారు. గణపవరంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. పదుల సంఖ్యలలో ట్రాక్టర్‌లతో యథేచ్ఛగా ఇసుకను నిల్వచేస్తు పక్క రాష్ట్రానికి అక్రమంగా తరలించి సొమ్ముచేసుకుంటోంది. వారం రోజులుగా జి.కొండూరు మండలం చిన నందిగామ సమీపంలో ఉన్న బుడమేరు వాగు నుంచి కోడూరు మీదుగా ఇసుకను పట్టపగలే గణపవరం గ్రామ సమీపంలోని గణపతి గట్టు వద్ద గుట్టలుగా నిల్వచేస్తున్నారు. అనంతరం రాత్రి వేళల్లో అక్రమ రవాణాకు పూనుకుంటున్నారు. ఒక్కో టిప్పర్ రూ. 30వేలవరకు విక్రయిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీస్ అధికారులు ఇసుక అక్రమ నిల్వలను గుర్తించి మాఫియాపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



ఇసుక తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

దీనిపై తహసీల్దార్ బాలకృష్ణారెడ్డిని వివరణ కోరగా గణపతి గట్టు సమీపంలో ఇసుకను భారీఎత్తున నిల్వ చేసినట్టు సమాచారం వచ్చిందని, నలుగురు వీఆర్వోలను సంఘటనా స్థలానికి పంపి ఇసుకను సీజ్ చేసినట్టు చెప్పారు. ఎవరూ తరలించకుండా వీఆర్వోలను కాపలా ఉంచినట్టు చెప్పారు.

వీఆర్వోతో టీడీపీ నేత వాగ్వాదం

గణపతిగట్టు వద్ద వీఆర్వో స్రవంతితో టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఉమ్మా రమణారెడ్డి కొంత మంది ట్రాక్టర్ డ్రైవర్లను వెంటేసుకొచ్చి వాగ్వాదానికి దిగారు. ఇసుకను తన ఇంటి నిర్మాణం కోసం నిల్వ చేసుకున్నానని, సీజ్‌చేసే హక్కు మీకు ఎవరిచ్చారని ఆమెను ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగినట్టు సమాచారం. విషయం తెలుసుకున్న మైలవరం ఎస్సై సుధాకర్ సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. వీఆర్వో స్రవంతి ఆదివారం రాత్రి మైలవరం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై సుధాకర్ తెలిపారు.

వెల్లటూరులో ఇసుక దందా!

- అక్రమ రవాణాపై రెండు వర్గాల ఘర్షణ
- పలువురికి గాయాలు, పరస్పర కేసుల నమోదు





ఘర్షణ పడుతున్న ఇరు వర్గాలు, తీవ్ర గాయాలతో రామారావు

జి.కొండూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ తరలింపు రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. గ్రామంలో తానుండగా ఇసుకను అక్రమంగా తోలుకోనివ్వనని వెల్లటూరు శివారు భీమరవప్పాడు గ్రామానికి చెందిన మొండితోక గోపాలరావు సీతారాంపురం గ్రామానికి చెందిన ఆకుల రామారావును హెచ్చరించాడు. ఎలా తోలుకోనివ్వవో చూస్తా.. అని రామారావు ఘర్షణకు దిగడంతో రెండు వర్గాలు సోమవారం భీమవరప్పాడు గ్రామం వద్ద బుడమేరు సమీపంలో నెత్తురోడేలా కొట్టుకున్నాయి. ఈక్రమంలో మొండితోక గోపాలరావు ఇటుకరాయితో ఆకుల రామారావు తలపై బలంగా కొట్టడంతో తలపగిలింది. తనను గజ్జల్లో తన్నడంతో బీర్జాలు వాశాయని గోపాలరావు పోలీసులను ఫిర్యాదు చేశాడు. రామారావును చికిత్స నిమిత్తం మైలవరం ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి విజయవాడకు తరలించారు. గోపాలరావు చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరాడు. పరస్పర ఫిర్యాదుల మేరకు రెండు వర్గాల్లో 10 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు.



ఈపూరి అరుణ్, మణికంఠ అలియాస్ (కిట్టు), మాజీ ఎమ్మెల్యే స్టిక్కర్‌తో కారు

మందుబాబుల హల్‌చల్!

- ప్రజా ప్రతినిధుల పేర్లు చెప్పి పోలీసులకే బెదిరింపులు

విద్యాధరపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భవానీపురంలో మందుబాబుల ఆగడాలు మితిమీరుతున్నాయి. ప్రశ్నించిన స్థానికులు, పోలీసులను ప్రజా ప్రతినిధుల పేర్లు చెప్పి బెదిరింపులకు దిగుతున్నారు. ఆదివారం రాత్రి 10 గంటలకు గొల్లపూడికి చెందిన ఈపూరి అరుణ్, భవానీపురం హెచ్.బి.కాలనీకి చెందిన మణికంఠ అలియాస్ కిట్టు అలియాస్ జగదీష్ పూటుగా మద్యం సేవించి ఏపీ39 ఆర్ఎన్18 నెంబరు గల కారులో బబ్బూరి గ్రౌండ్‌లో డ్రోన్ షో వద్దకు వెళ్లారు. అయితే మద్యం మత్తులో ఉన్న వారు బైక్‌పై వెళుతున్న విద్యాధరపురం లేబర్ కాలనీకి చెందిన పలివెల కనకదుర్గ దంపతులను ఢీకొని సమీపంలో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను ఢీకొన్నారు. ఈ సంఘటనతో కనకదుర్గ మద్యం మత్తులో ఉన్నవారిని ప్రశ్నించగా ఆమెతో గొడవపడ్డారు. గ్రౌండ్ వద్ద విధుల్లో ఉన్న ఎస్ఐ ఆనంద్, పోలీసు సిబ్బంది ఎందుకు గొడవ పడుతున్నారని ప్రశ్నించారు. మద్యం మత్తులో ఉన్న మణికంఠ మేము ఎవరమో తెలుసా? ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తాలూకా అని, ఈపూరి అరుణ్ మాజీ ఎమ్మెల్యే జోగి రమేష్ తాలూకా అని బెదిరింపులకు దిగారు. కారుపై జోగి రమేష్ పేరుతో ఉన్న ఎమ్మెల్యే స్టిక్కర్, పోలీసు సైరన్ కూడా ఏర్పాటు చేశారు. పోలీసులు వారిని పట్టుకోవటానికి ప్రయత్నించగా, కిట్టు పరారయ్యాడు. అరుణ్‌ను పోలీసులు పట్టుకుని కారును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. భవానీపురం పోలీసుస్టేషన్‌లో కిట్టుపై ఓ కిడ్నాప్ కేసు, కారు రేస్ కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఐస్టా టెన్నిస్ టోర్నీ ప్రారంభం

విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 21 : నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, లయోలాలోని విజయ మాధవి టెన్నిస్ అకాడమీల్లో ఐదురోజుల పాటు జరిగే ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ అసోసియేషన్(ఐస్టా) టోర్నీ మెయిన్ డ్రా పోటీలు ఐజీఎంసీలో సోమవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఐస్టా చైర్మన్ కె.పట్టాభిరామయ్య, చైర్మన్ జీవీ కృష్ణారెడ్డిలు పోటీలను ప్రారంభించారు. మొత్తం 35+, 45+, 55+,65+,70+ వయస్సు గ్రూప్‌ల్లో సింగిల్స్, డబుల్స్ మ్యాచ్‌లు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.రాధాకృష్ణమూర్తి, టోర్నీ డైరెక్టర్ ఎం.మల్లిఖార్జునరావు, టోర్నీ చీఫ్ రిఫరీ కె.శ్రీకుమార్ పాల్గొన్నారు.

గుండెల్లో రైళ్లు..

(5వ పేజీ తరువాయి)

ఉండటానికి పట్టాలపై కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని సమాచారం. రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌లపై ఎక్కువగా గ్యాంగ్‌మెన్లు, లోకో పైలెట్లు తిరుగుతుంటారు. ఒక రైలుకు రెండో ఇంజన్‌ను లింక్ చేయాలనుకున్నప్పుడు యార్డు వద్ద ఉన్న ఇంజన్‌ను తీసుకురావడానికి పైలెట్లు ట్రాక్‌పై నడుచుకుంటూ వెళ్తారు. పట్టాలపై ఏదైనా సాంకేతిక సమస్య ఉన్నప్పుడు టార్చిలైట్ వేసుకుని వెళ్తారు. లోకో పైలెట్ హత్య తర్వాత నుంచి ఇంజన్ షంటింగ్‌కు వెళ్లాలన్నా, ట్రాక్‌ను పరిశీలించడానికి వెళ్లాలన్నా లోకో పైలెట్లు, గ్యాంగ్‌మెన్లు తోడుగా మరొకరిని తీసుకెళ్తున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పార్శిల్ ఆఫీసు, రైల్వే ఆసుపత్రి, రైల్వేకోర్టు రహదారులన్నీ నిర్మానుష్యంగా ఉంటాయి. ఇక్కడ ఉన్న ఫుట్‌పాత్‌లపై గంజాయి బ్యాచ్ యాచకుల మాదిరిగా పడుకుని కార్యకలాపాలు నిర్వహిస్తోంది. లోకో పైలెట్‌పై దాడి చేసిన దేవేంద్ర సాహు గంజాయి మత్తులో ఉన్నట్టు సమాచారం. గంజాయి అమ్ముకోవడానికి, తాగడానికి రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు అనువుగా ఉండటంతో ఇక్కడే స్థావరాలను ఏర్పాటు చేసుకుంటున్నారు.

రెండు రోజులకోసారి కార్డెన్ సెర్చ్

- జేవీ రమణ, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్

రైల్వేస్టేషన్ నుంచి అవుటర్ వరకు నిఘాను కట్టుదిట్టం చేశాం. రాత్రి 9 గంటల నుంచి అన్ని ట్రాక్‌లపై ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది నాకాబందీ నిర్వహిస్తున్నారు. డీజిల్ షెడ్, యార్డు, వించిపేట, రాజరాజేశ్వరిపేటతో పాటు మొత్తం 20 ప్రదేశాలను హాట్‌స్పాట్లుగా గుర్తించాం. ఈ ప్రాంతాల్లో నిరంతర గస్తీ నిర్వహిస్తున్నాం. రెండు రోజులకోసారి కార్డెన్ సెర్చ్ చేస్తున్నాం.

రోడ్డెక్కిన సీహెచ్‌వోలు

- సమస్యల పరిష్కారానికి ధర్నా
- వైసీపీ హయాంలో పేరుకుపోయిన సమస్యలు



ధర్నాకు అధిక సంఖ్యలో హాజరైన సీహెచ్‌వోలు

ధర్నాచౌక్, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో వైద్య సేవలందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సీహెచ్‌వో)లు రోడ్డెక్కారు. స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీహెచ్‌వోల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీరి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గత ఐదేళ్లుగా గత వైసీపీ ప్రభుత్వం వీరికి వేతనాలు పెంచలేదని విమర్శించారు. వీరందరికి మినిమమ్ టైంస్కేల్ అమలు చేయాలని, కేంద్రప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ హెల్త్ పది నెలల బకాయి ఇన్సెంటివ్స్, హెల్త్‌క్లినిక్స్ అద్దెలు, కరెంట్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ చైర్మన్ డి.దయామణి మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా సీహెచ్‌వోలను, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ప్రావిడెంట్ ఫండ్ పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సీహెచ్‌వో అసోసియేషన్ నేతలు ప్రియాంక, ప్రేమ్‌కుమార్ పులి, మధుసుధాకర్, ప్రమోద్, రాష్ట్రవ్యాప్తంగా అధిక సంఖ్యలో సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

డ్రోన్ షో ఏర్పాట్లలో లోపాలొద్దు

- వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



డ్రోన్ షో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

వన్‌టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ షో ఏర్పాట్లలో ఎలాంటి లోపం ఉండకూడదని, అధికారులందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. పున్నమిఘాట్‌లో మంగళవారం జరగనున్న డ్రోన్ షో ఏర్పాట్లను అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. పారిశుద్ధ్యం సక్రమంగా ఉండాలని, తాత్కాలిక మరుగుదొడ్లను సూచించిన చోట ఏర్పాటుచేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వాటని ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలన్నారు. తాగునీటి విషయంలో ఇబ్బందులు ఎదురవకూడదని డ్రోన్ షో విజయవంతానికి అధికారులు కలిసి పనిచేయాలని సూచించారు. ఆయన వెంట డాక్టర్ డి.చంద్రశేఖర్, శ్రీనాథరెడ్డి, డాక్టర్ సురేష్ బాబు, పి.సత్యనారాయణ, ఈ.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూపై కన్ను!

గుడివాడ మున్సిపాల్టీలో ఆర్ఐ పోస్టుకు పోటాపోటీ



గుడివాడ పురపాలక సంఘం

- అవినీతి ఆరోపణలున్న ఇద్దరు ఉద్యోగుల పైరవీలు
- బీజేపీ ఎమ్మెల్యే, జనసేన నేతల సిఫారసులతో ఇక్కడికి..
- కొత్త వారికి ఇస్తే మంచిదంటున్న కూటమి నేతలు

గుడివాడ మున్సిపాల్టీలో కాసుల వర్షం కురిపించే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు ఇద్దరు ఉద్యోగులు తీవ్రంగా పోటీ పడుతున్నారు. రాజకీయ నేతల అండదండలతో ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. బీజేపీ ఎమ్మెల్యే, జనసేన పార్టీ నేతల సిఫారసులతో మళ్లీ ఇక్కడికి వచ్చిన వీరిపై అవినీతి ఆరోపణలు ఉండటంతో కొత్తవారికి బాధ్యతలు అప్పగిస్తే మంచిదన్న ఆలోచన కూటమి నేతల నుంచి వ్యక్తమవుతోంది.

ఆంధ్రజ్యోతి-గుడివాడ : పురపాలక సంఘంలో పన్ను వసూలు, కొత్తగా పన్నులు విధించడం, ఖాళీస్థలాల నుంచి పన్నులు రాబట్టడం, మ్యుటేషన్‌లు, మున్సిపల్ దుకాణాల లీజులు, మార్కెట్ ఆశీలు, లీజులు, వాల్యూయేషన్ సర్టిఫికేట్‌ల జారీ వంటి ఆర్థికపరమైన వ్యవహారాలన్నీ రెవెన్యూ అధికారి, ఇన్‌స్పెక్టర్ కనుసన్నల్లోనే జరుగుతాయి. అందుకే 'రెవెన్యూ'లో కీలకమైన ఈ సీటుపై అందరి కన్ను ఉంటుంది. ఒక్కసారి పోస్టింగ్ దక్కించుకుంటే చాలు ఆర్థికంగా వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం ఉండదనే భావనతో మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

రికార్డులు కాల్చేసిన చరిత్ర ఒకరిది!

ఆర్ఐ పోస్టుకు పోటీ పడుతున్న ఉద్యోగుల్లో ఒకరు గతంలో రెవెన్యూ విభాగంలో పనిచేసిన కాలంలో భారీ స్థాయిలో అవినీతికి పాల్పడ్డారని, దానిని కప్పిపుచ్చుకునేందుకు సదరు ఉద్యోగి అప్పట్లో ఏకంగా రెవెన్యూ రికార్డులను షార్ట్‌సర్క్యూట్ పేరుతో కాల్చేసినట్టు ఆ కార్యాలయ వర్గాల్లో విస్తృతంగా ప్రచారం సాగింది. పబ్లిక్ హెల్త్ విభాగంలో రికార్డులను ట్యాంపరింగ్ చేసి విధులకు హాజరుకాని కొందరు ఉద్యోగుల పేరు మీద ఎనిమిది నెలల జీతాలు తన సొంత ఖాతాలోకి మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అప్పటి మున్సిపల్ కమిషనర్ శామ్యూల్, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు సదరు ఉద్యోగికి ఎనిమిది ఇంక్రిమెంట్‌లను కట్ చేసి చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ఈ-సేవాలో జరిగిన నిధుల మళ్లింపులో కూడా సదరు ఉద్యోగి పాత్ర స్పష్టంగా ఉందని ప్రచారం సాగింది. ఈ క్రమంలోనే అప్పటి మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు సదరు ఉద్యోగి గుడివాడ రాకూడదని పట్టుపట్టారు. బలవంతంగా వేరే మున్సిపాల్టీకి బదిలీ చేయించారు. కూటమి ప్రభుత్వం రావడంతో బీజేపీ ఎమ్మెల్యే సిఫారసుతో తిరిగి గుడివాడ మున్సిపాల్టీకి బదిలీపై వచ్చి ఆర్.ఐ సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

మాజీ మంత్రికి నమ్మినబంటు మరొకరు!

ఆర్ఐ పోస్టుకు పోటీ పడుతున్న ఉద్యోగుల్లో మరొకరు మాజీ మంత్రి కొడాలి నాని, ఆయన ముఖ్య అనుచరుడు శశిలకు నమ్మినబంటుగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ పాలనలో వారు చెప్పిందే తడవుగా ఆనాడు టిడ్కో లబ్ధిదారుల జాబితాలో సుమారు 1600 మంది లబ్ధిదారుల పేర్లను మార్చి స్వామిభక్తి చాటుకున్నారు. ఆనాడు కీలకమైన టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేసిన మున్సిపల్ ఉద్యోగి, రెవెన్యూ శాఖ జూనియర్ అసిస్టెంట్‌లు ఫ్లాట్‌ను బట్టి అర్హత లేని లబ్ధిదారుల నుంచి రూ.1.50 లక్షల నుంచి రూ.3లక్షల వరకు వసూలు చేసి వైసీపీ నాయకులకు ఆర్థిక తోడ్పాటు అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు ఉద్యోగి కూడా టిడ్కో గృహాలను అమ్ముకున్నారని వదంతులున్నాయి. ఈయన జనసేన జిల్లా నేతల సిఫారసుతో బదిలీపై గుడివాడ వచ్చి ఆర్ఐ సీటు కోసం విశ్వప్రయత్నాలు సాగిస్తున్నారు. అయితే మున్సిపాల్టీలో ప్రాధాన్యత కలిగిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టును అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వీరిద్దరికి కాకుండా కొత్తవారికి ఇస్తే మంచిదనే భావన కూటమి నాయకుల్లో వ్యక్తమవుతోంది. కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ మాత్రం ఆర్ఐ పోస్టు ఎవరికి కేటాయించాలో తెలియక మల్లగుల్లాలు పడుతున్నట్లు సమాచారం.



సమావేశంలో పాల్గొన్న ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఎన్‌ఎంయూ డిమాండ్

బస్ స్టేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సోమవారం విజయవాడలో నిర్వహించిన నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ సమావేశంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు. 26 జిల్లాల నుంచి కార్యదర్శులు, డివిజన్ల అధ్యక్షులు, జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు, ఆయా జిల్లాల్లోని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీసీఎస్ పాలక వర్గ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ఆర్టీసీ ఎండీకి వినతి పత్రం ఇవ్వాలని నిర్ణయించారు. నైట్ అలవెన్స్, ఇంకా ఇతర అలవెన్స్‌లు, పదోన్నతులు, క్రమశిక్షణా చర్యలకు సంబంధించి 2019లో జారీచేసిన జీవోను యథావిధంగా అమలు చేయటం వంటి వాటితో పాటు పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు నిర్ణయించారు. స్టాఫ్ రిటైర్‌మెంట్ బెనిఫిట్ స్కీమ్ పునరుద్ధరించాలని, బకాయిలు చెల్లించాలని, 2020 నుంచి రిటైర్ అయిన ఉద్యోగులకు వైద్యసౌకర్యాలను పునరుద్ధరించాలని తీర్మానాలు చేశారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌తో వైద్య సౌకర్యాలు కల్పించాలని, 55 సంవత్సరాలు పైబడిన ఉద్యోగులందరి నుంచి సేకరించి ఈపీఎఫ్‌కు పంపిన పెన్షన్ కంట్రిబ్యూషన్‌ను తిరిగి ఇప్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏడాదికి 1500 బస్సులు కొనుగోలు చేయాలని, కేడర్ స్ట్రెంత్ సమస్యను పరిశీలించాలని, మహిళా ఉద్యోగులకు డిపోలలో విశ్రాంతి గదులు, మౌలిక వసతులు, తదితర సౌకర్యాలు కల్పించాలని, ఇంకా డ్రైవర్లు, కండక్టర్లు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఇతర ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించారు. వీటన్నింటినీ ఎండీ దృష్టికి తీసుకువెళ్లాలని తీర్మానించారు.

సచివాలయ సిబ్బందిని అనుసంధానం చేయాలి

- సర్పంచ్‌ల సంఘం డిమాండ్

మచిలీపట్నం టౌన్/విజయవాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి సరైన పర్యవేక్షణ, నియంత్రణ లేకుండా గందరగోళం చేసిందని, సచివాలయాలను గ్రామ పంచాయతీకి అనుసంధానం చేయాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి కాగిత గోపాలరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద గోపాలరావు మీడియాతో మాట్లాడారు. ఒక్కొక్క గ్రామంలో రెండు నుంచి ఐదు సచివాలయాలు ఏర్పాటు చేశారని, ఒక్కొక్క సచివాలయంలో 11 మంది ఉద్యోగులను నియమించారన్నారు. సచివాలయాల్లో ఉద్యోగులు ఎవరి ఆదేశాలు పాటించాలో తెలియకుండా పోయిందన్నారు. సచివాలయ వ్యవస్థ రాజ్యాంగ చట్ట వ్యతిరేకంగా రూపకల్పన చేశారన్నారు. గ్రామ పంచాయతీల్లోని సచివాలయాలన్నింటిని ఒకే ఒక సచివాలయంగా ఏర్పాటు చేసి పంచాయతీ ఆధీనంలో ఉంచాలన్నారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ నాయకత్వంలో ఈ సమస్యపై వినతిపత్రాలు ఇస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబుకు, పంచాయతీ రాజ్ శాఖా మంత్రి పవన్‌కళ్యాణ్‌కు వినతిపత్రాలు ఇస్తున్నామన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న పంచాయతీల్లో ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి, అందులో ఉన్న సిబ్బందిని పంచాయతీకి అనుసంధానం చేయాలని ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోలి వసంతకుమార్ విజ్ఞప్తి చేశారు. విజయవాడలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. సిబ్బందిని పంచాయతీలకు అనుసంధానం చేయాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎన్టీఆర్ జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పంచకర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ చీఫ్ కమిషనర్‌ను కలిసిన వక్కలగడ్డ



ధర్నాచౌక్, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జీఎస్టీ చీఫ్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అహ్మద్‌బాబును రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు సోమవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాకప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం జీఎస్టీలో ఉన్న సమస్యలు, ఏపీ జీఎస్టీ అడ్వైజరీ కమిటీ, ఏపీ జీఎస్టీ గ్రీవెన్స్ కమిటీల నియమాకాలపై చర్చించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(కి.లో)
బ్రాయిలర్ బర్డ్	138, 147, 158
చికెన్ విత్ స్కిన్	266
చికెన్ స్కిన్‌లెస్	276

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 530



జిమ్నాస్టిక్స్‌లో సిద్ధార్థ విద్యార్థిని కీర్తనకు పతకాలు



విజయవాడ కల్చరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల సీఈసీ విద్యార్థిని జె.కీర్తన అంతర్ జిల్లా జిమ్నాస్టిక్స్ పోటీల్లో ఆల్ రౌండర్‌గా నిలిచింది. గుంటూరులో జరిగిన ఈ పోటీల్లో ఫ్లోర్ ఎక్సర్‌సైజ్‌లో బంగారు, బీమ్‌లో వెండి, అన్‌ఈవెన్ బార్‌లో వెండి సాధించింది. ఆల్‌రౌండర్ విభాగంలో బంగారు పతకాలు సాధించింది. ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ అభినందించారు.

బుడమేరు బాధితులకు పరుపు, దుప్పట్ల పంపిణీ



బాధితులకు పరుపు, దుప్పటి, గోడ గడియారం కిట్లను అందిస్తున్న బార్ మాజీ అధ్యక్షుడు గురునాథం

విజయవాడ లీగల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సిటీ సివిల్ కోర్టు ఆవరణలో సోమవారం ఏలూరు ఫ్లాష్ టీం, విజయవాడ ఫ్లాష్ టీం, రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో న్యాయవాది యర్రంశెట్టి శ్రీనివాసరావు సౌజన్యంతో న్యాయవాదులు బుడమేరు వరద బాధితులు 200 మందికి పరుపు, దుప్పటి, గోడ గడియారం కిట్లను అందచేశారు. బార్ మాజీ అధ్యక్షుడు వి.గురునాథం, బెజవాడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరిగెల శివరాంప్రసాద్ (రాజా)తదితరులు సుమారు రూ.4 లక్షల విలువైన సామాగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పడవల ఏడుకొండలు, పీడీఎస్ నారాయణ, ఏలూరు సిటీ 23వ డివిజన్ కార్పొరేటర్ సాంబ, మల్లి, జనసేన కిరణ్, మేకల వెంకటేశ్వర రావు, వేముల శ్రీనివాస్, ఏలూరు ఫ్లాష్ టీం, విజయవాడ ఫ్లాష్ టీం మమ్మీ సభ్యులు పాల్గొన్నారు.

పేవర్ బ్రిక్స్‌పై దర్జాగా పార్కింగ్

- రోడ్డుకిరువైపులా ఫుట్‌పాత్‌లపై శాశ్వతంగా కార్ల పార్కింగ్
- పాదచారుల వెతలు
- స్తంభిస్తున్న ట్రాఫిక్

(పటమట, ఆంధ్రజ్యోతి)

డ్రెయినేజీ టు డ్రెయినేజీ, ఎండ్ టుఎండ్ అనే పథకం ద్వారా కాలుష్యరహిత నగరంగా విజయవాడను తీర్చిదిద్దాలనే ఆలోచనతో గత వైసీపీ ప్రభుత్వం నగరం అంతా రోడ్డు మార్జిన్లు, ఫుట్‌పాత్‌లను పేవర్ బ్రిక్స్‌తో నిర్మించింది. నగరాన్ని దుమ్ము, ధూళిలేని పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దాలనేది ఆ పథకం ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం నగరంలో ఎక్కడ పేవర్ బ్రిక్స్ నిర్మాణాలు ఉన్నయో వాటి మీద దర్జాగా వాహనదారులు అక్రమంగా తమ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. 14వ డివిజన్ ఎన్ఎస్ఎం స్కూల్ పక్కన రోడ్డుకిరువైపులా తమ కార్లను శాశ్వతంగా పార్కింగ్ చేస్తున్నారు. ఈ రోడ్డు పటమట మీసేవ దగ్గర నుంచి రామలింగేశ్వరనగర్ వరకు ఉంది. పటమటలంక రామలింగేశ్వర్‌నగర్ నుంచి ఉదయం, సాయంత్రం తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ మార్గంలోనే స్కూల్‌కు తీసుకువెళుతుంటారు. అయితే మార్జిన్లు, ఫుట్‌పాత్‌లపై వాహనాల అక్రమ పార్కింగ్ వలన ట్రాఫిక్ స్థంభించిపోతుంది. కృష్ణవేణి స్కూల్ ప్రక్కన ఎక్కువ విస్తీర్ణంలో రోడ్డు పక్కనే పేవర్ బ్రిక్స్ నిర్మాణం చేశారు. ఇక్కడ నిత్యం 10 కార్లను శాశ్వతంగా పార్కింగ్ చేసి ఉంచుతున్నారు.

భవన నిర్మాణదారులు అక్కడే ఇసుక కంకరను పోస్తున్నారు. ఈ ప్రదేశంలో కార్పొరేషన్ నాలుగు బెంచీలు ఏర్పాటు చేస్తే ఉదయం వాకింగ్‌చేసే వాళ్ళ, సాయంత్రం వయో వృద్ధులు సేదతీరతారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.




కృష్ణవేణి స్కూల్ పక్కన, ఎన్ఎస్ఎం స్కూల్ పక్కన పేవర్ బ్రిక్స్‌తో నిర్మించిన ఫుట్‌పాత్‌పై కార్ల పార్కింగ్



అర్జీలను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించండి

కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర

చిట్టినగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. మొత్తం 7 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమం అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డీ.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, సీఈ శ్రీనాథ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జీ. సృజన, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ సురేష్‌బాబు, పీవో యూసీడీ ఇన్‌చార్జి డాక్టర్ లత, ఎస్టేట్ ఆఫీసర్ టీ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిద్ధార్థ మహిళా కళాశాలలో అద్వితీయ-2024



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

లబ్బీపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మహిళా కళాశాల ఆంగ్ల విభాగం, లిటరరీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో అద్వితీయ-2024 మెగాఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన మాట్లాడుతూ ఇటువంటి మెగా ఈవెంట్స్ నిర్వహించడం ద్వారా విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించే అవకాశం ఉంటుందని, ఈవెంట్‌లో విద్యార్థులకు పీపీటీ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, షార్ట్ ఫిలిం మేకింగ్, యాడ్ ఫిలిం మేకింగ్, ఈజీ రైటింగ్, వక్తృత్వం, డిబేట్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.

ఈ ఈవెంట్‌కు విజయవాడలోని పలు కళాశాలల నుంచి 483మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అకడమిక్స్ స్పీకింగ్ వై.సాయికృష్ణ, కళాశాల మాజీ డైరెక్టర్ టి.విజయలక్ష్మి, కె.శైలజరాణి, కె.ఎస్.వరలక్ష్మి, సరిత, ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిచారో అంతే ...

- ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఓపెన్ డ్రెయినేజీకి రక్షణ కరువు



పటమట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : అధికార పార్టీ నాయకులు తమ పార్టీ ముఖ్య నేతల పుట్టినరోజులు, తమ అభిమాన హీరోల సినిమా విజయోత్సవాలు, విపక్ష నాయకులు నిరసనల, ధర్నాలు, రాస్తారోకోలు నిరంతరం పటమట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నిర్వహిస్తూ ఉంటారు. అంతటి ప్రాముఖ్యత సంతరించుకున్న ఎన్టీఆర్ సర్కిల్ వద్ద విజయా డెయిరీ పక్కన పెద్ద డ్రెయినేజీ ఎటువంటి రక్షణ లేకుండా ఉంది. టీడీపీ, జనసేన, బీజేపీ, వామపక్షాలు తమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున ఇక్కడ నిర్వహిస్తూ ఉంటారు. ప్రజలు కూడా పెద్ద ఎత్తున ఇక్కడ నిర్వహించే కార్యక్రమాలను హాజరవుతుంటారు. అజాగ్రత్తగా ఉంటే ప్రాణాపాయం జరిగే పరిస్థితులు ఉన్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఓపెన్ డ్రెయినేజీ మీద ఐరన్ మెష్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మల, మూత్ర విసర్జనకు ప్రయాణికుల అవస్థలు

రింగ్ సెంటర్లో సులభ కాంప్లెక్స్ నిర్మించండి: నగర వాసుల వినతి

గుణదల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే రామవరప్పాడు రింగ్‌రోడ్డు సెంటర్ వద్ద సులభ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. నగరంలోని పలు ప్రాంతాల నుంచి సుదూర ప్రాంతాలైన ఏలూరు, రాజమండ్రి, తణుకు, విశాఖపట్నం, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల్లో ప్రయాణాలు సాగించేవారు రామవరప్పాడు రింగ్ సెంటర్‌కు చేరుకుంటారు. ఇక్కడి నుంచి ప్రయాణాలు చేసేవారు రోజుకు వేల సంఖ్యలో ఉంటున్నారు. బస్సుల కోసం వేచి ఉండే వారు మల, మూత్ర విసర్జన చేయాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. మగవారు ఏదో రకంగా దగ్గరలోనే ఉన్న రైవస్ కాల్వకట్ట వద్దకు వెళ్లి మూత్ర విసర్జన చేస్తున్నారు. మహిళలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ అధికారులు దృష్టి పెట్టి రామవరప్పాడు ఇన్నర్ రింగ్‌రోడ్డు వద్ద రోడ్డు విస్తరణ సమయంలో ఖాళీ చేయించిన ఇళ్ల స్థానంలో కొంతమేర ఖాళీగా ఉన్న ప్రదేశంలో సులభ కాంప్లెక్స్ నిర్మాణం చేయాలని నగర వాసులు కోరుతున్నారు. పర్మినెంట్‌గా సులభ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన స్థలం రైవస్ కాల్వకట్ట వెంబడి ఉంది. నిర్మాణం చేసే వరకు మొబైల్ సులభ కాంప్లెక్స్ అయినా అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నగరపాలక సంస్థ ఉన్నత అధికారులు ఈ విషయమై దృష్టి పెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కృష్ణా వర్సిటీ బ్యాడ్మింటన్ విజేత పీబీ సిద్ధార్థ కళాశాల



విజేత టీమ్ పీబీ సిద్ధార్థ కళాశాలకు ట్రోఫీ అందిస్తున్న ప్రిన్సిపాల్ ఎం రమేష్

విజయవాడస్పోర్ట్సు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాల బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహ పూరిత వాతావరణంలో సోమవారం జరిగాయి. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ ఎం. రమేష్ ఘనంగా ప్రారంభించారు. పలు కళాశాల జట్లు పోటీల్లో తలపడగా ఆతిథ్య పీబీ సిద్ధార్థ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఏఎన్ఆర్ కళాశాల (గుడివాడ, ద్వితీయ), ఎస్‌వీడీ సిద్ధార్థ లా కళాశాల(తృతీయ), ఎస్ఆర్ఆర్‌అండ్ సీవీఆర్ డిగ్రీ కళాశాల(చతుర్థ స్థానం)లు వరుస స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ట్రోఫీల ప్రధానోత్సవంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం. రమేష్, పీజీ డీన్ రాజేష్, కేవీఆర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ వాసిరెడ్డి నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపునకు అక్రమార్కుల యత్నం

- అడ్డుకున్న స్థానికులు
- వాహనాలు కడిగేందుకని కుంటిసాకులు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



వాహనాల రాకపోకలకు అనువుగా ఉన్న మార్గం

(రాణిగారితోట, ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం ప్రభుత్వం ఇసుకను ఫ్రీ చేయడం కొన్ని నిబంధనలకు వెలుసుబాటు ఇవ్వడం అక్రమార్కులకు వరంగా మారింది. తమను ఎవరూ అడ్డుకోరనే ఉద్దేశ్యంతో రాత్రిపూట అక్రమంగా ఇసుకను తవ్వేందుకు మూడు వాహనాలు, ఎక్స్‌కవేటర్ కృష్ణానదిలో దిగే ప్రయత్నం చేయడంతో స్థానికులు అడ్డుకున్న ఘటన వారధి వద్ద శనివారం రాత్రి జరగగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

కృష్ణానది వారధి కింద ఇసుక తవ్వకాలు చేస్తే వారధికి, రిటైనింగ్ వాల్‌కు ప్రమాదం అని తెలిసినా అక్రమార్కులు ఇప్పటికే ఇసుకను తరలిస్తుంటే వారిపై ఎటువంటి చర్యలు లేకపోవడంతో వారు మరో అడుగు ముందుకు వేశారు. రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా ట్రాక్టర్లు, లారీల్లో ఎక్స్‌కవేటర్ సహాయంతో ఇసుకను తరలించే ప్రయత్నం చేయడంతో స్థానికులు అడ్డుకున్నారు. దీనిపై స్థానికులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ వారది వద్ద శనివారం రాత్రి 8గంటల సమయంలో వీఎంసీ బోర్డు ఉన్న ఒక ట్రాక్టర్, మరో ట్రాక్టర్, లారీ, ఎక్స్‌కవేటర్లు నదిలో దిగాయి. గమనించిన స్థానికులు వాటిని అడ్డుకుని సంబంధిత వ్యక్తులను నిలదీయగా పొంతలేని సమాధానం చెప్పారని తెలిపారు. మొదట ఒక ట్రాక్టర్‌లో చెత్తను పడేయడానికి నదిలో దిగిందని, ట్రాక్టర్‌ను కడిగేందుకు వెళ్లగా అది ఇసుకలో కూరుకుపోయిందని దానిని తీయడానికి మరో ట్రాక్టర్ వెళ్ళగా అది కూడా కురుకుపోగా వాటిని తీయడానిక లారీ వెళ్లగా అది ఇరుక్కుపోగా వాటిని తీయడానికి ఎక్స్‌కవేటర్‌ను తీసుకువచ్చామని చెప్పడంతో తామంతా ఖంగుతిన్నామని స్థానికులు చెప్పారని తెలిపారు. వారు చెప్పే మాటాలు వాస్తవానికి విరుద్ధంగా ఉండడంతో నిలదీయగా వారు ఎందుకు వచ్చారో చివరకు ఒప్పుకున్నారని, ఇటువంటి చర్యలతో ప్రభుత్వానికి చెడ్డపేరు రావడంతో పాటు అక్రమార్కులకు ఇది ఒక క్వారీ అవుతుందని గట్టిగా హెచ్చరించి పంపినట్లు తెలిపారు.

ఇక్కడ గేటు ఏర్పాటు చేయాలి : స్థానికులు

వారది వద్ద నదిలో దిగేందుకు ఉన్న మార్గాన్ని మూసివేస్తూ గేటు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నిత్యం వందలాది టన్నుల ఇసుక అక్రమార్కుల పాలవుతుందని, ప్రభుత్వం ఇచ్చిన కొన్ని వెసులుబాటులను ఆసరాగా చేసుకొని అక్రమార్కులు మరింత ఇసుక తోడేస్తున్నారన్నారు. వీరికి కొందరు అధికారులు అండగా ఉండడంతో ఇసుక తవ్వకాలు నిత్యకృత్యం అయ్యాయని ఈ దందా ఆగాలంటే ఇక్కడ గేటు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



వసుమతికి రచయితల అభినందన

విజయవాడ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం పొందిన చలసాని వసుమతిని కృష్ణా జిల్లా రచయితలు అభినందించారు. మొగల్రాజపురంలోని ఆమె స్వగృహంలో సోమవారం జీవీ పూర్ణచందు, గుత్తికొండ సుబ్బారావు, భమిడిపాటి బాలా త్రిపురసుందరి, కొరెడ్ల సుశీల తదితరులు వసుమతిని అభినందించారు. ఆమె స్వల్ప అనారోగ్యంతో ఉన్నా మానసికంగా దృఢంగా ఉన్నారని వారు తెలిపారు.

లయోలాలో ఎఫ్ఎల్ఎన్ శిక్షణ ప్రారంభం

భారతీనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్షా ఆధ్వర్యంలో లయోలా కళాశాల ప్రాంగణం ఎస్-జే కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం సమగ్రశిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యానాణ్యతను పెంచడమే ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్ ప్రధాన లక్ష్యమని, ఇది క్షేత్ర స్థాయిలో అమలవుతుందన్నారు.

ఈ శిక్షణ ఆరురోజుల పాటు నిర్వహించబడుతుందన్నారు. మొదటి విడతగా సోమవారం నుంచి ఈనెల 26 వరకు విజయవాడలోని లయోలా కళాశాలలో ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యాయులకు శిక్షణ జరుగుతుందన్నారు. మొత్తం 10 కేంద్రాల్లో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1700 మంది ఉపాధ్యాయులు రెసిడెన్షియల్ విధానంలో జరిగే శిక్షణకు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్షా అడిషనల్ డైరెక్టర్ ఎ. సుబ్బారెడ్డి, జిల్లా డీఈవో, ఏపీసీలు సుబ్బారావు, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో అన్నవితరణకు విరాళం

వన్‌టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ అయ్యప్పనగర్‌కు చెందిన కొల్లూరు విజయలక్ష్మి దంపతులు సోమవారం ఆలయానికి విచ్చేసి ఆలయంలో నిర్వహించే అన్న వితరణకు రూ.1,11,111లు విరాళాన్ని ఈవో రామరావు, డిప్యూటీ ఈవో రత్నరాజులకు చెక్కు రూపంలో అందచేశారు. అమ్మ వారి దర్శనానంతరం ఆశీర్వచనం, ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం, తదితరాలను అందజేశారు. ఇదే సమయంలో దాతలకు ఎన్ఎఫ్‌సి టెక్నాలజీ డోనర్ కార్డును కూడా అందజేశారు.

స్టాక్స్ క్రేజ్!



● ఉమ్మడి కృష్ణాజిల్లాలో భారీగా పెరిగిన స్టాక్ ఇన్వెస్టర్లు ● 4 లక్షల మందికి పైగా పెట్టుబడులు!

- గతంలో కేవలం లక్షా పాతిక వేలకు మించి లేదు
- కరోనా తర్వాత నుంచి పెరిగిన షేర్ మార్కెట్ పెట్టుబడులు
- స్టాక్ యాప్స్ ప్రవేశంతో విపరీతంగా పెరిగిన పెట్టుబడులు
- దీర్ఘకాలిక పెట్టుబడులపైనే మనవాళ్ల ఆసక్తి
- బ్యాంకింగ్, ఫార్మా ఆయిల్స్, టైర్స్, టెక్స్‌టైల్స్, సిమెంట్, స్టీల్, డెయిరీలు, ఫుడ్ ఇండస్ట్రీస్‌లో భారీగా పెట్టుబడులు

స్టాక్ మార్కెట్ పట్ల ఉమ్మడి కృష్ణాజిల్లాలో క్రేజ్ పెరిగింది! స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్ల సంఖ్య భారీగా పెరుగుతోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా నుంచి 4 లక్షల మందికిపైగా స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లు ఉన్నారంటే ఏ రేంజ్‌లో ఆకర్షితులౌతున్నారో అర్థం చేసుకోవాల్సిందే. విజయవాడ నగరం 2.10 లక్షలతో అగ్రస్థానంలో ఉండగా, కంకిపాడు, మైలవరం, గుడివాడ, మచిలీపట్నం, ఉయ్యూరు, పామర్రు, గన్నవరం, హనుమాన్ జంక్షన్, నున్న, ఇబ్రహీంపట్నం, కొండపల్లి ప్రాంతాలతో పాటు చిన్న ప్రాంతాలను కూడా కలుపుకుని మరో 1.90 లక్షలమంది ఇన్వెస్టర్లు ఉన్నట్టు తెలుస్తోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల వారు కూడా స్టాక్ మార్కెట్ పట్ల ఆసక్తి చూపుతున్నారన్నది ఈ గణాంకాలను బట్టి అర్థమౌతోంది. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

కరోనాకు ముందు వరకు ఉమ్మడి జిల్లా పరిధిలో లక్షా పాతిక వేల సంఖ్యలో ఉండే ఇన్వెస్టర్లు (మదుపరులు) అనంతరం కాలంలో అనూహ్యంగా పెరిగిపోయారు. కరోనా తదనంతరం ఏడాది తర్వాత నుంచి స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్లు భారీగా పెరిగాయి. స్టాక్ మార్కెట్ వృద్ధి చెందుతున్నా అపోహల కారణంగా చాలామంది పెట్టుబడులు పెట్టడానికి స్టాక్ మార్కెట్స్ మంచివి కావని భావించటంతో ఇక్కడ ఇన్వెస్టర్ల సంఖ్య పెద్దగా ఉండేది కాదు. దేశీయ స్టాక్ మార్కెట్ నికరంగా పెరుగుతుండటం, స్టాక్స్‌తె ఇన్వెస్ట్‌మెంట్ చేసినవారు భారీ లాభాలను ఆర్జించడంతో క్రమేపీ స్టాక్ మార్కెట్ వైపు అడుగులు పడ్డాయి. బ్యాంకులు, పోస్టాఫీసుల కంటే కూడా ఎక్కువ లాభాలను తెచ్చి పెడుతుండటంతో ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. ఒకప్పుడు స్టాక్ మార్కెట్‌ను పర్యవేక్షించే వ్యవస్థలుండేవి కావు. మోసాలు జరిగేవి. సెబీ వచ్చాక పరిస్థితి మారింది. స్టాక్ మార్కెట్‌లో సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) వచ్చాక నష్టమంటూ ఉండటం లేదు. ఒకవేళ నష్టం వచ్చే పరిస్థితులుంటే ముందుగానే సేఫ్‌జోన్‌లోకి వెళ్లిపోయేలా ఈ సిప్స్ ఉంటున్నాయి. గతంలో ఇందులో పెట్టుబడులు ఎలా పెట్టాలి? ఎలాంటి షేర్లు కొనాలి? వంటి వాటి పట్ల కనీస అవగాహన ఉండేది కాదు. దీంతో స్టాక్ ఏజెంట్స్ వ్యవస్థ పుట్టుకొచ్చింది. వీరి సాయంతో స్టాక్ మార్కెట్‌లోకి అడుగు పెట్టడం, వారు సూచించిన షేర్లను కొనటం చేస్తున్నారు. లాభాలు వచ్చినప్పుడు ఏజెంట్లు వీటిని విక్రయిస్తారు. తద్వారా పెట్టుబడిదారులకు లాభాలు వస్తున్నాయి. స్టాక్స్‌లోనే కొత్తగా మ్యూచువల్ ఫండ్స్ అనేవి వచ్చాయి. వీటిలో నష్టాల కంటే లాభాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ వ్యవస్థలో ఫండ్ మేనేజర్ల పర్యవేక్షణలో మ్యూచువల్ ఫండ్స్ సిప్స్ జరుగుతున్నాయి. మ్యూచువల్ ఫండ్స్ ఎక్కువ లాభాలను తెచ్చిపెడుతుండటంతో ఎంతోమంది ఇటువైపు చూస్తున్నారు. ఏడాదిన్నగా లక్షన్నర మందికి ఇన్వెస్టర్లు పెరిగారని స్టాక్ ఏజెంట్లు చెబుతున్నారు. దీనికి కారణం మొబైల్స్. ఏంజెల్ వన్ స్టాక్స్, అప్‌స్టాక్స్ ఎం స్టాక్, గ్రో స్టాక్స్, జెరోధా కైట్, ఇండ్ మనీ, ఫైవ్ పైసా వంటి అనేక స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్స్ యాప్స్ అందుబాటులోకి వచ్చాక స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టే వారిసంఖ్య పెరిగిందంటున్నారు. ఈ యాప్స్‌లోనే స్టాక్ ఏజెంట్ సేవలు అందుతున్నాయి. ఎలాంటి షేర్లలో పెట్టుబడులు పెడితే లాభాలొస్తాయి? ఏ షేర్లను కొనవచ్చు? వంటి సలహాలను ఇస్తున్నాయి. ముఖ్యంగా షేర్ల ఎనాలసిస్ ఇస్తున్నాయి. కంపెనీల షేర్లు ఎలా ఉంటున్నాయి? నిలకడతనం, షేర్ల పెరుగుదల వంటివి పట్టికల్లో ఇస్తున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే యాప్‌లో ఉన్న సులభతర ఇంటర్‌ఫేజ్ కారణంగా షేర్లు ఎలా కొనాలో, అమ్మాలో కూడా తెలిసిపోతోంది.



మనవాళ్ల పెట్టుబడులు ఈ షేర్లలోనే..

స్టాక్ మార్కెట్‌లో మనవాళ్లు ఏ రంగంలో పెట్టుబడులు పెడుతున్నారన్నది చూస్తే ఫార్మా, ఆయిల్, బ్యాంకింగ్, టైర్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో ఎక్కువగా పెట్టుబడులు పెడుతున్నారని తెలుస్తోంది. వినియోగించబడే ఉత్పత్తులకు సంబంధించిన కంపెనీల్లో ఎక్కువగా షేర్లు కొంటున్నారని సమాచారం. వినియోగ ఆధారిత కంపెనీలు మంచి లాభాలను సాధిస్తాయన్న నమ్మకంతో పెట్టుబడులు పెడుతున్నారని ఏజెంట్లు చెబుతున్నారు. పాల ఉత్పత్తుల డెయిరీలు, స్టీల్ కర్మాగారాలు, సిమెంట్ పరిశ్రమలు, పెయింట్స్, టెక్స్‌టైల్స్, లెదర్ గూడ్స్ తయారీ కంపెనీల్లో పెట్టుబడులు పెరుగుతున్నాయని ఏజెంట్లు చెబుతున్నారు.

దీర్ఘకాలిక పెట్టుబడుల వైపే ఆసక్తి



స్టాక్ మార్కెట్‌లో అడుగు పెడుతున్న ఉమ్మడి కృష్ణా జిల్లా వాసులు దీర్ఘకాలిక పెట్టుబడులనే పెడుతున్నారు. దీంట్లో నష్టాలు తక్కువ, లాభాలు ఎక్కువనే ఆసక్తి చూపిస్తున్నారు. స్టాక్ మార్కెట్‌లో రోజు వారీ ట్రేడింగ్ నడుస్తుంది. దీన్ని డైలీ ట్రేడింగ్ అంటారు. రోజూ స్టాక్ మా ర్కెట్ ప్రారంభం కాగానే షేర్లు కొనటం, అదేరోజు మా ర్కెట్ ముగిసే నాటికి అమ్మటం చేస్తుంటారు. అయితే డైలీ ట్రేడింగ్ అనేది జూదం వంటిదని స్టాక్ ఏజెంట్లు చెబుతున్నారు. దీనివల్ల నష్టాలే ఎక్కువని చెబుతున్నా రు. ఇందులో సింహభాగం నష్టాలే చవిచూసే వాళ్లే ఎక్కువ. గతంలో విజయవాడలో పెద్ద సంఖ్యలో డైలీట్రేడింగ్‌కు పాల్పడేవారు. చాలా మంది అంతులేని నష్టాన్ని చవిచూశారు. స్టాక్ మార్కెట్‌పై పూర్తి అవగాహన లేనివారు డైలీ ట్రేడింగ్‌లోకి దిగి నష్టపోయారు. ప్రస్తుతం యాప్స్ అందుబాటులోకి వచ్చాక పరిస్థితి మారింది.

సోదరా.. జాగ్రత్త..!



ఏ రంగంలోనైనా మంచి ఉన్నట్టే చెడు కూడా ఉంటుంది. స్టాక్స్. షేర్స్ వీటి వల్ల లాభాలు ఎలా వస్తాయో నష్టాలు కూడా అదేస్థాయిలో ఉంటాయి. అసలు స్టాక్ మార్కెట్ అంటే ఏమిటి..? షేర్స్ అంటే ఏమిటి..? ఏ షేర్స్‌లో పెడితే లాభాలు వస్తాయి, నష్టాలు ఎక్కడ తక్కువగా ఉంటాయి. అసలు ఎప్పుడు షేర్ కొనాలి.. ఎప్పుడు విక్రయించాలి అనే వాటిపై కూలంకషంగా తెలుసుకోవాలి. తెలిసినవాళ్ల నుంచి నేర్చుకోవాలి. మార్కెట్‌పై పూర్తి అవగాహన వచ్చాక మనపై మనకు నమ్మకం వచ్చాక ఇందులోకి దిగటం మంచిదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాకాక ఎలా పడితే అలా కొనేసి నష్టాలొస్తున్నాయని వెనకా ముందు ఆలోచించకుండా నష్టాలకే అమ్ముకుంటే ఈ రంగంలో మనగడ కష్టమని వారు చెబుతున్నారు. కాబట్టి సోదరా బీ కేర్‌ఫుల్.

టీడీపీలోకి వైసీపీ కార్పొరేటర్లు, నేతలు

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే ఉమ



టీడీపీలో చేరిన వైసీపీ కార్పొరేటర్లు, పార్టీ నేతలతో ఎంపీ శివనాథ్

వన్‌టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలన ప్రజలకే కాదు వైసీపీ నేతలు, కార్యకర్తలకు కూడా విసుగెత్తించిందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో 29వ డివిజన్ కార్పొరేటర్ లక్ష్మీపతి, 61వ డివిజన్ కార్పొరేటర్ రమాదేవి, 63వ డివిజన్ కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ సోమవారం తమ అనుచరులతో కలిసి గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ శివనాథ్ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే బొండా ఉమతో కలిసి శివనాథ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ వరదల సమయంలో చంద్రబాబు - వైసీపీ ఎమ్మెల్యే జగన్ వ్యవహారశైలి వైసీపీ నేతలు, కార్యకర్తలు గుర్తించారని, చంద్రబాబు నాయకత్వంలోనే ప్రజలకు మంచి జరుగుతుందని భావించారన్నారు. సెంట్రల్‌లోని వరద ముంపు ప్రాంతాలకు చెందిన ముగ్గురు వైసీపీ కార్పొరేటర్లు ఆ పార్టీని వీడి టీడీపీలోకి రావటం సంతోషదాయకమన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విపత్తును ఎదుర్కొని చంద్రబాబు ప్రజలను కాపాడిన తీరు, ఆయన సేవలు ఎంతో ఆదర్శమన్నారు. వైసీపీ నేతలు, చంద్రబాబు సేవలను మెచ్చుకుంటున్నారని, టీడీపీలోకి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. వైసీపీ నుంచి వచ్చే వారందరినీ పార్టీలోకి చేర్చుకోబోమని, ప్రజా సేవ పట్ల అంకితభావం ఉన్నవారినే చేర్చుకుంటామని స్పష్టం చేశారు. బొప్పన భవకుమార్, మాగంటి నరసింహ చౌదరి, సెంట్రల్ కో-ఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, సొంగా సంజయ్ వర్మ, టీడీపీ మాజీ ఫ్లోర్ లీడర్ ఎర్రుబోతు రమణ పాల్గొన్నారు.

డబ్బులివ్వలేదని భార్య హత్య



చిట్టినగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చడానికి డబ్బులివ్వమని భార్యను వేధించిన ఓ వ్యక్తి చివరికి ఆమె ప్రాణాలు తీశాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. పాత రాజరాజేశ్వరిపేట కంసాలిపేటకు చెందిన షేక్ బాజీ అదే ప్రాంతానికి చెందిన నగీనాను వివాహం చేసుకున్నాడు. వారికి తొమ్మిదేళ్ల బాబు ఉన్నాడు. నగీనా సమోసాలు తయారు చేసే కార్ఖానాలో పనిచేస్తోంది. బాజీ మాత్రం పనేమీ చేయకుండా ఖాళీగా తిరుగుతూ అప్పులు చేస్తుంటాడు. ఆ అప్పులను తీర్చడానికి నగీనాను వేధిస్తున్నాడు. ఇందులో భాగంగా 4 రోజుల క్రితం భార్యాభర్తలిద్దరి మధ్య వివాదం జరిగింది. దీంతో ఆమె ఇంటి నుంచి సమీపంలో ఉంటున్న అక్కడ షేక్ సాబీర ఇంటికి వెళ్లిపోయింది. సోమవారం తెల్లవారుజామున 4గంటలకు సమోసాల తయారీ కార్ఖానాకు వెళ్లింది. తిరిగి 7గంటలకు ఇంటికి వెళ్లింది. తర్వాత భర్త బాజీ ఆమెతో గొడవపడి డబ్బులివ్వాలని జుట్టు పట్టుకుని కొట్టాడు. ఈ విషయాన్ని ఆమె ఫోన్ చేసి సాబీరకు చెప్పింది. తాను వస్తున్నానని చెప్పి సాబీర ఆమె ఇంటికి వెళ్లింది. అప్పటికే నగీనా రక్తపు మడుగులో ఉంటుంది. నగీనా తన సోదరి సాబీరకు ఫోన్ చేసిన తర్వాత బాజీ కత్తితో భార్యను నరికాడు. దీంతో ఆమె ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయింది. సాబీర ఫిర్యాదుతో బాజీపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. బాజీని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

కారు ఢీకొని ఒకరి మృతి

మరొకరికి గాయాలు



మృతిచెందిన దేవకరరావు

వన్‌టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉబెర్ మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న విజయవాడ గుణదలలోని విజయనగర్ కాలనీకి చెందిన శీలం దేవకరరావు (55) మరణించారు. విజయవాడ పంజా సెంటర్‌కు చెందిన షేక్ కరీముల్లా (46) అనే మరో వ్యక్తికి గాయాలయ్యాయి. గుణదలకు చెందిన శీలం జేమ్స్ ఫిర్యాదు మేరకు సూర్యారావు పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శీలం దేవకరరావు తన ఇంటి నుంచి బస్టాండ్‌కు వెళ్లేందుకు రెండు ఉబెర్ మోటార్ సైకిళ్లను బుక్ చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి వెళుతున్న అతడిని ఆర్‌ఐవో జంక్షన్ వద్ద ఇన్నోవా కారు డ్రైవర్ అతివేగంగా వచ్చి ఢీకొనటంతో దేవకరరావు కిందపడిపోయాడు. గాయాలైన అతడిని తొలుత ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మరో ఆసుపత్రికి తీసుకువెళుతుండగా మార్గమధ్యంలోనే మరణించాడు. ఉబెర్ మోటార్ సైకిల్ డ్రైవర్ కరీముల్లాకు గాయాలవటంతో అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దేవకరరావు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.




గాయపడిన ఉబెర్ డ్రైవర్, ఉబెర్ బైక్‌ను ఢీకొన్న కారు

సస్పెక్ట్ షీటర్ హల్‌చల్

● గంజాయి సేవించి గ్యాంగ్‌తో కలిసి దౌర్జన్యం ● యువకులను చితకబాది బ్లేడ్లతో బెదిరింపు ● ఒకే రోజు మూడు ఫిర్యాదులు



ఘని (ఫైల్ ఫొటో)

పాయకాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పాయకాపురం ప్రకాష్‌నగర్ సెంటర్‌లో ఓ సస్పెక్ట్ షీటర్ తన గ్యాంగ్‌తో కలిసి హల్‌చల్ చేశాడు. గంజాయి మత్తులో అకారణంగా పలువురితో ఘర్షణలు పడి దాడులకు తెగబడ్డాడు. అడ్డొచినవారిని కోసేస్తామంటూ బ్లేడ్లు చూపించి భయభ్రాంతులకు గురిచేశాడు. అతడు, అతడి గ్యాంగ్ అరాచకాలపై ఆదివారం ఒక్కరోజే మూడు ఫిర్యాదులు నున్న పోలీసులకు అందాయంటే సస్పెక్ట్ షీటర్ గ్యాంగ్ చేసిన అరాచకం ఏంటో అర్థమవుతోంది. స్థానిక శాంతినగర్‌కు చెందిన చోటు అనే యువకుడు ప్రకాష్‌నగర్ సెంటర్‌లోని దుర్గాబార్‌లో మద్యం సేవించేందుకు వచ్చాడు. అప్పటికే పూర్తి గంజాయి మత్తులో ఉన్న చోటు మద్యం సేవించేందుకు వచ్చిన పలువురితో ఘర్షణలు పడ్డాడు. ఇద్దరిపై దౌర్జన్యం చేసి మరికొందరితో దురుసుగా ప్రవర్తించడంతో వారు అతడిపై తిరగబడ్డారు. దీంతో అక్కడి నుంచి వెళ్లిపోయిన చోటు నున్న రూరల్ పోలీసు స్టేషన్‌లో సస్పెక్ట్ షీటర్‌గా ఉన్న కుండేటి గణేష్ అలియాస్ ఘనిని ప్రకాష్‌నగర్ సెంటర్ తీసుకువచ్చాడు. గంజాయి మత్తులో ఉన్న ఘని నలుగురు అనుచరులతో కలిసి వచ్చి చోటుపై తిరగబడిన వ్యక్తులను పట్టుకుని చావబాదాడు. అడ్డుకునేందుకు వెళ్లిన యువకులకు బ్లేడ్లు చూపించి బెదిరించాడు. దీంతో బాధితులంతా కలిసి విడివిడిగా నున్న రూరల్ పోలీసులకు మూడు ఫిర్యాదులు చేశారు. కాగా తనపై దాడి చేసి బ్లేడ్లతో బెదిరించిన ఘని, చోటు తన వద్ద రూ. 20వేలు నగదు, సెల్‌ఫోన్ లాక్కెళ్లాడని ఓ యువకుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు చోటు, ఘని గ్యాంగ్ కోసం గాలిస్తున్నారు.

'జమిలి'తో రాష్ట్రాల స్వయంప్రతిపత్తికి దెబ్బ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

తిరువూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికల విధానంలో రాష్ట్రాలు, స్థానిక సంస్థలు తమ స్వయం ప్రతిపత్తిని కోల్పోతాయని, ప్రాంతీయ పార్టీల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వ విధానాలపై ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాల హక్కుల్ని కాలరాసే మోదీ ప్రభుత్వం తీసుకున్న జమిలి ఎన్నికల నిర్ణయానికి రాష్ట్రంలోని టీడీపీ, జనసేన, వైసీపీలు మద్దతు తెలపడం శోచనీయమన్నారు. ఒకే దేశం, ఒకే రాష్ట్రం, పేరుతో జెమిలి ఎన్నికలు నిర్వహిస్తే ఎన్నికల ఖర్చు తగ్గుతుందని, కేంద్ర ప్రభుత్వం చెపుతున్నా వాస్తవంగా ఖర్చులు మరింత పెరుగుతాయన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలనే డిమాండ్‌తో నవంబరు 8 నుంచి ప్రజా పోరు కార్యక్రమం నిర్వహించి 15న అన్ని మండల కేంద్రాల్లో ఆందోళన చేస్తామన్నారు. సీపీఎం నేతలు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి, మేకల నా గేంద్రప్రసాదు, గుళ్ళపల్లి వెంకటరత్నం, ఆంజనేయులు, కల్యాణ్ పాల్గొన్నారు.

అమరావతిలో 25 అడుగుల ఘంటసాల విగ్రహం

విజయవాడ కల్చరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో 25 అడుగుల ఘంటసాల విగ్రహం ఏర్పాటుకు ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఘంటసాల చైతన్య వేదిక రాష్ట్ర స్థాయి సమావేశం సోమవారం సాయంత్రం గాంధీనగర్ కౌతాపూర్ణానదం కళావేదికపై జరిగింది. ముఖ్యఅతిథిగా బొండా ఉమ హాజరై ప్రసంగించారు. అమర గాయకుడు ఘంటసాల 25అడుగుల విగ్రహాన్ని నెలకొల్పాలని, తెలుగు జాతిని జాగృత పరిచిన నందమూరి తారక రామారావు, ఘంటసాలకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలన్నారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ మాదిరి కృష్ణానదికి ఇరువైపుల మహనీయుల విగ్రహాలు నెలకొల్పాలన్న కళాకారులు కోరిక సమంజసమేనన్నారు. వారి కోరికలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నెరవేర్చేలా కృషిచేస్తానన్నారు. సంస్థ అధ్యక్షుడు కోట వెంకటేశ్వర రెడ్డి, తెలుగు కళావాహిణి అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, కళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్, ఎక్స్‌రే రే బోడి ఆంజనేయరాజు, కారుమంచి రాజు, జి.రంగారెడ్డి, కేవీ ప్రసాద్, ముష్టి శ్రీనివాస్, నాగేంద్ర పాల్గొన్నారు.

184కే కుప్పకూలిన మేఘాలయ

రెండోరోజు పట్టుబిగించిన ఆంధ్రా

విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మూలపాడు వేదికగా మేఘాలయతో జరుగుతున్న మల్టీడేస్ క్రికెట్ టోర్నీ కల్నల్ సీకే నాయుడు అండర్-23 మ్యాచ్‌లో అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లోను ఆంధ్ర జట్టు రెండోరోజు పైచేయిగా నిలిచింది. 373/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో సోమవారం రెండోరోజు ఆట ప్రారంభించిన ఆంధ్ర జట్టు 402/3 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. బ్యాటర్ హర్షవర్ధన్ 161 పరుగులతో అజేయంగా నిలిచాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన మేఘాలయ 66.4 ఓవర్లలో 184 పరుగులకు కుప్పకూలింది. ఏపీ బౌలర్ వాసు 54 పరుగులిచ్చి 6 వికెట్లు తీసి మేఘాలయను చావు దెబ్బతీశాడు. ఆ జట్టులో స్వస్తిక్ 49 పరుగులు, కేవిన్ 33 పరుగులే అత్యధికం. దీంతో మేఘాలయ ఫాలో ఆన్‌లో పడింది. రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఆ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 23/3 పరుగులతో నిలిచింది. ఇన్నింగ్స్ ఓటమి బారి నుంచి మేఘాలయ తప్పించుకోవాలంటే ఇంకా 195 పరుగులు చేయాల్సి ఉంది.

సాధారణ స్థితికి భవానీ ద్వీపం

ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ



అధికారులతో కలిసి భవానీద్వీపాన్ని పరిశీలిస్తున్న బాలాజీ

ఆంధ్రజ్యోతి-విజయవాడ: వరదల వల్ల తీవ్రంగా దెబ్బతిన్న భవానీ ఐల్యాండ్‌ను ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) చైర్మన్ నూకసాని బాలాజీ సోమవారం సందర్శించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వరదల కారణంగా ద్వీపానికి జరిగిన నష్టాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ద్వీపం పునరుద్ధరణకు సత్వరం తీసుకోవాల్సిన చర్యలను ఏపీటీడీసీ అధికారులు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. వరదల్లో చిక్కుకున్న భవానీ ద్వీపం, హరిత బెర్మ్‌పార్క్, బోటింగ్ యూనిట్లను తిరిగి మళ్లీ సాధారణ స్థితికి తీసుకురావటానికి తాత్కాలికంగా రూ.40లక్షలు, శాశ్వత ప్రాతిపదికన నిర్మించటానికైతే దాదాపుగా రూ.5కోట్ల వరకు ఖర్చవుతుందని చెప్పినట్టు తెలిసింది. కార్తీక మాసంలో రూ.కోటికి పైగా ఆదాయం వస్తుందని, వచ్చే కార్తీక మాసానికల్లా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాధారణ ఆతిథ్య సేవలు ఎంతవరకు ఇవ్వగలమో అంతవరకు ప్రయత్నించాలని అధికారులను చైర్మన్ ఆదేశించారు. ఆర్థిక సమస్యలతో ముడిపడిన వాటికి తక్షణం ప్రభుత్వం సాయం కోరతానన్నారు. భవానీ ఐల్యాండ్, హరిత బెర్మ్ పార్క్‌లను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. చైర్మన్ పరిశీలనలో ఏపీటీడీసీ చీఫ్ ఇంజనీర్ నరసింహారావు, సూపరింటెండెంట్ ఇంజనీర్ ఈశ్వరయ్య, విజయవాడ డివిజినల్ మేనేజర్ చైతన్య పాల్గొన్నారు.



దుర్గగుడి ఈవో ఆధ్వర్యంలో కానుకల లెక్కిస్తున్న సిబ్బంది

దుర్గమ్మ దసరా కానుకల ఆదాయం రూ.9.26 కోట్లు

వన్‌టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ సన్నిధిలో ఇటీవల జరిగిన దసరా మహోత్సవాల్లో భక్తులు సమర్పించిన కానుకలు రూ.9.26 కోట్లు మేరకు నగదు రూపేణ లభించింది. ఈనెల 16, 17న రెండు సార్లు కానుకలను లెక్కించగా సోమవారం మిగిలిన కానుకలను లెక్కించారు. మొత్తంగా మూడు రోజుల లెక్కింపులో నగదు రూపేణ రూ.9,26,97,047 మేరకు కానుకల రూపంలో వచ్చింది. బంగారం 733 గ్రాములు, వెండి 25 కిలోల 705 గ్రాములు వచ్చింది. 523 యుఎస్‌ఏ డాలర్లు, 5 యూరోలు, 1.5 ఓమన్ రియాల్స్, 900 బైసాలు, 35 ఇంగ్లండ్ పౌండ్లు, 20 ఫిజీ డాలర్లు, 116 సౌదీ రియాల్స్, 25 యుఏఈ దీర్హమ్స్, 12 మలేషియా రింగెట్లు, 50 కెనడా డాలర్లు, 46.5 కువైట్ దీనార్లు, 215 ఆస్ట్రేలియా డాలర్లు, 6 సింగపూర్ డాలర్లు, 27 ఖతార్ రియాల్స్ వచ్చాయి. సోమవారం నాటి లెక్కింపులో రూ.3,05,96,971 రాగా, బంగారం 321 గ్రాములు, వెండి 9 కిలోల 882 గ్రాములు లభించింది. యుఎస్‌ఏ డాలర్లు 168, ఆస్ట్రేలియా డాలర్లు 55, 41.5 కువైట్ దీనార్లు, 27 ఖతార్ రియాల్స్, 5 అరబ్ ఎమిరేట్స్ దీర్హమ్స్, 10 మలేషియా రింగెట్లు, 100 సౌదీ రియాల్స్ లభించాయి.

నెల జీతం అదనంగా ఇవ్వండి

ఏఐటీయూసీ డిమాండ్

గవర్నర్‌పేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వరదల సమయంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు శ్రమించిన మున్సిపల్ కార్మికులకు ఒక నెల జీతం అదనంగా చెల్లించాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు డిమాండ్ చేశారు. బ్రహ్మానందరెడ్డి నగర్ శానిటరీ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ విజయవాడ నగరాన్ని నీట ముంచిన బుడమేరు వరదల్లో పగలు రాత్రి శ్రమించిన కార్మికులకు ఒక నెల జీతం బోనస్‌గా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులకు కనీస వేతనం చట్టం అమలు చేయాలని, కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటుందన్నారు. ఏఐటీయూసీ నగరాధ్యక్షుడు కేఆర్ ఆంజనేయులు, నేతలు బుద్దె రాజా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు జెక్కి జేమ్స్, తుపాకుల నాగేశ్వరరావు, ప్రతాప్ పాల్గొన్నారు.

జాతీయపతాక రూపశిల్పికి సముచిత గౌరవం

మహాత్మాగాంధీకి జాతీయ పతాకం ఆవశ్యకత తెలిపి మరీ..

(5వ పేజీ తరువాయి)

మహాత్మాగాంధీ పిలుపు మేరకు జాతీయ స్వాతంత్ర్య ఉద్యమంలో పింగళి పాల్గొన్నారు. బాలగంగాధరతిలక్, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఆయనకు రాజకీయ గురువులు. 1906లో కలకత్తాలో కాంగ్రెస్ సమావేశాల ప్రారంభంలో బ్రిటీష్‌వారి జాతీయ జెండాను, జాతీయ కాంగ్రెస్ నాయకులు ఆవిష్కరించడం చూసి పింగళి ఎంతో కలత చెందేవారు. మన దేశానికి ఒక జాతీయజెండా ఉండాలని సన్నిహితుల వద్ద తరచూ అంటూ ఉండేవారు. 1916లో భారతదేశానికి ఒక జాతీయ జెండా అనే పుస్తకాన్ని పింగళి రచించారు. 1921 మార్చిలో కృష్ణాజిల్లా విజయవాడలో జాతీయ కాంగ్రెస్ సమావేశంలో మహాత్మాగాంధీకి జాతీయ జెండా ఆవశ్యకతను పింగళి వివరించారు. మహాత్మాగాంధీ సూచనలతో కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులు, మధ్యలో రాట్నం ఉన్న జాతీయ జెండాను పింగళి వెంకయ్య మూడు గంటల్లోనే తయారు చేసి చూపారు. ఈ సమావేశంలోనే పింగళి రూపొందించిన జెండాను జాతీయ జెండాగా మహాత్మాగాంధీ ప్రకటించి, తీర్మానం కూడా చేయించారు. 1921 ఏప్రిల్ 13న యంగ్ ఇండియా పత్రికలో మహాత్మాగాంధీ మన జాతీయ పతాకం అనే శీర్షికతో ప్రత్యేకవ్యాసం రాసి జాతీయ జెండాను రూపొందించిన పింగళిని కొనియాడారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి రాజ్యాంగం అమలులోకి వచ్చాక త్రివర్ణపతాకాన్ని జాతీయ పతాకంగా గుర్తించారు. జాతీయ జెండాలోని రాట్నం గుర్తుకు బదులుగా సత్యానికి, ధర్మానికి ప్రతీకగా ఉన్న అశోకచక్రాన్ని ఉంచాలని తీర్మానం చేశారు. 1963 జూలై 4న పింగళి వెంకయ్య పరమపదించారు. ప్రధాన మంత్రి లాల్ బహదూర్‌శాస్త్రి విజయవాడ వచ్చిన సమయంలో గాంధీహిల్‌లోని గ్రంథాలయం హాలులో పింగళి చిత్రపటాన్ని ఆవిష్కరించారు. నందమూరి తారకరామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై పింగళి వెంకయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం పింగళి పేరుతో స్టాంప్‌ను విడుదల చేసింది. ఇలా పలు సందర్భాల్లో పింగళిని స్మరించుకుంటూ వచ్చినా ఆయన సొంత జిల్లాలో ఆయనకు సముచిత గుర్తింపునివ్వడంలో కూటమి ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసింది. మచిలీపట్నం వైద్య కళాశాలకు పింగళి పేరును పెట్టడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఒక ఆశయం నెరవేరింది



మచిలీపట్నం మెడికల్ కళాశాలకు పింగళి వెంకయ్య పేరును పెడుతూ ఉత్తర్వు లు జారీ చేసిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు. గత ప్రభుత్వం హయాంలో మెడికల్ కళాశాలకు పింగళి పేరు పెట్టాలని పలుమార్లు కోరినా, అప్పటి పాలకులు పట్టించుకోలేదు. ఇటీవల మచిలీపట్నం వచ్చిన ముఖ్యమంత్రి వద్ద పింగళి పేరును మెడికల్ కళాశాలకు పెట్టాలని ప్రతిపాదన చేశా. వెంటనే స్పందించిన సీఎం ఉత్తర్వులు జారీ చేయించారు. పింగళికి అత్యున్నత గౌరవం లభించేలా సీఎం చంద్రబాబు చొరవ తీసుకోవడం ఆనందంగా ఉంది. ఒక ఆశయాన్ని సాధించగలిగాను. భోగరాజు స్మారక భవన నిర్మాణం చేయడం ద్వారా రెండో ఆశయ సాధనకు స్థానికంగా ఉన్న రాజకీయ శక్తులు అడ్డుపడుతున్నాయి. అయినా సాధిస్తానన్న నమ్మకం ఉంది.

- వల్లభనేని బాలశౌరి, మచిలీపట్నం ఎంపీ

నీటి సంఘాల ఎన్నికలకు మోగిన నగారా


(5వ పేజీ తరువాయి)

ముగిసిన తర్వాత వాటి గురించి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధమవ్వడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఉమ్మడి కృష్ణాజిల్లా సాగునీటి పరంగా రెండు విధాలుగా ఉంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఎడమ కాల్వ పరిధి మేజర్ ఇరిగేషన్‌గా ఉంది. ప్రకాశం బ్యారేజ్ దిగువ నుంచి ఉన్న ప్రాంతం డెల్టాగా ఉంది. ఇప్పుడు ఈ రెండింటిలో ఎన్నికల హడావుడి మొదలైంది. ఎన్ఎస్‌పీ ఎడమ కాల్వ పరిధిలో 3.62 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా, దీని కింద 17 డిస్ట్రిబ్యూషన్ కమిటీ(డీసీ)లు, 106 సాగునీటి సంఘాలున్నాయి. ఇది కాకుండా ప్రాజెక్టు కమిటీ ఉంది. దీని ప్రధాన కార్యాలయం నూజివీడులో ఉంది. తూర్పు డెల్టా పరిధిలో 7.39 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. 58వేల ఎకరాల ఆయకట్టు ఏలూరు జిల్లాలో ఉంది. ఈడెల్టా పరిధిలో 220 సాగునీటి సంఘాలు, 32 డీసీలున్నాయి. ఈ మొత్తం ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితాను నవంబరు 13న ప్రచురిస్తారు. 20న నోటిఫికేషన్, 21 నుంచి 23 వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. 24 నుంచి 26 వరకు డీసీలకు, 27 నుంచి 29 వరకు ప్రాజెక్టు కమిటీ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తారు. ఎన్టీఆర్ జిల్లాలో ఎన్టీఆర్ ఎన్ఎస్‌పీ ఎడమ కాల్వ రెండు జోన్లుగా ఉంది. జోన్-1లో జగ్గయ్యపేట, తిరువూరు, నందిగామలో సగభాగం ఉండగా, జోన్-2లో నూజివీడు, గన్నవరం, మైలవరం, నందిగామలో మరికొంత భాగం ఉన్నాయి. నీటి సంఘాలకు ఎన్నికైన సభ్యులు నీటి వినియోగ సంఘాల అధ్యక్షులను ఎన్నుకుంటారు. ఈ నీటి వినియోగ సంఘాలు డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటాయి. ఈ డీసీలన్నీ కలిపి ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటాయి. ఎన్టీఆర్ జిల్లాలో నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి పులిచింతల ప్రాజెక్టు ఎస్ఈ శ్రీరామకృష్ణను నోడల్ అధికారిగా నియమించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
మంగళవారం • 22 అక్టోబరు 2024
cinema@andhrajyothy.com



పెళ్లి పనులు మొదలయ్యాయి...



అక్కినేని నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల త్వరలో పెళ్లి పీటలెక్కనున్న విషయం తెలిసిందే. ఇటీవల వీరి నిశ్చితార్థం వేడుకగా జరిగింది. తాజాగా పెళ్లి పనులు మొదలయ్యాయి. పసుపు దంచుతున్న ఫొటోలను శోభిత తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. 'గోధుమరాయి పసుపు దంచడంతో పనులు ప్రారంభమయ్యాయి' అని క్యాప్షన్ పెట్టారు. ఎరుపు రంగు పట్టు చీరలో శోభిత సంప్రదాయబద్ధంగా మెరిసిపోతూ కనిపించారు. తాను ధరించిన చీర అత్తగారైన లక్ష్మి(నాగ చైతన్య తల్లి) ఇచ్చారని శోభిత కామెంట్స్‌లో పేర్కొన్నారు. ఈ ఫొటోలు వైరల్‌గా మారాయి. పెళ్లి ఎక్కడ, ఎప్పుడు అనేది ఇంకా వెల్లడించలేదు. ఈ ఫొటోలు చూసిన అభిమానులు అదే ప్రశ్న అడుగుతున్నారు.



ఈ చిత్రం.. నాకెంతో ప్రత్యేకం



మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్, మీనాక్షీ చౌదరి జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ నెల 31న సినిమా విడుదలవుతోంది. సోమవారం ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ "ఈ చిత్రం.. నాకెంతో ప్రత్యేకం. ఓ సాధారణ బ్యాంక్ ఉద్యోగి డబ్బు కోసం ఏం చేశాడు అనేది చాలా ఆసక్తికరంగా చూపించాం. వినోదంతో పాటు భావోద్వేగాలు కలగలిసిన చిత్రమిది. సినిమా మీ అందరికీ తప్పక నచ్చుతుంది. కుటుంబమంతా కలసి చూడవలసిన చిత్రమిది" అని చెప్పారు. "సినిమాలో ప్రతీ సన్నివేశం కొత్తగా ఉంటుంది" అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ అన్నారు. "ఇప్పటివరకు నేను చేసిన పాత్రల్లో ఈ సినిమాలో పోషించిన సుమతి రోల్ నాకు చాలా ఇష్టం" అని హీరోయిన్ మీనాక్షీ చౌదరి చెప్పారు.

పుట్టినరోజున కొత్త కబురు

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'రాజా సాబ్' చిత్రం నుంచి అభిమానులు ఎదురు చూస్తున్న అప్‌డేట్ వస్తోంది. ఈ నెల 23న ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా అప్‌డేట్ ఉంటుందని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చెప్పారు. ప్రభాస్ ఇంతవరకూ టచ్ చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో 'రాజా సాబ్' ను దర్శకుడు మారుతి రూపొందిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ప్రభాస్ అల్ట్రా స్టయిలిష్‌గా కనిపిస్తున్నారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్న 'రాజా సాబ్' చిత్రీకరణ తుది దశలో ఉంది. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నట్లు నిర్మాత చెప్పారు.

బుజ్జమ్మ పాత్ర అందరికీ నచ్చేస్తుంది

హీరోయిన్ అనన్య నాగళ్ల నటించిన తాజా చిత్రం 'పొట్టేల్'. యువచంద్రకృష్ణ కథానాయకుడు. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో సురేశ్‌కుమార్ సడిగె నిర్మించారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతున్న సందర్భంగా అనన్య మీడియాతో ముచ్చటించారు. "ఈ కథ విన్నప్పుడే ఇందులో తప్పకుండా భాగం అవ్వాలనుకున్నా. ఇందులో బుజ్జమ్మ అనే పాత్రలో నటించాను. నేను ఇదివరకు నటించిన సినిమాలతో పోలిస్తే ఇందులో నా పాత్ర చాలా ఆసక్తికరంగా ఉంటుంది. సినిమాలో నటించిన



ప్రతీ ఒక్కరికీ మంచి గుర్తింపు తెచ్చే చిత్రమిది. ప్రతీ పాత్రకూ ప్రాధాన్యం ఉంటుంది. ఇందులో కథానాయకుడు యువచంద్రది 'పొట్టేల్' లాంటి మనస్తత్వం. ఎంత కష్టమొచ్చినా... ధైర్యంతో ముందుకెళ్లి ఢీకొనడమే తన నైజం. ఆయనతో కలసి నటించడం మరిచిపోలేని అనుభూతి. దర్శకుడు సాహిత్ మోత్కూరి తన మేకింగ్ స్కిల్స్‌తో అందరినీ ఆశ్చర్యపరుస్తారు. అజయ్ నటన ఈ సినిమాకు హైలెట్‌గా ఉండనుంది. శేఖర్ చంద్ర అందించిన సంగీతం సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లింది. చక్కటి సందేశంతో పాటు తగినన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌ను మిక్స్ చేసిన ఈ సినిమా అందరినీ అలరిస్తుంది.

ప్రతి పాత్రకూ ప్రాముఖ్యం



వరుణ్ తేజ్ హీరోగా కరుణ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మట్కా'. డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మాతలు. మీనాక్షి చౌదరి, నవీన్ చంద్ర, అజయ్ ఘోష్ ఇతర పాత్రల్లో నటించారు. ఈ సినిమా నవంబరు 14న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా మూవీ టీజర్, సలోని క్యారెక్టర్‌ను పద్మగా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. సినిమాలో ప్రతి పాత్రకూ చాలా ప్రాముఖ్యం ఉంటుందని చిత్ర బృందం తెలిపింది.

అలియా కొత్త ఇల్లు ఖరీదెంతో తెలుసా?



రణబీర్ కపూర్, అలియా కట్టుకుంటున్న కొత్త ఇల్లు రెడీ అయింది. రూ. 250 కోట్ల ఖర్చుతో ఆరు అంతస్తులతో తయారైన ఈ భవనానికి వాళ్ల నాయనమ్మ కృష్ణరాజ్ పేరు పెట్టాలని ఈ దంపతులు నిర్ణయించుకున్నారు. తమ కలల సౌధం ఎలా ఉండాలని అలియా కోరుకుందో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సరిగ్గా అలాగే కట్టించుకుంది. తనకు తీరిక దొరికనప్పుడల్లా భర్తతో కలసి వచ్చి నిర్మాణాన్ని పర్యవేక్షించేది. ఈ భవంతి పూర్తి కావడానికి రెండేళ్లు పట్టింది. ఇటీవలే భర్త, కూతురు రెహాతో కలిసి కొత్త ఇంటికి వెళ్లి వచ్చింది అలియా. దీపావళి రోజున అలియా దంపతులు గృహప్రవేశం చేయనున్నారు. ఈ ఖరీదైన భవనాన్ని కూతురికి కానుకగా ఇవ్వాలని అలియా ఆలోచన.

ఆమీర్‌తో కిశోర్‌కుమార్ బయోపిక్





బాలీవుడ్ గాయక సంచలనం కిశోర్‌కుమార్ బయోపిక్ తీయాలని బాలీవుడ్ నిర్మాత భూషణ్ కుమార్ ఆలోచన. ఈ బయోపిక్ తీసే బాధ్యతను దర్శకుడు అనురాగ్ బసుకు అప్పగించారు. కిశోర్‌కుమార్ పాత్రను ఆమీర్‌ఖాన్ పోషిస్తే బాగుంటుందని దర్శకనిర్మాతల ఆలోచన. ఆమీర్‌కు కూడా కిశోర్‌కుమార్ అంటే ఎంతో అభిమానం ఉండడంతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ముఖ్యంగా అనురాగ్ ఈ సబ్జెక్ట్‌ను డీల్ చేసే విధంగా ఆమీర్‌ను కదిలించింది. ట్రీట్‌మెంట్ కొత్తగా ఉండడం కూడా ఆమీర్‌కు నచ్చింది. ఇప్పటికి నాలుగైదు సార్లు ఈ సబ్జెక్ట్ విషయమై కలసి చర్చించారు. ఒకేసారి ఐదు చిత్రాల్లో నటించాలని ఆమీర్‌ఖాన్ నిర్ణయించుకుని ఆ యా చిత్రాల దర్శకులకు ఓకే చెప్పేశారు. ఇప్పుడు ఆ జాబితాలో కిశోర్‌కుమార్ బయోపిక్ ఆరో చిత్రమవుతుంది.

అందుకే హిందీలో మాట్లాడను



సమంత


'నేను హిందీలో మాట్లాడగలను కానీ ఉచ్చారణ దోషాలు ఉంటాయి. అందుకే వేదికలపై హిందీలో మాట్లాడను' అని చెప్పారు సమంత. అసలు విషయం ఏమిటంటే 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్ 'హనీ.. బన్నీ' సిరీస్ దర్శకులు రాజ్, డీకే ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ సిరీస్‌లో కథానాయిక మొదట సమంతను అనుకోలేదని చెప్పారు. 'మేం రూపొందిస్తున్న 'ఫ్యామిలీ మ్యాన్ 2' నిర్మాణ సమయంలోనే 'సిటాడెల్' స్క్రిప్ట్ దశలో ఉంది. అయినా ఈ విషయం సమంతకు చెప్పలేదు. ఎందుకంటే హీరోయిన్‌గా హిందీ బాగా మాట్లాడగలిగే వ్యక్తి ఉంటే బాగుంటుందని అనుకున్నాం. 'ఫ్యామిలీ మ్యాన్ 2' షూటింగ్‌లో సమంత హిందీలో మాట్లాడకపోవడంతో ఆమెకు రాదేమో అనుకుని మరో హీరోయిన్ ని తీసుకోవాలని అనుకున్నాం. కానీ సమంత ఓ రోజు స్వచ్ఛమైన హిందీలో మాట్లాడడంతో ఆశ్చర్యపోయి ఆమెని ఎంపిక చేశాం' అని చెప్పారు. అప్పుడు సమంత అలా కామెంట్ చేశారు.



మరో ప్రపంచంలోకి తీసుకెళ్లేలా...

రాకేశ్ గలేబి, భార్గవ్ గోపినాథం, స్రవంతి ప్రత్తిపాటి, మానసవీణ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రహస్యం ఇదం జగత్'. కోమల్.ఆర్. భరద్వాజ్ దర్శకత్వంలో పద్మ రావినూతుల, హిరణ్య రావినూతుల నిర్మిస్తున్నారు. ఇటీవలే టీజర్‌ను విడుదల చేసిన చిత్రబృందం, సోమవారం ప్రెస్ మీట్ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు కోమల్.ఆర్.భరద్వాజ్ మాట్లాడుతూ "శ్రీ చక్రం ప్రేరణతో ఈ కథను తయారు చేశాను. ప్రేక్షకులను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లేలా విజువల్స్ ఉంటాయి" అని చెప్పారు. నవంబర్ 8న చిత్రం విడుదలవుతోంది.

సగం వాటా అమ్మేశారు



బాలీవుడ్ టాప్ డైరెక్టర్, ప్రొడ్యూసర్, హోస్ట్ కరణ్ జోహార్ తన నిర్మాణ సంస్థ 'ధర్మ ప్రొడక్షన్స్'లో సగభాగం వాటా అమ్మేశాడు. కొన్ని రోజులుగా కరణ్ జోహార్ 'ధర్మ ప్రొడక్షన్స్'ని అమ్మకానికి పెట్టినట్లు వార్తలొచ్చాయి. తాజాగా ఆ వార్తలు నిజమయ్యాయి. కరణ్‌కు చెందిన 'ధర్మ'లోని 50 శాతం వాటాని ప్రముఖ టీకాల తయారీ సంస్థ అధినేత అదర్ పూనావాలా రూ.1000 కోట్లకు దక్కించుకున్నాడు. మరో 50 శాతం వాటా కరణ్ పేరు మీదే ఉండనుంది. ఈ డీల్ తరవాత ధర్మ ప్రొడక్షన్స్ విలువ ఏకంగా రూ. రెండు వేల కోట్లకు పెరుగుతుందని సెరీన్ ప్రొడక్షన్స్ పేర్కొంది. ధర్మ ప్రొడక్షన్స్ కొంత కాలంగా భారీ నష్టాలను చవిచూస్తోంది. అలియా భట్‌తో నిర్మించిన ఇటీవలి చిత్రం జిగ్రా నష్టాల కారణంగా ధర్మ సంస్థ ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిలో కొట్టుమిట్టాడుతోంది. జిగ్రా ఇప్పటి వరకు టోటల్ కలెక్షన్ రూ.21 కోట్లు మాత్రమే వసూలు చేసింది. బాలీవుడ్ మీడియా కథనాల ప్రకారం.. రూ.80 కోట్ల బడ్జెట్‌తో జిగ్రా నిర్మించారు. పబ్లిసిటీకి మరో రూ.10 కోట్లు కేటాయించారు. కాగా, 'ధర్మ ప్రొడక్షన్స్'కి ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా కరణ్ ఉండగా, ఆయన స్నేహితుడు అపూర్వ మెహతా సీఈవోగా కొనసాగుతున్నాడు.

కొత్తగా..

క్రైమ్ కామెడీ థ్రిల్లర్



నూతన నటుడు సన్నీ హీరోగా తెలుగుతెరకు పరిచయమౌతున్న చిత్రం 'తస్కరించుట'. ఈ క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌ను శివప్రసాద్ చలువాది దర్శకత్వంలో షేక్ అఫ్రీన్ నిర్మిస్తున్నారు. సోమవారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆకాశ్ పూరి మాట్లాడుతూ "సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.

లక్ష్మీరాయ్ త్రిపాత్రాభినయం



లక్ష్మీరాయ్ ప్రధాన పాత్రలో గురుప్రసాద్ దర్శకత్వంలో తమిళ, కన్నడ భాషల్లో విడుదలై ఘనవిజయం సాధించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. త్వరలోనే తెలుగులోనూ ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. సోమవారం ట్రైలర్‌ను సుమన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ చిత్రం తెలుగులోనూ ఘనవిజయం సాధిస్తుంది" అని చెప్పారు. "లక్ష్మీరాయ్ త్రిపాత్రాభినయం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. ఇందులో ఆమె సమాజంలో జరిగే అన్యాయాలను అంతమొందించే శక్తిమంతమైన పాత్రను పోషించారు" అని చిత్ర నిర్మాత డా.ప్రతాని రామకృష్ణగౌడ్ అన్నారు.

మత్స్యకారుల జీవితాలను ప్రతిబింబించేలా...



రమాకాంత్, అవంతిక, భానుశ్రీ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సముద్రుడు'. నగేశ్ నారదాసి దర్శకత్వంలో బధావత్ కిషన్ నిర్మించారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో నిర్మాత బధావత్ కిషన్ మాట్లాడుతూ "మత్స్యకారుల జీవితాలను ప్రతిబింబించేలా ఉండే చిత్రమిది. ప్రేక్షకులకు నచ్చే అన్ని అంశాలున్న మంచి కంటెంట్ ఓరియెంటెడ్ సినిమా ఇది" అని అన్నారు.

స్పోర్ట్స్

'కామన్వెల్త్' నుంచి హాకీ అవుట్?

మెల్‌బోర్న్: స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరిగే 2026 కామన్వెల్త్ క్రీడల్లో హాకీకి చోటుదక్కే అవకాశం లేదని తెలుస్తోంది. ఖర్చుల నియంత్రణ భాగంగా నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకోనున్నట్టు పత్రికలు కథనాలు వెలువరించాయి. అయితే, అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్), కామన్వెల్త్ గేమ్స్ సమాఖ్య (సీజీఎఫ్) ఈ విషయంపై పెదవి విప్పడం లేదు. రోస్టర్ విడుదల చేసిన తర్వాత మాట్లాడతామని ఎఫ్‌ఐహెచ్ చెప్పింది. 1998 నుంచి కామన్వెల్త్ క్రీడల్లో హాకీ కొనసాగుతోంది. అయితే ఈసారి హాకీతోపాటు హ్యాండ్‌బాల్, రోడ్‌రేసింగ్ ఈవెంట్లను కూడా తొలగించాలని నిర్వాహకులు భావిస్తున్నారట. మొత్తంగా 2022 బర్మింగ్‌హామ్ క్రీడల్లో 19 క్రీడలకు చోటు కల్పించగా.. గ్లాస్గోలో ఆ సంఖ్యను 10కి కుదించే ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం.

భక్తి సంగీత విభావరికి విరాట్



ముంబై: బెంగళూరులో న్యూజిలాండ్‌తో టెస్ట్ మ్యాచ్ ఓడిన కొన్ని గంటల్లోనే కోహ్లీ ముంబైలో ప్రత్యక్షమయ్యాడు. భార్య అనుష్క శర్మతో కలిసి కృష్ణదాస్ నిర్వహించిన భక్తి సంగీత విభావరికి హాజరయ్యాడు. వీరి ఫొటోలను నిర్వాహకులు షేర్ చేశారు.

పుజార రికార్డు 'డబుల్'



రాజ్‌కోట్: ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అత్యధిక (18) ద్విశతకాలు బాదిన నాలుగో ఆటగాడిగా వెటరన్ చటేశ్వర్ పుజార (234) రికార్డులకెక్కాడు. ఛత్తీస్‌గఢ్‌తో సోమవారం డ్రాగా ముగిసిన మ్యాచ్‌లో సౌరాష్ట్ర ఆటగాడు పుజార కెరీర్‌లో 18వ డబుల్ సెంచరీతో మెరిశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఛత్తీస్‌గఢ్ 578/7 డిక్లేర్ చేయగా.. సౌరాష్ట్ర 8 వికెట్లకు 478 పరుగులు సాధించింది. కాగా, 21 వేల పరుగులు చేసిన పుజార.. గవాస్కర్, సచిన్, ద్రవిడ్ తర్వాత ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఈ మైలురాయిని చేరిన నాలుగో భారత క్రికెటర్‌గా నిలిచాడు. మరోవైపు అత్యధిక డబుల్ సెంచరీలు చేసిన వారిలో డాన్ బ్రాడ్‌మన్ (37) టాప్‌లో ఉండగా.. వాలీ హమ్మండ్ (36), పాస్సీ హెండ్రెన్ (22) తర్వాతి స్థానంలో పుజార (18) చోటు దక్కించుకొన్నాడు.



తొలి బ్యాటర్ సమద్..

రంజీల్లో రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలు చేసిన తొలి జమ్మూకశ్మీర్ బ్యాటర్‌గా అబ్దుల్ సమద్ (127, 108) అరుదైన ఘనతను అందుకొన్నాడు. ఒడిశాతో డ్రాగా ముగిసిన మ్యాచ్‌లో సమద్ ఈ ఫీట్ చేశాడు. జమూ కశ్మీర్ 270, 270 డిక్లేర్ చేయగా.. ఒడిశా 272, 112/8 స్కోర్లు సాధించింది.

హైదరాబాద్ రెండో ఓటమి

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌తో రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ 78 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఓవర్‌నైట్ స్కోరు 189/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఉత్తరాఖండ్ 235 పరుగులకు ఆలౌటైంది. ఆల్‌రౌండర్ మిలింద్ (3/31) టెయిలెండర్ల పనిపట్టాడు. అనంతరం 269 పరుగుల లక్ష్య ఛేదనలో హైదరాబాద్ ఆటగాడు రోహిత్ రాయుడు (47 నాటౌట్) రాణించాడు. రెండో ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 190 పరుగులకు ఆలౌటై, ఈ సీజన్‌లో రెండో ఓటమిని నమోదు చేసింది.. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో ఉత్తరాఖండ్ 325, హైదరాబాద్ 292 పరుగులకు ఆలౌటయ్యాయి.

ఆంధ్ర పోరాడినా..

అహ్మదాబాద్: ఆంధ్రతో జరిగిన రంజీ మ్యాచ్‌లో గుజరాత్ ఒక వికెట్‌తో విజయం సాధించింది. 144 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన గుజరాత్ జట్టును ఆంధ్ర స్పిన్నర్ లలిత్ మోహన్ (7/76) ముప్పు తిప్పలు పెట్టాడు. మ్యాచ్‌లో మొత్తం 10 వికెట్లను లలిత్ తన ఖాతాలో వేసుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో గుజరాత్ 9 వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసి నెగ్గింది. అంతకు ముందు ఫాలోఆన్‌లో ఓవర్‌నైట్ స్కోరు 203/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 297 రన్స్‌కు ఆలౌటైంది. ఇక, తొలి ఇన్నింగ్స్‌లో గుజరాత్ 367కు, ఆంధ్ర 213 పరుగులకు ఆలౌటయ్యాయి.

స్వియటెక్‌ను దాటేసి.. టాప్ ర్యాంక్ పట్టేసి..



నెంబర్‌వన్ సబలెంక

సెయింట్ పీటర్స్‌బర్గ్ (యూఎస్): యూఎస్ ఓపెన్ చాంపియన్ అరినా సబలెంకా డబ్ల్యూటీఏ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నెంబర్‌వన్‌గా అవతరించింది. సోమవారం అధికారికంగా ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో మహిళల సింగిల్స్‌లో ఇగా స్వియటెక్‌ను దాటేసి బెలారస్ స్టార్ సబలెంక టాపర్‌గా నిలిచింది. ఇక గత 11 నెలలుగా టాప్ ర్యాంక్‌లో కొనసాగిన పోలెండ్ క్వీన్ స్వియటెక్ రెండో ర్యాంక్‌కు పడిపోయింది. సబలెంక నెంబర్‌వన్ ర్యాంక్ దక్కించుకోవడం ఇదే తొలిసారి కాదు. గతేడాది సెప్టెంబరు నుంచి నవంబరు దాకా ఆమె టాప్‌లో నిలిచింది. ఇక, కొకొ గాఫ్, జెస్సికా పెగులా, ఎలెనా రిబకినా వరుసగా 3, 4, 5 ర్యాంకులతో టాప్-5లో ఉన్నారు.

ఒకే రోజు 16 వికెట్లు

106కే కుప్పకూలిన బంగ్లాదేశ్



రబాడ

ఢాకా: బంగ్లాదేశ్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య సోమవారం ఆరంభమైన తొలి టెస్టులో ఇరు జట్ల బౌలర్లు పండగ చేసుకున్నారు. ఏకంగా ఒకే రోజు 16 వికెట్లు నేలకూలాయి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 40.1 ఓవర్లలో 106 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ మహ్ముదుల్ (30) టాప్ స్కోరర్. వీరి అత్యధిక భాగస్వామ్యం (26) తొమ్మిదో వికెట్‌కు లభించడం గమనార్హం. పేసర్లు రబాడ, ముల్డర్, స్పిన్నర్ కేశవ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. అలాగే రెండో సెషన్‌లోనే బరిలోకి దిగిన సౌతాఫ్రికా వెలుతురులేమితో ఆట ముగిసేసరికి తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లకు 140 పరుగులు చేసింది. ప్రస్తుతానికి 34 పరుగుల స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతుండగా.. క్రీజులో కైల్ వెరైన్ (18 బ్యాటింగ్), ముల్డర్ (17 బ్యాటింగ్) ఉన్నారు. స్పిన్నర్ తైజుల్‌కు ఐదు వికెట్లు లభించాయి. కాగా టెస్టు క్రికెట్‌లో అతి తక్కువ బంతుల్లో (11,817)నే 300 వికెట్లు తీసిన బౌలర్‌గా రబాడ నిలిచాడు. పాక్ దిగ్గజం వఖార్ యూనిస్ (12,602)ను అధిగమించాడు.

100 శాతం ఫిట్‌గా ఉన్నా



న్యూఢిల్లీ: ప్రస్తుతం గాయం నుంచి కోలుకుని, ఎలాంటి నొప్పి లేకుండా ఉన్నానని పేసర్ మహ్మద్ షమి తెలిపాడు. 2023 వన్డే వరల్డ్‌కప్ తర్వాత అతడు గాయం కారణంగా క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. ఈనేపథ్యంలో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో షమి ఆడాలని భావిస్తున్నాడు. 'నేను గతంలోలా తక్కువ దూరం నుంచి కాకుండా ఆదివారం పూర్తి స్థాయిలో బౌలింగ్ చేశాను. అలాగే 100 శాతం నొప్పినుంచి విముక్తిడినయ్యా. ఆసీస్ టూర్‌లో నేనుంటానా? లేదా? అని అంతా ఆలోచిస్తున్నారు. కానీ దానికింకా సమయం ఉంది. అంతకంటే ముందు నేను ఫిట్‌గా ఉంటూ, ఆ సిరీస్‌కు సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉంది. అందుకే ముందుగా రంజీ మ్యాచ్‌లు ఆడాలనుకుంటున్నా' అని షమి తెలిపాడు.



దీపికకు రజతం

ధీరజ్ విఫలం ● ఆర్చరీ వరల్డ్ కప్ ఫైనల్

న్యూఢిల్లీ: వెటరన్ ఆర్చర్ దీపికా కుమారి మెక్సికోలో జరిగిన వరల్డ్ కప్ ఆర్చరీ ఫైనల్లో రజత పతకం అందుకుంది. అయితే తెలుగు ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర పతకం సాధించడంలో విఫలమయ్యాడు. మూడేళ్ల తర్వాత వరల్డ్ కప్ ఫైనల్ బరిలో దిగిన మూడో సీడ్ దీపిక స్వర్ణ పతక మ్యాచ్‌లో 0-6తో లీ జియామన్ (చైనా) చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది. తొమ్మిదో సారి ప్రపంచ కప్‌లో తలపడిన ఆమెకిది ఐదో రజతం. ఇవిగాక దీపిక ఓ కాంస్య పతకమూ నెగ్గింది. పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో విజయవాడ ఆర్చర్, మూడో సీడ్ ధీరజ్ క్వార్టర్ ఫైనల్లో 4-6తో రెండో సీడ్ లీ వూ సోక్ (కొరియా) చేతిలో పరాజయం పాలై పతకం లేకుండానే టోర్నీని ముగించాడు.

సెమీస్‌లో భారత కుర్రాళ్లు

యూఏఈపై గెలుపు

ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్

అల్‌అమెరాత్ (ఒమన్): ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ టీ20 టోర్నీలో జోరు ప్రదర్శిస్తున్న భారత్ 'ఎ' జట్టు వరుసగా రెండో విజయంతో సెమీఫైనల్‌కు దూసుకుపోయింది. గ్రూప్ 'బి'లో సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఏడు వికెట్లతో యూఏఈని చిత్తు చేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న యూఏఈ..పేసర్లు రసిఖ్ (3/15), రమణ్‌దీప్ (2/7) ధాటికి 16.5 ఓవర్లలో 107 పరుగులకే కుప్పకూలింది. రాహుల్ చోప్రా (50) హాఫ్ సెంచరీ తోపాటు కెప్టెన్ బాసిల్ హమీద్ (22) రాణించడంతో యూఏఈకి ఆ మాత్రం స్కోరైనా సాధ్యమైంది. కాంబోజ్, వైభవ్ అరోరా, అభిషేక్ శర్మ, నేహల్ వధేరా తలో వికెట్ తీశారు. అభిషేక్ శర్మ (58), కెప్టెన్ తిలక్ వర్మ (21) చెలరేగడంతో స్వల్ప ఛేదనను భారత్ 'ఎ' 10.5 ఓవర్లలో 111/3 స్కోరుతో ముగించింది. రెండు విజయాలతో నాలుగు పాయింట్లు సాధించిన భారత్ 'ఎ' గ్రూప్‌లో టాపర్‌గా నిలిచింది. బుధవారం జరిగే గ్రూప్ ఆఖరి మ్యాచ్‌లో ఒమన్‌తో తలపడనుంది. కాగా..మరో గ్రూప్ 'బి' మ్యాచ్‌లో పాకిస్థాన్ 'ఎ' 74 పరుగులతో ఒమన్‌పై నెగ్గింది.

సంక్షిప్తస్కోర్లు

యూఏఈ: 16.5 ఓవర్లలో 107 ఆలౌట్ (రాహుల్ చోప్రా 50, బాసిల్ హమీద్ 22, రసిఖ్ సలామ్ 3/15, రమణ్‌దీప్ 2/7); **భారత్:** 10.5 ఓవర్లలో 111/3 (అభిషేక్ శర్మ 58, తిలక్ వర్మ 21, బదోనీ 12 నాటౌట్, విష్ణు సుకుమారన్ 1/10).





సిరాజ్.. క్యా హువా?

13 టెస్టుల్లో 19 వికెట్లు

నిరాశపరిచిన పేసర్

రెండో టెస్టుకు చోటు కష్టమే

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో భారత్ ఓటమితో జట్టు కూర్పుపై కూడా చర్చ జరుగుతోంది. ప్రత్యర్థి ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగి రోహిత్ సేనను దెబ్బ తీస్తే.. ఆతిథ్య భారత్ మాత్రం ఇద్దరు పేసర్లతోనే ఆడింది. ఇందులో బుమ్రా మాత్రమే ఆకట్టుకోగలిగాడు. మరో పేసర్ మహ్మద్ సిరాజ్ అంచనాలను అందుకోలేక విమర్శలు ఎదుర్కొంటున్నాడు. ఈ మ్యాచ్‌లో అతను రెండు వికెట్లు మాత్రమే తీశాడు. కనీసం అతడి స్థానంలో ఫామ్‌లో ఉన్న ఆకాశ్‌దీప్‌ను ఆడించినా ఫలితం ఉండేదని విశ్లేషకులు కామెంట్స్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో గురువారం నుంచి జరిగే పుణె టెస్టులో సిరాజ్‌ను తప్పించాలన్న డిమాండ్ కూడా వినిపిస్తోంది. వాస్తవానికి విదేశాల్లో రాణిస్తున్నా.. భారత గడ్డపై జరిగిన టెస్టులో సిరాజ్ ప్రదర్శన సంతృప్తికరంగా లేదు. ఇక్కడ తను 13 టెస్టులు ఆడితే.. తీసింది 19 వికెట్లు మాత్రమే. ఇందులో నాలుగు టెస్టుల్లోనైతే ఒక్క వికెట్ కూడా రాలేదు. ఇక చివరి ఏడు టెస్టుల్లో 12 వికెట్లే తీశాడు. కనీసం టెస్టుకు రెండు వికెట్లు కూడా పడగొట్టలేకపోయాడు. అంతేకాకుండా బుమ్రాతో సమానంగా కొత్త బంతితో ఎలాంటి ప్రభావమూ చూపలేకపోతున్నాడు. అంటే ఉపఖండంలో అతడి తడబాటు ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. అయితే సిరాజ్ తన లైన్ అండ్ లెంగ్త్‌ను సరిచేసుకుంటే ప్రభావం చూపగలడని ఓ కోచ్ తెలిపాడు. విదేశీ పిచ్‌లపై అతడి బౌలింగ్ సరిగ్గా సరిపోతుందని, అందుకే బౌన్సీ పిచ్‌లుండే ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాల్లో ఐదేసి వికెట్లతో రాణించినట్టు గుర్తుచేశాడు. బౌన్స్ తక్కువగా ఉండే భారత పిచ్‌లపై అందుకే వెనుకబడుతున్నట్టు తెలిపాడు. ఇదిలావుండగా జట్టులో ప్రధాన పేసర్‌గా ఉన్నప్పుడు కొత్త బంతితో వికెట్లను ఆశిస్తారని, అలాగే రెండో కొత్త బంతితోనూ రాణించాలని కోరుకుంటారని మాజీ కీపర్ సబా కరీం అన్నాడు. ఈ విషయంలో ఆకాశ్ దీప్ మెరుగ్గా కనిపిస్తున్నాడని, చాలా ఏళ్లుగా భారత పిచ్‌లపై అతడు ఆడుతున్న విషయం మరువరాదని చెప్పాడు. ఆర్‌సీబీ మాజీ కోచ్ మైక్ హెస్సెన్ కూడా రెండో టెస్టుకు సిరాజ్ స్థానంలో ఆకాశ్‌ను ఆడించే విషయమై టీమ్ మేనేజ్‌మెంట్ ఆలోచించే అవకాశం ఉందన్నాడు.

పుణె టెస్టుకు స్పిన్ వికెట్!



కివీస్‌తో రెండో టెస్టు కోసం స్పిన్ అనుకూల వికెట్‌ను రూపొందిస్తున్నారు. మ్యాచ్ జరిగే పుణె పిచ్‌ను నల్లమట్టితో తయారు చేయడం వల్ల స్లో బౌలర్లకు సహకరిస్తుంది. తక్కువ బౌన్స్‌తోపాటు బంతి నెమ్మదిగా టర్న్ అయ్యే అవకాశం ఉంది. బెంగళూరు ఓటమితో బెంబేలెత్తిన భారత్.. ఇప్పుడు తీవ్ర ఒత్తిడిలో ఉంది. ఎలాగైనా సిరీస్ సొంతం చేసుకోవాలంటే మిగిలిన రెండు టెస్టులు నెగ్గాలి. ఈ నేపథ్యంలో జట్టు స్పిన్ వికెట్‌తో ఫలితం సాధించాలనే వ్యూహంతో ఉన్నట్టు తెలుస్తోంది. మూడో టెస్టు జరిగే ముంబై వికెట్‌కు కూడా స్పిన్నర్లకు స్వర్గధామం కానుందట. అయితే, వాంఖడే వికెట్ ఎర్రమట్టితో తయారు చేయగా.. పుణె పిచ్‌ను నల్లమట్టితో రూపొందించారు. స్పిన్నర్ల ఆధిపత్యం కొనసాగనున్న నేపథ్యంలో ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను 16వ ఆటగాడిగా బోర్డు ఎంపిక చేసింది. పుణెలో ఇప్పటి వరకు రెండు టెస్టులు జరిగాయి. 2016-17 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో లెఫ్టామ్ స్పిన్నర్ ఓకీఫ్ 12 వికెట్లతో చెలరేగడంతో.. ఆస్ట్రేలియా 333 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. కాగా, 2019లో దక్షిణాఫ్రికాపై టీమిండియా ఇన్నింగ్స్ తేడాతో గెలిచింది. ఆ మ్యాచ్‌లో విరాట్ డబుల్ సెంచరీ చేశాడు. కాగా, ఇప్పుడు మ్యాచ్ జరిగే పిచ్‌పై పచ్చిక కనిపించడం లేదు. తొలి గంట ఆట తర్వాత సీమర్లకు ఏమాత్రం సహకరించే అవకాశం లేకపోయినా.. పొడిగా ఉండడంతో బౌలర్లు రివర్స్ స్వింగ్ రాబట్టే చాన్సులున్నాయి. దీంతో టాస్ గెలిచిన జట్టు తొలుత బ్యాటింగ్ చేయడానికే మొగ్గుచూపవచ్చు.

వినేశ్, బజ్‌రంగ్‌వల్లే..

ఉద్యమ ప్రతిష్ఠ దెబ్బతిన్నది

వారిద్దరూ స్వార్థంగా ఆలోచించారు

బయోగ్రఫీలో సంచలన విషయాలు వెల్లడించిన సాక్షి మాలిక్



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌కు వ్యతిరేకంగా స్టార్ రెజ్లర్లు చేపట్టిన ఆందోళనపై సాక్షి మాలిక్ సంచలన వ్యాఖ్యలు చేసింది. గత ఏడాది జరిగిన ఆసియా క్రీడల ఎంపిక పోటీలనుంచి వినేశ్ ఫొగట్, బజ్‌రంగ్ పూనియా మినహాయింపు పొందడాన్ని ఆమె తప్పుబట్టింది. వారిద్దరి నిర్ణయం వల్ల ఉద్యమ ప్రతిష్ఠ దెబ్బతిన్నదని అభిప్రాయపడింది. వ్యక్తిగత లబ్ధికోసం ఉద్యమం చేశారన్న అప్రతిష్ఠ ఎదుర్కోవాల్సి వచ్చిందని ఆవేదన చెందింది. ఈమేరకు తన ఆటోబయోగ్రఫీ 'విట్‌నెస్'లో సాక్షి మాలిక్ తన అభిప్రాయాలను నిష్కర్షగా వెల్లడించింది. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్నాడంటూ బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా దేశ మేటి రెజ్లర్లు వినేశ్, సాక్షి, బజ్‌రంగ్ పూనియా 2023లో తీవ్ర స్థాయిలో ఉద్యమం చేసిన విషయం తెలిసిందే. రెజ్లర్ల ఉద్యమం తర్వాతే బ్రిజ్‌భూషణ్‌పై కేసు నమోదుకాగా..దానిపై ఢిల్లీ హైకోర్టులో ప్రస్తుతం విచారణ జరుగుతోంది. ఇక ఆ ఆందోళనకు సంబంధించిన పలు విషయాలను తన పుస్తకంలో సాక్షి పంచుకుంది. 'స్వార్థపూరితంగా ఆలోచించే పాత విధానం ఉద్యమంలోకి ప్రవేశించింది. బజ్‌రంగ్, వినేశ్ మనసులలో వారి సన్నిహితులు దురాశను నూరి పోశారు. దాంతో 2023 ఆసియా క్రీడల ఎంపిక పోటీలనుంచి మినహాయింపు పొందే అంశాన్ని వారిద్దరూ లేవనెత్తారు' అని సాక్షి విమర్శించింది. బ్రిజ్‌భూషణ్‌ను తొలగించాక..రెజ్లింగ్ సమాఖ్య వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ఏర్పాటైన అడ్‌హాక్ కమిటీ సెలక్షన్ ట్రయల్స్ నుంచి బజ్‌రంగ్, వినేశ్‌లను మినహాయించింది. అయితే సాక్షి మాత్రం ఆ మినహాయింపు పొందేందుకు నిరాకరించింది. ఇక..ఆసియాడ్‌కు ముందు వినేశ్ గాయపడగా, ఆ క్రీడల్లో పతకం సాధించడంలో బజ్‌రంగ్ విఫలమయ్యాడు.

వేధింపులకు గురయ్యా..

బాల్యంలో తాను లైంగిక వేధింపులకు గురయ్యానని సాక్షి వెల్లడించింది. ట్యూషన్ టీచర్ వేధింపులకు పాల్పడ్డాడని తెలిపింది. 'నా ట్యూషన్ సార్ నన్ను లైంగికంగా వేధించాడు. సమయంకాని సమయంలో పాఠాలు చెప్పించుకొనేందుకు తన ఇంటికి రావాలని ఆదేశించేవాడు. దాంతో ట్యూషన్‌కు వెళ్లాలంటే ఎంతో భయపడేదానిని' అని 32 ఏళ్ల సాక్షి వివరించింది.

బబితది దురాలోచన..

ఉద్యమ సమయంలో.. బబితా ఫొగట్ స్వార్థపూరిత ఆలోచన చేసిందని వినేశ్ ఆరోపించింది. ఉద్యమానికి తాను మద్దతు పలుకుతున్నట్టు ప్రకటించడం వెనుక బ్రిజ్‌భూషణ్ స్థానంలో ఆమె డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ పదవి చేపట్టాలనే దురాలోచన ఉన్నదని తెలిపింది. కాగా తోటి రెజ్లర్ సత్యవర్త్ కడియన్‌తో తన వివాహాన్ని కుటుంబ సభ్యులు వ్యతిరేకించారని సాక్షి వెల్లడించింది. కానీ అతణ్నే పెళ్లిచేసుకోవాలని నిర్ణయాన్ని తీసుకున్నానని చెప్పింది. అలాగే తన అవార్డుల సొమ్ములో ఎక్కువ భాగాన్ని తల్లిదండ్రులు తీసుకున్నారని చెప్పింది.

భారత్ 'ఎ' జట్టులో నితీశ్, రికీ భుయ్

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా పర్యటన కోసం ప్రకటించిన భారత్ 'ఎ' జట్టులో ఇద్దరు ఆంధ్ర క్రికెటర్లకు చోటు దక్కింది. ఇటీవలే అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేసిన నితీశ్ కుమార్‌తో పాటు రికీ భుయ్‌కి కూడా అవకాశం కల్పించారు. సోమవారం 15 మందితో కూడిన ఈ జాబితాను బీసీసీఐ వెల్లడించింది. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్ కోటాలో నితీశ్‌కు చాన్స్ దక్కింది. అలాగే దేశవాళీల్లో రాణించిన ఇషాన్ కిషన్‌ను కూడా ఈసారి పరిగణనలోకి తీసుకున్నారు. ఈనెల 31 నుంచి ఆసీస్ 'ఎ' జట్టుతో యువ భారత్ రెండు ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడనుంది. ఆ తర్వాత బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో తలపడే టీమిండియాతో మూడు రోజుల ఇంట్రా స్క్వాడ్ గేమ్‌లో తలపడుతుంది.

భారత్ 'ఎ' జట్టు: రుతురాజ్ (కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, సాయి సుదర్శన్, నితీశ్ కుమార్, దేవ్‌దత్ పడిక్కళ్, రికీ భుయ్, బాబా ఇంద్రజిత్, ఇషాన్ కిషన్, అభిషేక్ పోరెల్, ముకేశ్ కుమార్, ఖలీల్, యష్ దయాల్, నవ్‌దీప్ సైనీ, మనవ్, తనుష్ కోటియన్.

యూపీ యోధాస్ బోణీ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): యూపీ యోధాస్ జట్టు ప్రొ కబడ్డీ లీగ్ సీజన్‌ను విజయంతో ఆరంభించింది. సోమవారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో యోధాస్ 28-23 స్కోరుతో దబాంగ్ ఢిల్లీపై గెలిచింది. ఇరు జట్ల డిఫెండర్లు అద్భుతంగా ఆడడంతో పాయింట్లు సాధించడానికి రైడర్లు చెమటోడ్చారు. యూపీ రైడర్లు భవానీ రాజ్‌పుత్ (7 పాయింట్లు), సురేందర్ గిల్ (4) గెలుపులో ముఖ్యభూమిక పోషించారు. ఢిల్లీ కెప్టెన్, స్టార్ రైడర్ అషు మాలిక్ 15 రైడ్లలో నాలుగే పాయింట్లు సాధించడం ఆ జట్టు అవకాశాలను సన్నగిల్లేలా చేసింది. ఢిల్లీ రైడర్లు అషు, నవీన్, మోహిత్, ఆశీష్‌ను యూపీ డిఫెండర్లు అద్భుతంగా ట్యాకిల్ చేయడంతో ఆ జట్టు ఆలౌటైంది. ఇదే సమయంలో యూపీ రైడర్లు భవానీ, నితిన్ వరుస పాయింట్లు తేవడంతో ఆ జట్టును విజయం వరించింది. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 40-25 స్కోరు తేడాతో పట్నా పైరేట్స్‌ను ఓడించింది.

బిజినెస్

మరో పదేళ్ల పాటు 'ఉడాన్' పథకం

న్యూఢిల్లీ: ప్రాంతీయ విమానాశ్రయాలను అనుసంధానం చేసే 'ఉడాన్' పథకాన్ని మరో పదేళ్ల పాటు పొడిగిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ విషయం ప్రకటించారు. ప్రాంతీయ విమానయాన అనుసంధానం కోసం కేంద్ర ప్రభుత్వం 2016 అక్టోబరు 21న ఈ పథకాన్ని ప్రారంభించింది. దీంతో అనేక ప్రాంతీయ విమానయాన సంస్థలు ప్రారంభమై అనేక మందికి ఉద్యోగావకాశాలు ఏర్పడడంతో పాటు దేశంలో పర్యాటక రంగ అభివృద్ధికి తోడ్పడిందని రామ్మోహన్ తెలిపారు. ఈ పథకం పుణ్యమాని 601 విమాన మార్గాలు, 71 విమానాశ్రయాలు అందుబాటులోకి వచ్చాయి.

దేశంలోనే విమానాల డిజైనింగ్

దేశీయంగా విమానాల రూపకల్పన (డిజైన్), ఉత్పత్తి చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి రామ్మోహన్ తెలిపారు. ఈ ఏడాది ఆగస్టులో పార్లమెంట్ ఆమోదించిన 'భారతీయ వాయుయాన్ విధేయక్ బిల్లు- 2024 ఇందుకు దోహదం చేస్తుందన్నారు. ఇందుకోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), నేషనల్ ఏరోనాటిక్స్ లేబొరేటరీస్ లిమిటెడ్ (ఎన్ఏఎల్) వంటి సంస్థల సహకారం తీసుకుంటామని చెప్పారు.

బంగారం, వెండి

ఆల్‌టైం రికార్డు



సిల్వర్ ఒక్కరోజే రూ.5,000 అప్

కిలో ధర రూ.99,500కు చేరిక

రూ.80,000 దాటిన పసిడి రేటు

న్యూఢిల్లీ: దేశీయంగా బులియన్ ధరలు సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయికి ఎగబాకాయి. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ డేటా ప్రకారం.. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర సోమవారం రూ.750 పెరిగి రూ.80,650కి చేరింది. 10 గ్రాముల పసిడి రూ.80,000 స్థాయిని దాటడం ఇదే తొలిసారి. వెండి ధర ఏకంగా రూ.5,000 ఎగబాకి రూ.99,500కు చేరుకుంది. వెండి ధర పెరగడం వరుసగా ఇది నాలుగో రోజు. మరోవైపు హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర పది గ్రాములకు రూ.220 పెరుగుదలతో రూ.79,640కి, 22 క్యారెట్ల రేటు రూ.200 పెరిగి రూ.73,000 చేరకున్నాయి. కిలో వెండి రూ.2000 ఎగబాకి రూ.1,09,000 ధర పలికింది.

సిల్వర్‌కు చైనా బూస్ట్

అంతర్జాతీయ మార్కెట్లోనూ ఈ విలువైన లోహాల ధరలు సరికొత్త జీవితకా గరిష్ఠాలకు ఎగబాకాయి. ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ఒక దశలో దాదాపు 26 డాలర్ల పెరుగుదలతో 2,755 డాలర్లకు చేరుకోగా.. వెండి ఒక శాతం పెరిగి 12 ఏళ్ల గరిష్ఠ స్థాయి 34.49 డాలర్లకు పుంజుకుంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో పాటు పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా (పీబీఓసీ) ప్రామాణిక వడ్డీ రేట్లను తగ్గించడం ప్రస్తుత ర్యాలీకి కారణమని బులియన్ విశ్లేషకులు పేర్కొన్నారు. ముఖ్యంగా పీబీఓసీ వడ్డీ రేటు తగ్గించడం చైనాలో పారిశ్రామిక రంగానికి ఊతమివ్వనుందని, తద్వారా పారిశ్రామిక అవసరాలకు వెండి వినియోగం మరింత పెరగవచ్చన్న అంచనాలతో ఈ లోహం ధర అమాంతం దూసుకుపోయింది.

బులియన్ రేట్లు మరింత పైపైకే

నవంబరులో అమెరికన్ సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలు, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు బులియన్ ధరలను కొత్త గరిష్ఠాలకు చేర్చే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఔన్స్ గోల్డ్ 2,800 డాలర్లకు చేరుకోవచ్చన్న అంచనాలున్నాయి.

మూడేళ్ల గరిష్ఠానికి ఆర్‌బీఐ బంగారం కొనుగోళ్లు

ఆర్‌బీఐ తన వద్దనున్న విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలను వివిధీకరించడంతో పాటు అంతర్జాతీయ అనిశ్చితులు, సంక్షోభాల నుంచి నిల్వలకు రక్షణ కల్పించేందుకు బంగారం కొనుగోళ్లను గణనీయంగా పెంచింది. ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) తాజా నివేదిక ప్రకారం.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఆర్‌బీఐ 54.7 టన్నుల బంగారం కొనుగోలు చేసింది. గడిచిన మూడేళ్లలో ఇదే గరిష్ఠ స్థాయి కొనుగోళ్లు. దాంతో ఈ ఏడాదిలో ఆర్‌బీఐ వద్దనున్న బంగారం నిల్వలు 7 శాతం పెరిగి మొత్తం 858.3 టన్నులకు చేరుకున్నాయి. ఈ ఏడాది అత్యధికంగా బంగారం కొనుగోళ్లు జరిపిన ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంక్‌ల్లో ఆర్‌బీఐ ఒకటని డబ్ల్యూజీసీ నివేదిక పేర్కొంది.

యూనియన్ బ్యాంక్ లాభం రూ.4,720 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ).. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను బ్యాంక్ నికర లాభం 34 శాతం వృద్ధి చెంది రూ.4,720 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నికర లాభం రూ.3,511 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం కూడా రూ.28,282 కోట్ల నుంచి రూ.32,036 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో బ్యాంక్ వడ్డీ ఆదాయం కూడా రూ.24,587 కోట్ల నుంచి రూ.26,708 కోట్లకు వృద్ధి చెందింది. అయితే నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) మాత్రం 0.87 శాతం క్షీణించి రూ.9,047 కోట్లుగా నమోదైంది. మరోవైపు నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) కూడా 3.18 శాతం నుంచి 2.9 శాతానికి తగ్గింది. కాగా స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 6.38 శాతం నుంచి 4.36 శాతానికి, నికర ఎన్‌పీఏ 1.30 శాతం నుంచి 0.98 శాతానికి తగ్గాయి. సెప్టెంబరు ముగిసే నాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.21,70,779 కోట్లుగా ఉంది.

సైయెంట్ డీఎల్ఎం లాభంలో 5 శాతం వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ సర్వీసెస్ సంస్థ సైయెంట్ డీఎల్ఎం.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.15.4 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.14.6 కోట్లు)తో పోల్చితే లాభం 5.5 శాతం పెరిగింది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ రెవెన్యూ కూడా 33.4 శాతం వృద్ధి చెంది రూ.291.80 కోట్ల నుంచి రూ.389.40 కోట్లకు చేరుకుంది. సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ కొత్తగా ఇద్దరు క్లయింట్లను చేర్చుకుంది. ఇందులో ఒకటి మిస్సైల్ సిస్టమ్స్‌లో కీలకంగా ఉన్న ప్రభుత్వ రంగ రక్షణ సంస్థ. మరొకటి అంతర్జాతీయ ఆయిల్ ఫీల్డ్ సర్వీసెస్ కంపెనీ.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,640 ▲	73,000 ▲	1,09,000 ▲
ముంబై	78,214 ▲	71,644 ▲	97,254 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

22న తేదీ

హైదరాబాద్	505	విజయవాడ	530
వరంగల్	507	గోదావరి	525
చిత్తూరు	558	విశాఖపట్నం	530
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	125	విజయవాడ	135
వరంగల్	125	గుంటూరు	133
కరీంనగర్	125	ఒంగోలు	133
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	120
కర్నూలు	125	నెల్లూరు	120
విశాఖపట్నం	120	అనంతపురం	120
గోదావరి	135		

ఏఐ వినియోగంలో జర జాగ్రత్త

- ఆదమరిస్తే ఇక అంతే
- ఇది రెండు వైపులా పదునున్న కత్తి
- భారతి గ్రూప్ చైర్మన్ సునీల్ మిట్టల్



న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) వంటి టెక్నాలజీల వినియోగం విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని భారతీ గ్రూప్ చైర్మన్ సునీల్ భారతి మిట్టల్ కోరారు. అనేక సవాళ్లతో కూడిన ఈ టెక్నాలజీల విషయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉండొద్దని హెచ్చరించారు. ఎన్‌డీటీవీ వరల్డ్ సమ్మిట్‌లో ప్రసంగిస్తూ ఆయన ఈ హెచ్చరిక చేశారు. ఈ సందర్భంగా సైబర్ నేరగాళ్లు ఏఐ సాయంతో అచ్చం తన కంఠస్వరాన్ని అనుకరిస్తూ దుబాయ్‌లోని తన కంపెనీ ఉన్నతాధికారి ద్వారా పెద్దమొత్తంలో నిధులు బదిలీ చేయించుకునేందుకు ఎలా ప్రయత్నించిందీ మిట్టల్ వివరించారు. తాను ఎప్పుడూ పెద్ద మొత్తంలో నిధుల బదిలీ అడగననే విషయం తెలిసిన ఆ అధికారి అప్రమత్తతతో ఆ ప్రమాదం తప్పిందన్నారు. ఆ సైబర్ కేటుగాడు పంపిన తన వాయిస్ మెసేజీ విని తానే ఆశ్చర్యపోయినట్టు తెలిపారు. అందుబాటులోకి వస్తున్న అధునాతన టెక్నాలజీల కారణంగా ముందు ముందు డిజిటల్ సంతకాలకూ ప్రమాదం తప్పకపోవచ్చని మిట్టల్ తెలిపారు.

ఉపగ్రహ కమ్యూనికేషన్ వ్యవస్థను ఆయన మ్యాజిక్ బుల్లెట్‌గా అభివర్ణించారు. ఈ ఉపగ్రహ సాంకేతిక పరిజ్ఞానం సాయంతో మారుమూల ప్రాంతాలకూ మొబైల్, ఇంటర్నెట్ సదుపాయాలు కల్పించడం సాధ్యపడుతుందన్నారు.

డేటాలీక్‌తో తస్మాత్ జాగ్రత

రెండు బీమా కంపెనీలకు ఐఆర్‌డీఏఐ హెచ్చరిక

న్యూఢిల్లీ: పాలసీదారుల ప్రయోజనాలకు రక్షణ కల్పించడం కోసం ఐటీ వ్యవస్థల ఆడిటింగ్ చేపట్టాలని డేటాలీక్ జరిగినట్టు భావిస్తున్న రెండు బీమా కంపెనీలను భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) ఆదేశించింది. ఐటీ వ్యవస్థల్లో లోపాలను కనుగొనేందుకు ఆయా కంపెనీల యాజమాన్యాలతో సంప్రదింపులు జరుపుతోంది. అయితే ఆ బీమా కంపెనీలేవి అన్న విషయం ఐఆర్‌డీఏఐ ప్రకటించలేదు. డేటాలీక్ అనేది తీవ్రమైన అంశమని, పాలసీదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కంపెనీలతో నిరంతర సంప్రదింపులు నిర్వహించనున్నట్టు తెలిపింది. ఇటీవలే తమ పాలసీదారుల డేటా లీక్ అయినట్టు స్టార్‌హెల్త్ ఇన్సూరెన్స్ అంగీకరించింది. రెండు కంపెనీలు తమ ఐటీ వ్యవస్థలను ఆడిట్ చేసేందుకు స్వతంత్ర ఆడిటర్లను నియమించుకోవాలని ఆదేశించినట్టు ఐఆర్‌డీఏఐ తెలిపింది.

కోటక్ షేరు కుంగదీసెన్..

- సెన్సెక్స్ 73 పాయింట్లు డౌన్


ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు ఆరంభ లాభాలను నిలుపుకోలేకపోయాయి. సోమవారం ప్రారంభ ట్రేడింగ్‌లో 545 పాయింట్ల వరకు పుంజుకున్న సెన్సెక్స్.. తొలి గంటలోనే నష్టాల్లోకి మళ్లింది. ఒక దశలో 81,000 స్థాయిని కూడా కోల్పోయిన సూచీ మళ్లీ తేరుకుని, చివరికి 73.48 పాయింట్ల నష్టంతో 81,151.27 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 72.95 పాయింట్లు నష్టపోయి 24,781.10 వద్ద ముగిసింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లలో భారీగా అమ్మకాలతోపాటు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోవడం మార్కెట్‌ను కుంగదీసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 21 నష్టపోగా.. నిరాశాజనక త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన కోటక్ బ్యాంక్ షేరు ఏకంగా 4.29 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బీఎస్ఈలోని మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలైతే 1.63 శాతం వరకు నష్టపోయాయి.

అఫ్కాన్స్ ఐపీఓ ధరల శ్రేణి రూ.440-463

షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌నకు చెందిన అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఐపీఓ ధరల శ్రేణిని రూ.440-463గా నిర్ణయించింది. కంపెనీ పబ్లిక్ ఆఫరింగ్ ఈ నెల 25న ప్రారంభమై 29న ముగియనుంది. ఐపీఓ ద్వారా కంపెనీ మొత్తం రూ.5,430 కోట్లు సమీకరించాలని భావిస్తోంది.

ఆర్థిక అక్షరాస్యత పెరగాలి

- యాంఫీ సీఈఓ వెంకట నాగేశ్వర్ చలసాని
- ఎంఎఫ్‌ల్లో పెట్టుబడులు పెడితే ఏటా 15% కంటే ఎక్కువ వడ్డీ



విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): భారత్‌లో అక్షరాస్యత 80 శాతం వరకు ఉన్నా ఆర్థిక అక్షరాస్యత మాత్రం 22 శాతానికి మించి లేదని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఆఫ్ ఇండియా (యాంఫీ) సీఈఓ వెంకట నాగేశ్వర్ చలసాని అన్నారు. సోమవారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. మంచి ఆదాయం వచ్చే వాటిలో పెట్టుబడులు పెట్టడంలో ప్రజలు ఇంకా వెనుకబడి ఉన్నారన్నారు. స్థూల ఆదాయపరంగా చూసుకుంటే దేశంలో పదో స్థానంలో ఉన్న విశాఖపట్నం ఈ పెట్టుబడుల పరంగా చూస్తే వెనుకబడి ఉందన్నారు. ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.67.09 లక్షల కోట్లుగా ఉన్నాయని, వాటిలో 67 శాతం చిన్న మదుపరులు పెట్టినవేనన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తీసుకుంటే ఎంఎఫ్‌ల్లో రూ.89,000 కోట్ల పెట్టుబడులు ఉన్నాయని, వాటిలో విశాఖ నుంచి రూ.11,500 కోట్లు వచ్చాయన్నారు. ఇన్వెస్టర్లు అత్యధికంగా రియల్ ఎస్టేట్ రంగంలో 44 శాతం, బంగారంపై 22 శాతం పెట్టుబడి పెడుతున్నారన్నారు. ఎంఎఫ్‌ల్లో పెట్టుబడి పెడితే ఏటా 15 శాతం కంటే ఎక్కువే వడ్డీ వస్తుందని, ఇది బ్యాంక్ ఎఫ్‌డీలపై వచ్చే దానికంటే రెట్టింపు ఉంటుందన్నారు. దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టేవారికి ఇవి మంచి ఆదాయం సమకూరుస్తున్నాయన్నారు. ఆర్థిక అక్షరాస్యత పెంచాలని యాంఫీ మూడు రాష్ట్రాలను దత్తత తీసుకుందని, అందులో ఆంధ్రప్రదేశ్ ఒకటని, అందుకే ఇక్కడ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఏపీలో విజయవాడ, తిరుపతి నగరాల కంటే విశాఖపట్నం ముందుందని చలసాని పేర్కొన్నారు.



ఎమర్జెన్సీ మెడిసిన్



అత్యవసర వైద్యం అందవలసిన సమయాల్లో, ఎమర్జెన్సీ మెడిసిన్‌ను ఆశ్రయించక తప్పదు. అయితే అంతకంటే ముందు ఆస్పత్రికి చేరేలోగా, తక్షణ చికిత్సనెలా అందించాలో తెలుసుకోవాలి. అప్పుడే పరిస్థితి మరింత దిగజారకుండా కాపాడుకోగలుగుతాం!

అత్యవసర చికిత్స అవసరం ఏ మేరకు?

ఎవరైనా అకస్మాత్తుగా కుప్పకూలిపోతే మొదట కంగారు పడిపోతాం! బెంబేలెత్తిపోతాం! అయోమయంలో పడిపోతాం! తర్వాత హడాహుడిగా ఆస్పత్రికి పరుగులు తీస్తాం! సాధారణంగా ఎవరైనా ఇలాగే ప్రవర్తిస్తారు. కానీ ఆస్పత్రికి చేరేలోగా పరిస్థితి విషయమించవచ్చు. దారిలోనే ప్రాణాలూ పోవచ్చు. మరీ ముఖ్యంగా గుండె పోటు, బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైనప్పుడు ఏ కాస్త సమయం కూడా వృథా కాకుండా చూసుకోవాలి. లక్షణాలను బట్టి సమస్య తీవ్రతను గుర్తించి, తక్షణ చికిత్సను అనుసరించాలి. అదే సమయంలో వీలైనంత త్వరగా ఎమర్జెన్సీ మెడిసిన్ సేవలను అందించాలి.

ఎమర్జెన్సీ మెడిసిన్ అంటే?

గుండె పోటు, బ్రెయిన్ స్ట్రోక్, ట్రామా, తీవ్రమైన రక్త స్రావం జరగడం లాంటి ప్రాణాంతక సందర్భాలన్నీ ఎమర్జెన్సీ మెడిసిన్ కోవలోకే వస్తాయి. ఈ సందర్భాల్లో మొదట రోగిని స్టెబిలైజ్ చేసి, ప్రాణాలు పోకుండా కాపాడడాన్నే వైద్యులు లక్ష్యంగా పెట్టుకుంటారు. నిజానికి చాలా సందర్భాల్లో అసలు చికిత్స అంబులెన్స్‌లోనే మొదలవుతూ ఉంటుంది. రోగి ఆస్పత్రికి చేరుకునేలోపే అవసరమైన ఏర్పాట్లన్నీ వైద్యులు సిద్ధం చేసుకుంటారు. లక్షణాలు, సమస్య తీవ్రత ఆధారంగా, ఓ పక్క పరీక్షలతో కారణాన్ని నిర్ధారిస్తూనే, మరోపక్క సంబంధిత అవయవాన్ని కోల్పోకుండా రక్షణ చికిత్సలను మొదలుపెడతారు. ఇంతటి కీలకమైన సమయాల్లో, ఎక్కువ మంది వైద్యులు సమిష్టిగా సమస్యను విశ్లేషించి, తదనుగుణ చికిత్సతో రోగి ఆరోగ్య పరిస్థితిని కుదేలవకుండా కాపాడతారు. ఊపిరి పీల్చుకోలేని పరిస్థితిలో ఆస్పత్రికి చేరుకోబోయే రోగి కోసం వెంటిలేటర్‌ను సిద్ధం చేయడం, బిపి పడిపోయిన రోగి కోసం ఫ్లూయిడ్స్, రక్తపోటును పెంచే మందులు సిద్ధం చేసుకుంటారు.

గుండె పోటు వస్తే?

గుండె పోటును గ్యాస్ట్రిక్ సమస్యగా పొరబడే సందర్భాలు ఎక్కువ. దాంతో అజీర్తిని తొలగించే మందులు లేదా అసిడిటీ మందులు వాడుకుని, వాటితో అసౌకర్యం తగ్గకుండా పెరిగిపోయినప్పుడు మాత్రమే, రోగులను వైద్యుల దగ్గరకు తీసుకొస్తూ ఉంటారు. కానీ అప్పటికే గుండెకు జరగవలసిన నష్టం జరిగిపోతుంది. కాబట్టి గుండె పోటు లక్షణాలను కచ్చితంగా కనిపెట్టడం ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి. గుండె పోటును తగ్గించడం కోసం వెంటనే యాస్పిరిన్ మాత్రను తినిపించవచ్చు. గుండె ఆగిపోయిన సందర్భాల్లో సిపిఆర్ చేయాలనే విషయం కూడా అందరికీ తెలిసిందే! ఆగిపోయిన గుండెను కృత్రిమంగా పని చేయించడమే సిపిఆర్. ఛాతీ మీద నొక్కడం ద్వారా గుండె మీద ఒత్తిడి పెరిగి, పని చేయడం మొదలుపెడుతుంది. అయితే సిపిఆర్ చేసే సమయంలో కొన్ని అంశాలు గుర్తు పెట్టుకోవాలి. కొన్నిసార్లు సిపిఆర్ చేసిన తర్వాత, సదరు వ్యక్తిలో స్పందన గమనించాలి. వాళ్లను పిలిచి, తట్టి మేల్కొనేలా చేయాలి. వాళ్లు స్పందించినా, లేకపోయినా అత్యవసర సేవల విభాగానికి వీలైనంత త్వరగా తీసుకువెళ్లాలి. కొన్ని వాణిజ్య ప్రదేశాల్లో, మాల్స్‌లో ప్రస్తుతం డిఫిబ్రిలేటర్స్ అందుబాటులో ఉంటున్నాయి. సిపిఆర్ కోసం వాటిని కూడా వినియోగించుకోవచ్చు.

బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైతే?

బ్రెయిన్ స్ట్రోక్ వేర్వేరు లక్షణాల రూపంలో బయల్పడుతూ ఉంటుంది. అయితే ప్రధానంగా ఒక లక్షణం స్పష్టంగా కనిపిస్తుంది. నవ్వినప్పుడు ముఖంలో సగ భాగంలో ఎలాంటి మార్పూ లేకపోవడం, లేదా ఒక చేయి బాగా పని చేస్తున్నా, మరో చేయి సరిగా పని చేయకపోవడం, కాళ్లలో కూడా ఇదే లక్షణం కనిపించడం బ్రెయిన్ స్ట్రోక్‌లో సర్వసాధారణం. ఇలా సగభాగం శరీరంలో బలహీనత కనిపించడం (పక్షవాతం), వస్తువులను పట్టుకోలేకపోవడం, నడక తడబడడం మొదలైన లక్షణాలను గమనించాలి. ఇంకొన్ని బ్రెయిన్ స్ట్రోక్స్‌లో మగతగా ఉండడం, నిలబడలేకపోవడం, నడిచినప్పుడు ఒక పక్కకు పడిపోవడం, ఒకటి లేదా రెండు కళ్లలో కంటి చూపు కోల్పోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటప్పుడు ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరం. మెదడులోని రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం మూలంగా తలెత్తే ఈ సమస్యకు సత్వర చికిత్స అవసరమవుతుంది. వీలైనంత త్వరగా మందులతో లేదా సర్జరీతో రక్తపు గడ్డను కరిగించడం లేదా తొలగించడం చేయగలిగితే మెదడుకు జరిగే నష్టం తగ్గుతుంది. లక్షణాలు కూడా మెరుగుపడతాయి. ఆలస్యమయ్యేకొద్దీ తిరిగి సరిదిద్దలేని దుస్థితికి పరిస్థితి దిగజారుతుంది. కాబట్టి ఇలాంటి లక్షణాలు కనిపించినప్పుడు తక్షణమే స్పందించాలి.

అవయవం కోల్పోతే?

రోడ్డు ప్రమాదాల్లో అవయవాలు కోల్పోయినప్పుడు, లేదా వంటింట్లో ప్రమాదవశాత్తూ వేలు పూర్తిగా తెగిపోయినప్పుడు కూడా వేగంగా స్పందించాలి. అలాంటి సమయాల్లో రక్తస్రావం మూలంగా ప్రాణాలకు ప్రమాదం వాటిల్లే అవకాశాలు ఎక్కువ. కాబట్టి వెంటనే తెగిపోయిన ప్రదేశానికి పైన తాడు, బెల్టు లేదా చున్నీతో గట్టిగా కట్టేసి, రక్తస్రావాన్ని ఆపేయాలి. తెగిన అవయవాన్ని పైకి లేపి ఉంచాలి. అలాగే తెగి పడిన అవయవాన్ని శుభ్రమైన ప్లాస్టిక్ సంచిలో ఉంచి, మరో సంచిలో చల్లని నీళ్లను నింపి, దాన్లో అవయవం ఉంచిన సంచిని వేసి, రోగితో పాటు ఆస్పత్రికి తీసుకువెళ్లాలి.

ఎమర్జెన్సీ వైద్య విధానం ఇదే!

గుండెపోటుతో ఎమర్జెన్సీకి చేరుకున్న రోగి విషయంలో, గుండె రక్తనాళంలో ఏర్పడిన రక్తపు గడ్డను తొలగించడమే ప్రధాన లక్ష్యంగా వైద్యులు నడుచుకుంటారు. సిటి స్కాన్, ఎమ్మారై చేస్తూనే, రక్తపు గడ్డను కరిగించే మందులు ఇస్తారు. తీవ్రతను బట్టి స్టెంట్ వేయడం కోసం క్యాథ్ ల్యాబ్‌కు తీసుకువెళ్తారు. ఈ పనులన్నిట్లో వైద్యుల బృందం ప్రమేయం ఉంటుంది. ఈ బృందంలో ఎమర్జెన్సీ వైద్యులతో పాటు, రేడియాలజిస్టులు, న్యూరాలజిస్టులు కలిసి రోగిని స్టెబిలైజ్ చేస్తారు. బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన వ్యక్తికి నాలుగున్నర గంటల్లోపు మెదడులోని రక్తపు గడ్డను కరిగించే మందులు ఇవ్వాలి. ఈ మందులతో గడ్డ కరిగిపోతుంది. ఆ కీలక సమయం దాటితే పరిస్థితి ప్రమాదకరంగా పరిణమిస్తుంది. కాబట్టి ఈ సమస్యతో ఎవరైనా ఎమర్జెన్సీకి చేరుకుంటే, వెంటనే ఆస్పత్రిలో 'స్ట్రోక్ కోడ్'ను ప్రకటిస్తారు. దాంతో ఆస్పత్రిలోని సిబ్బంది మొత్తానికీ బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన వ్యక్తి ఆస్పత్రికి చేరుకున్న విషయం తెలిసిపోతుంది. దాంతో ఎమ్మారై కోసం, రేడియాలజిస్ట్ సిద్ధంగా ఉంటాడు. ఎమ్మారై చేస్తూనే రక్తపు గడ్డను గుర్తించి, వెంటనే చికిత్స మొదలుపెడతారు. ఇక అవయవాలు తెగిపోయిన సందర్భాల్లో ఆర్థోపెడిక్, ప్లాస్టిక్ సర్జన్ల బృందం పరిస్థితిని విశ్లేషిస్తుంది. తెగిపోయిన అవయవాన్ని తిరిగి అతికించే అవకాశాలను కూడా పరీక్షిస్తుంది. ఇలా అన్ని సందర్భాల్లో సాధ్యపడకపోవచ్చు. వయసు, గాయం రకం, తీవ్రత.. ఇలా ఎన్నో అంశాలను వైద్యులు పరిగణలోకి తీసుకుంటారు. అలా సాధ్యాసాధ్యాలను విశ్లేషించుకున్న వైద్యులు, అంతిమ నిర్ణయం తీసుకుంటారు.

డాక్టర్ ఇమ్రాన్ షరీఫ్
క్లినికల్ హెడ్, ఎమర్జెన్సీ మెడిసిన్,
స్టార్ హాస్పిటల్స్,
బంజారాహిల్స్ హైదరాబాద్.



ఘోస్ట్ పూప్

కాలకృత్యాల్లో ఇలా...

టాయిలెట్‌కు వెళ్లినప్పుడు సుఖ విరోచనం మీదే దృష్టి పెడతాం! కానీ మన జీర్ణవ్యవస్థ పనితీరు ఎంత భేషుగ్గా ఉందో తెలుసుకోవాలంటే, కమోడ్ మీద కూడా దృష్టి పెట్టాలి.

టాయిలెట్‌కు వెళ్లిన తర్వాత ఫ్లష్ ఆన్ చేస్తాం. ఆ నీళ్లతో టాయిలెట్ పూర్తిగా శుభ్రపడాలి. అంటే, అశుద్ధం ఆనవాళ్లేవీ దాన్లో కనిపించకూడదు. అలా కాకుండా అశుద్ధం టాయిలెట్ గోడలకు అంటుకుని ఉండిపోతున్నా, నీళ్లతో వదిలించడం కష్టంగా ఉన్నా, మన జీర్ణ వ్యవస్థ అవసరమైనంత సమర్థంగా పని చేయడం లేదని అర్థం చేసుకోవాలి అంటున్నారు గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు. ఇలా వదలని అశుద్ధాన్ని సులువుగా సంబోధించడం కోసం, వైద్యులు, ఘోస్ట్ పూప్ లేదా, ఫాంటమ్ పూప్ అనే పేర్లు కూడా పెట్టుకున్నారు. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉన్నప్పుడు, మనం తినే ఆహారంలోని ప్రతిదీ పూర్తిగా జీర్ణమౌతుంది. దాంతో అశుద్ధంలో ఎలాంటి వాయువులూ, కొవ్వులూ చేరుకోవు. దాంతో టాయిలెట్‌కు వెళ్లినప్పుడు, అశుద్ధం ఎటువంటి ఆనవాళ్లూ లేకుండా తేలికగా నీళ్లతో కొట్టుకుపోతుంది. పరిపూర్ణమైన జీర్ణవ్యవస్థకు ఇదే సూచన. ఇందుకు విరుద్ధమైన లక్షణాలు టాయిలెట్‌లో కనిపిస్తే, మన జీర్ణ వ్యవస్థ ఆరోగ్యాన్ని అనుమానించాలి. సమస్యను సరిదిద్దుకోవడం కోసం వైద్యుల సూచన మేరకు ఆహారపుటలవాట్లను సరిదిద్దుకుని, జీర్ణ వ్యవస్థను మెరుగు పరుచుకోవాలి.



గుడ్ ఫుడ్


బి12 లోపిస్తే?

శాకాహారులు ఎదుర్కొనే ప్రధాన సమస్య బి12 లోపం. కొన్ని స్పష్టమైన లక్షణాల రూపంలో ఈ లోపం బయటపడుతూ ఉంటుంది. వాటిని గమనిస్తూ, వైద్యుల సూచన మేరకు బి12ను భర్తీ చేస్తూ ఉండాలి.

నాడుల ఆరోగ్యం, ఎర్ర రక్తకణాల ఉత్పత్తి, మెదడు పనితీరులకు బి12 అవసరం. ఈ విటమిన్ లోపిస్తే, పలు రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. భిన్నమైన లక్షణాలు, మూల కారణాన్ని కచ్చితంగా కనిపెట్టే వీలు లేకుండా, అయోమయానికి గురి చేస్తాయి. కాబట్టి బి12 లోపంతో తలెత్తే లక్షణాల మీద అవగాహన ఏర్పరుచుకోవడం అవసరం.

చేతుల్లో, పాదాల్లో చిత్రమైన సమస్య

విటమిన్ బి12 లోపం ప్రారంభంలో చేతుల్లో, పాదాల్లో సూదులతో పొడుస్తున్నట్టు అనిపిస్తుంది. ఈ చిత్రమైన లక్షణానికి కారణం బి12 లోపం మూలంగా, నాడీ కణాలు సమర్థంగా పని చేయకపోవడమే! ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే, నాడులకు మరింత నష్టం జరిగే ప్రమాదం ఉంటుంది. కాబట్టి చేతుల్లో, పాదాల్లో సూదులతో గుచ్చుతున్నట్టు అనిపిస్తే, వెంటనే వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి.



గుండె దడ దడ

విటమిన్ బి12 తగ్గితే, రక్తంలో ఆక్సిజన్ మోతాదు కూడా తగ్గుతుంది. దాంతో రక్తాన్ని సరఫరా చేయడం కోసం గుండె అవసరానికి మించి కష్టపడవలసి వస్తుంది. దాంతో గుండె దడ పెరుగుతుంది. అకస్మాత్తుగా గుండె వేగంగా కొట్టుకోవడం మొదలుపెట్టినా, గుండె వేగంలో హెచ్చుతగ్గులు ఏర్పడుతున్నా బి12 లోపంగా భావించాలి.

పాలిపోయిన చర్మం

నవనవలాడే చర్మం ఆరోగ్య లక్షణం. కానీ బి12 లోపంతో బాధపడే వ్యక్తుల చర్మం పాలిపోయి, జీవం కోల్పోతుంది. ఇందుకు కారణం ఎర్ర రక్తకణాల ఉత్పత్తి తగ్గడమే! రక్తకణాల ఉత్పత్తికి బి12 దోహదపడుతుంది. ఈ విటమిన్ లోపిస్తే, రక్తలేమి తలెత్తి, చర్మం పాలిపోతుంది. ఈ విటమిన్ లోపంతో ఎర్ర రక్త కణాలు ఛిద్రమైపోతూ ఉంటాయి. దాంతో చర్మం లేత పసుపు రంగులోకి మారుతుంది. ఇలా చర్మం అకారణంగా రంగు మారితే, విటమిన్ బి12 లోపంగా గ్రహించాలి.

నోట్లో పుండ్లు

విటమిన్ బి12 ఆరోగ్యకరమైన కణ నిర్మాణానికి సహాయపడుతుంది. ఈ విటమిన్ లోపం వల్ల, నోట్లో తరచూ పుండ్లు ఏర్పడుతూ, తగ్గడానికి ఎక్కువ సమయం పడుతూ పడుతూ ఉంటుంది. అలాగే పుండ్లు తరచూ తిరగబెడుతూ ఉంటాయి. ఇలా పెదవులు, బుగ్గల లోపల పుండ్లు తలెత్తుతూ ఉంటే, విటమిన్ బి12 లోపంగానే పరిగణించాలి.

ఇబ్బంది పెట్టే చలి

రక్తంలో ఆక్సిజన్ మోతాదు తగ్గడం వల్ల చర్మంలోని రక్తనాళాలకు సరిపడా ఆక్సిజన్ అందక చలి పెరుగుతుంది. ఇతరులకు సౌకర్యంగా ఉన్న తాపమానం, మనల్ని అసౌకర్యానికి గురి చేస్తోందంటే విటమిన్ బి12 లోపంగా భావించాలి. చల్లదనాన్ని తట్టుకోలేకపోవడం, తక్కువ తాపమానాలను ఏమాత్రం తట్టుకోలేకపోవడం బి12 లోపంలో కనిపించే ప్రధాన లక్షణం.

గట్ హెల్త్

కడుపు ఉబ్బరం.. ఉఫ్

భారతీయులకు పిండిపదార్థాల పట్ల మక్కువ ఎక్కువ. పప్పుదినుసులు, పిండ్లు, బియ్యం... మన ప్రధాన ఆహారం. కాబట్టే కడుపు ఉబ్బరం అత్యంత సాధారణమైన ఆరోగ్య సమస్యగా మారిపోయింది. అయితే ఈ సమస్యను పరిష్కరించుకునే మార్గాలు కూడా ఉన్నాయి.

పప్పుదినుసులు, తృణధాన్యాల్లో పిండిపదార్థాలు ఎక్కువ. వీటిని పేగులు శోషించుకోడానికి ఎక్కువ సమయం పడుతుంది. దాంతో పేగుల్లో బ్యాక్టీరియా ఉత్పత్తై కడుపుబ్బరం, త్రేన్పులు వేధిస్తాయి. పేగుల్లోని మంచి, చెడు బ్యాక్టీరియల్లో హెచ్చుతగ్గులు, సున్నితమైన జీర్ణాశయం, వేగంగా తినడం, ఆహారాన్ని సరిగా నమలకపోవడం వల్ల కూడా పొట్టలో వాయువులు ఉత్పత్తవుతాయి.

ఒత్తిడి కూడా కారణమే!

ఒత్తిడి అజీర్తిని పెంచుతుంది. కడుపులోని కండరాలు బిగుతుగా మారతాయి. వ్యాధినిరోధకశక్తి కూడా కుంటుపడుతుంది. పొట్టలో ఆమ్లం ఉత్పత్తి కూడా



పెరుగుతుంది. దాంతో అవసరానికి మించి పిండిపదార్థాల మీద యావ పెరగడం, అవి జీర్ణం కాలేకపోవడం వల్ల కడుపులో వాయువులు ఉత్పత్తవడం మొదలవుతుంది. ఇవన్నీ కడుపుబ్బరానికి దారి తీస్తాయి.

వంటింటి చిట్కాలు

గోరువెచ్చని నీళ్లలో జీలకర్ర, వాము, సోంపు గింజలు నానబెట్టి తాగితే కడుపుబ్బరం తగ్గుతుంది. అలాగే దాల్చినచెక్కలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువ. కాబట్టి దాల్చినచెక్క తీసుకుంటే, ఇన్‌ఫ్లమేషన్, రక్తంలో చక్కెర, ట్రైగ్లిజరైడ్స్ తగ్గుతాయి. వాంతులను తగ్గించి, జీర్ణశక్తిని పెంచే గుణం కూడా దాల్చినచెక్కకు ఉంటుంది. వెల్లుల్లి, తోటకూర విత్తనాలు, అరటిపండు, వంకాయలు ప్రీబయాటిక్స్‌కు కోవకు చెందుతాయి. గ్రీన్‌టీ, యాపిల్స్‌లో ఉండే పాలిఫినాల్స్ పేగుల్లో ప్రొబయాటిక్స్‌ను పెంచి, పేగుల ఆరోగ్యాన్ని కాపాడతాయి. కాబట్టి ప్రొబయాటిక్స్, పాలిఫినాల్స్‌ను తీసుకుంటూ ఉండాలి. నెయ్యి జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. కాబట్టి జీర్ణశక్తిని పెంచుకోడానికి, కల్తీ లేని తాజా నెయ్యి పరిమితంగా తీసుకోవాలి. నూనెలో వేయించే పదార్థాలు పేగుల్లో ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచుతాయి. జీర్ణశక్తిని కుంటుపరుస్తాయి. కడుపుబ్బరాన్ని పెంచుతాయి. కాబట్టి వీటికి దూరంగా ఉండాలి.

వీటికి దూరం

గ్లూటెన్, డైరీ, ప్రాసెస్డ్ ఫుడ్స్‌ను తగ్గిస్తే, కడుపుబ్బరం అదుపులోకొస్తుంది. తరచూ యాంటీబయాటిక్స్ వాడుతూ ఉండడం, సలాడ్స్ తింటూ ఉండడం వల్ల పేగుల్లోని బ్యాక్టీరియాలో హెచ్చుతగ్గులు ఏర్పడతాయి. కాబట్టి వీటికి దూరంగా ఉండాలి.

అడిక్షన్

మందులు వ్యసనంగా మారితే?

నొప్పి తగ్గించే మందులతో తక్షణ ఉపశమనం దొరికే మాట నిజమే! అయితే వాటికి అలవాటు పడే ముప్పు కూడా పొంచి ఉంటుందనే విషయం గుర్తు పెట్టుకోవాలి. దీర్ఘకాలంలో అంతర్గత అవయవాలను సైతం దెబ్బతీసే ప్రమాదం ఉన్న ఈ మందులతో అప్రమత్తంగా వ్యవహరించాలంటున్నారు వైద్యులు.

> కొన్ని నొప్పి నివారణ మందులు కాలేయం, మూత్రపిండాలు మొదలైన అంతర్గత అవయవాల మీద ప్రభావం చూపిస్తాయి. అప్పటికే ఆ అవయవాల్లో సమస్యలున్న వాళ్లకు, పెయిన్ కిల్లర్స్ మరింత చేటు చేస్తాయి. గుండె జబ్బులు, మధుమేహం, అధిక రక్తపోటు లాంటి పైబడే వయసుతో కూడిన ఇతరత్రా ఆరోగ్య సమస్యలుంటే ప్రధాన అంతర్గత అవయవాలు అప్పటికే కొంత మేరకు దెబ్బ తిని ఉంటాయి. కాబట్టి ఈ కోవకు చెందినవాళ్లు ఎన్ఎస్ఐడి పెయిన్ కిల్లర్స్‌ను వాడుకుంటే నష్టం రెండింతలుంటుంది.

తలనొప్పి వేధిస్తే మందుల షాపుకు వెళ్లి పెయిన్ కిల్లర్ కొని వాడుకుంటాం! అంతే తప్ప వెంటనే డాక్టర్ల దగ్గరకు పరుగులు తీయం. అయితే నొప్పిని తగ్గించే ఈ మందుల వాడకంతో రెండు రకాల సమస్యలు పొంచి ఉంటాయి. వీటితో తక్షణ ఉపశమనం దక్కుతుంది కాబట్టి నొప్పికి మూల కారణాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయకపోవడంతో, దాంతో సమస్య మరింత ముదిరిపోయి చికిత్సకు లొంగని పరిస్థితి తలెత్తవచ్చు. అంతే కాకుండా నొప్పి తగ్గడంతో కలిగే ఉపశమనానికి అలవాటు పడిపోయి, నొప్పి నివారణ కోసం అవే మందుల మీద ఆధారపడుతూ, వాటికి వ్యసనపరులుగా మారిపోతూ ఉంటాం. ఇంతకంటే ప్రమాదకరమైన ఇంకొక సమస్య ఏంటంటే, కొన్ని నొప్పి నివారణ మందులు కాలేయం, మూత్రపిండాలు మొదలైన అంతర్గత అవయవాల మీద ప్రభావం చూపిస్తాయి. అప్పటికే ఆ అవయవాల్లో సమస్యలున్న వాళ్లకు, పెయిన్ కిల్లర్స్ మరింత చేటు చేస్తాయి. నిజానికి తలనొప్పి, కాళ్ల నొప్పులు, కడుపు నొప్పి లాంటి సర్వసాధారణమైన నొప్పులు, బాధలను తగ్గించుకోవడం కోసం అడపా దడపా పెయిన్ కిల్లర్స్ వాడితే ఫరవాలేదు. కానీ అన్ని నొప్పులకూ వాటి మీదే ఆధారపడడం ఎంత వరకూ సమంజసమో ఎవరికి వారు ఆలోచించుకోవాలి.

పెయిన్ కిల్లర్స్ ఎప్పుడు?

చికిత్సకు అవకాశం లేకుండా, పూర్తిగా ముదిరిపోయిన కేన్సర్లతో బాధపడే రోగులకు, వాళ్ల జీవన నాణ్యతను పెంచడం కోసం వైద్యులు నొప్పి తగ్గించే మందులు సూచిస్తూ ఉంటారు. ఇంకొందరికి జ్వరంతో పాటు ఒళ్లు నొప్పులు వేధిస్తాయి. ఇంకొందరికి ఆర్థ్రయిటిస్‌తో కీళ్ల నొప్పులు ఇబ్బంది పెడతాయి. మయాల్జియాలో తీవ్రమైన కండరాల నొప్పులు ఉంటాయి. కొందరికి మైగ్రేన్ తలనొప్పులు బాధిస్తూ ఉంటాయి. ఇలాంటి వేర్వేరు సందర్భాల్లో, నొప్పులను అదుపు చేయడం కోసం వైద్యులు తాత్కాలికంగా లేదా దీర్ఘకాలికంగా పెయిన్ కిల్లర్స్‌ను సూచిస్తూ ఉంటారు. అలాగని వేరే సందర్భాల్లో తాత్కాలికంగా నొప్పులను తగ్గించుకోవడం కోసం పెయిన్ కిల్లర్స్ వాడుకోకుండా ఉండవలసిన అవసరం లేదు. నెల మొత్తంలో ఒకట్రెండు సార్లు వాడుకోవడం సురక్షితమే! కానీ ఇష్టారాజ్యంగా వీటిని వాడుకోవడం మాత్రం ఆరోగ్యకరం కాదు.

ఏవి సురక్షితం?

ప్రతి మందుల షాపులో పెయిన్ కిల్లర్స్‌ను ఎటువంటి ప్రిస్క్రిప్షన్‌తో పని లేకుండా కొనుక్కునే వెసులుబాటు ఉంటుంది. అయితే మనం కొనుక్కుంటున్న పెయిన్ కిల్లర్స్ ఏ రకానికి చెందినవో మనకెలా తెలుస్తుంది? ఈ మందుల్లో 'నాన్ స్టిరాయిడల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ' (ఎన్ఎస్ఐడి), ఓపిఆయిడ్ అనాల్జెసిక్స్. అనే రెండు రకాలుంటాయి.

ఎన్ఎస్ఐడి:

ఈ మందులతో కాలేయం, మూత్రపిండాల మీద చెడు ప్రభావం పడడంతో పాటు, గ్యాస్ట్రిక్ సమస్యలు కూడా మొదలవుతాయి. అప్పటికే గుండె జబ్బులు, మధుమేహం, అధిక రక్తపోటు లాంటి పైబడే వయసుతో కూడిన ఇతరత్రా ఆరోగ్య సమస్యలుంటే ప్రధాన అంతర్గత అవయవాలు అప్పటికే కొంత మేరకు దెబ్బ తిని ఉంటాయి. కాబట్టి ఈ కోవకు చెందినవాళ్లు ఎన్ఎస్ఐడి పెయిన్ కిల్లర్స్‌ను వాడుకుంటే నష్టం రెండింతలుంటుంది. దాంతో మూత్రపిండాలు ఫెయిలైపోవడం, కడుపులో అల్సర్లు ఏర్పడి, పుండ్లు పడడం, కాలేయం ఫెయిలైపోవడం లాంటి తీవ్రమైన సమస్యలు తలెత్తుతాయి.

ఓపిఆయిడ్ ఎనాల్జెసిక్స్:

ట్రెమడాల్ లాంటి ఈ కోవకు చెందిన మందులు సురక్షితమైనవే అయినా వీటికి అలవాటు పడే ప్రమాదం ఉంటుంది. కొందరికి డి విటమిన్ లోపంతో నీరసం, ఒళ్లు నొప్పులు వేధిస్తాయి. నొప్పిని తగ్గించుకోవడం కోసం పెయిన్ కిల్లర్ వేసుకుంటారు. నొప్పి తగ్గగానే, హాయిగా అనిపిస్తుంది. అయితే అది ఆ రోజు వరకే! మరుసటి రోజు మళ్లీ నొప్పులు వేధిస్తాయి. అప్పుడు కూడా ఉపశమనం కోసం అవే మందులను ఆశ్రయిస్తారు. ఇలా ఆ మందులు వ్యసనంగా మారతాయి. కాబట్టి తాత్కాలికంగా ఒకటి రెండు రోజుల కోసం నొప్పి తగ్గించే మందులు వాడుకున్నా, తర్వాత నొప్పికి మూల కారణాన్ని తెలుసుకోవడం కోసం వైద్యులను కలవాలి. వయసు, ఆరోగ్య పరిస్థితులు, అప్పటికే వాడుతున్న మందులు, వాటి దుష్ప్రభావాలు, నొప్పిని తట్టుకునే తత్వాల ఆధారంగా ఎన్ని రోజుల పాటు, ఏ మోతాదు మేరకు పెయిన్ కిల్లర్స్‌ను సూచించవచ్చో వైద్యులు మాత్రమే కచ్చితంగా నిర్ణయించగలుగుతారు.

డాక్టర్ సోమనాథ్ గుప్తా
సీనియర్ జనరల్ ఫిజీషియన్,
యశోద హాస్పిటల్స్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.



మానసిక సమస్యల మందులు కూడా...

కొన్ని రకాల మానసిక సమస్యలకు వైద్యులు సూచించే మందులకు వ్యసనపరులయ్యే ప్రమాదం ఉంటుంది. డిప్రెషన్‌తో బాధపడే వాళ్లు అందుకు అవసరమైన మందులు వాడుకున్నప్పుడు, సమస్య క్రమేపీ తగ్గుముఖం పట్టి, డిప్రెషన్ నుంచి బయట పడతారు. అయితే ఈ మందులకు మత్తు స్వభావం ఉంటుంది. కాబట్టి కొందరు వీటికి వ్యసనపరులుగా మారే ప్రభావం ఉంటుంది. ఈ తరహా వ్యసనం నుంచి బయటపడేలా చేయడం వైద్యులకే సాధ్యపడుతుంది. కాబట్టి వైద్యుల పర్యవేక్షణలో, వాళ్లు సూచించిన మోతాదును, సూచించినంత కాలం మాత్రమే వాడుకుంటూ, క్రమేపీ మోతాదును తగ్గించుకుంటూ సమస్య నుంచి కోలుకోవాలి.

ఐటీ ఉద్యోగుల కోసం బస్సులు

విశాఖలో ఉచితంగా ప్రయాణం

ద్వారకా బస్‌స్టేషన్ (విశాఖపట్నం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐటీ ఉద్యోగుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడపనున్నది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రుషికొండ ఐటీ పార్కుకు ఆర్టీసీ విశాఖ రీజియన్ ఈ బస్సులు ఆపరేట్ చేయనున్నది. సోమవారం ఐటీ పార్కు వద్ద నాలుగు బస్సులను విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ బస్సుల్లో ఐటీ ఉద్యోగులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తారు. ఆ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం భరించనున్నది. ఈ బస్సులు పాతగాజువాక, కూర్మన్నపాలెం, విజయనగరం, పెందుర్తి ప్రాంతాల నుంచి ఉదయం 8.00 గంటలకు బయలుదేరుతాయి. అలాగే సాయంత్రం 5.50 గంటలకు ఐటీ పార్కు నుంచి తిరిగి వెళ్తాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు. వీటితో పాటు గాజువాక, ద్వారకా బస్‌స్టేషన్‌ల నుంచి మరో రెండు బస్సులు నడుపుతామని ఆర్టీసీ ఇన్‌చార్జి ఆర్‌ఎం బి.అప్పలనాయుడు వెల్లడించారు. బస్సుల ప్రారంభ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, డిపో మేనేజర్లు, సిబ్బంది, ఏపీ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఏజెన్సీ మేనేజర్ కీర్తన ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



ఐటీ ఉద్యోగుల కోసం ప్రత్యేక బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న విశాఖ ఎంపీ శ్రీభరత్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



నాడు ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు ప్రారంభించిన అమరావతి పనులు(ఫైల్)

విధ్వంసాన్ని తట్టుకుని..

సగర్వంగా తలెత్తి

- అమరావతి శంకుస్థాపనకు నేటితో తొమ్మిదేళ్లు
- నవ్యాంధ్ర రాజధానికి చంద్రబాబు శ్రీకారం
- రూ.50 వేల కోట్ల అగ్రిమెంట్ విలువతో పనులు
- వైసీపీ హయాంలో ఐదేళ్లూ విధ్వంసమే
- మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వంతో పునర్వైభవం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

విభజన తర్వాత రాజధాని లేని రాష్ట్రంగా తొలి అడుగులు వేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు వేలాది రైతులు బాసటగా నిలిచారు. రాజధాని నిర్మాణానికి తమ భూములను స్వచ్ఛందంగా ముందుకొచ్చి అందించారు. తొమ్మిదేళ్ల క్రితం ఇదే రోజు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఒక చారిత్రక ఘట్టంగా రాజధానికి శంకుస్థాపన చేశారు. ఆనక ప్రభుత్వం మారింది. వెంటనే ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసానికి బీజం పడింది. మూడు రాజధానులు అంటూ రాజకీయ క్రీడకు తెరలేచింది. ఆ ఐదేళ్లు రైతుల ఆవేదన అరణ్య రోదనే అయింది. రైతులు, మహిళలు అలుపెరగకుండా చేసిన పోరాటానికి ఫలితం దక్కింది. రాజధానితో రాజకీయం చేసిన పార్టీకి ఎన్నికల్లో ప్రజలు చెంపపెట్టులాంటి తీర్పునిచ్చారు. నేడు మళ్లీ అమరావతి సగౌరవంగా తలెత్తుకుని నిలబడింది.

అమరావతి పునర్నిర్మాణం దిశగా వేగంగా ముందుకు అడుగులు వేస్తోంది. రాజధానిని అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు అప్పట్లో టీడీపీ ప్రభుత్వం సీఆర్‌డీఏను ఏర్పాటు చేసింది. మాస్టర్ ప్లాన్ రూపొందించింది. అభివృద్ధి ప్రాజెక్టులను రూ.9 వేల కోట్ల అగ్రిమెంట్ విలువతో ప్రారంభించారు. రోడ్లు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన ట్రంక్ ఇన్ఫ్రా కోసం రూ.13,760 కోట్ల అగ్రిమెంట్ విలువను నిర్ణయించారు. భూ సమీకరణ కింద తీసుకున్న భూములకు ప్రతిగా రైతులకు ప్యాకేజీ నిమిత్తం మరో రూ. 37,660.80 కోట్ల అగ్రిమెంట్ విలువను నిర్ణయించారు. దాదాపు రూ.50 వేల కోట్ల అగ్రిమెంట్ విలువతో కూడిన పనులకు శ్రీకారం చుట్టగా, 2019లో ఎన్నికలు సమీపించే నాటికి భవనాలకు సంబంధించిన అభివృద్ధి ప్రాజెక్టులకు రూ. 2,055.43 కోట్లు ఖర్చు పెట్టారు. రూ.3,533.78 కోట్లతో ట్రంక్ ఇన్ఫ్రా పనులు, 12,669 కోట్లతో ఎల్‌పీఎస్ ఇన్ఫ్రా పనులు జరిగాయి. మూడున్నరేళ్లపాటు రాత్రింబవళ్లు పనులు జరిగాయి. గత టీడీపీ ప్రభుత్వం రోడ్లు, ట్రంక్ ఇన్ఫ్రా కోసం రూ.1,275 కోట్ల హడ్కో రుణాన్ని తీసుకుంది. అమరావతి బాండ్ల ద్వారా రూ.2,000 కోట్లను సమీకరించింది. గృహ నిర్మాణ ప్రాజెక్టుల కోసం బ్యాంకుల కన్సార్టియం ద్వారా రూ.2,060 కోట్ల రుణం తీసుకుంది. మొత్తంగా రూ. 5,300 కోట్లను సమీకరించి కలల రాజధాని సాకారం దిశగా అడుగులు వేసింది.

వైసీపీ అధికారం చేపట్టాక..

వైసీపీ 2019లో అధికారం చేపట్టాక రాజధాని నిర్మాణ పనులను అడ్డుకోవటమే ధ్యేయంగా పావులు కదిపింది. 25 శాతం కూడా పూర్తికాని పనులను నిలుపుదల చేస్తున్నట్టుగా ప్రకటించింది. దీంతో శాశ్వత రాజధాని పనులు నిలిచిపోయాయి. అతి ముఖ్యమైన జీఏడీ టవర్‌తో పాటు మరో నాలుగు టవర్ల నిర్మాణ పనులు, హైకోర్టు పనులను రూ. 3,453.16 కోట్లతో చేపట్టారు. హైకోర్టు 13 శాతం, జీఏడీ టవర్ 19 శాతం, మిగిలిన నాలుగు టవర్లలో టవర్-1, 2లు 18 శాతం, టవర్-3, 4లు 20 శాతం మేర పనులు పూర్తి చేసుకున్నాయి. వీటన్నింటినీ 25 శాతం పురోగతిలో లేని జాబితాలో చేర్చి పనులను వైసీపీ ప్రభుత్వం నిలుపుదల చేయించింది. తర్వాత నిధులు ఇవ్వకుండా ఎమ్మెల్యే, ఆలిండియా సర్వీసు అధికారుల కోసం నిర్మిస్తున్న మల్టీస్టోరెడ్ అపార్ట్‌మెంట్లు, ఎన్‌జీవో అపార్ట్‌మెంట్లు, ప్రభుత్వ టైప్-1, 2 బిల్డింగ్ పనులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, సెక్రటరీల బంగ్లాలు, మంత్రులు, జడ్జిల బంగ్లాలు ఆపేశారు. రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి పైపులైన్ల వంటి అభివృద్ధి పనులన్నీ ఆగిపోయాయి. రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధిని కూడా పక్కన పెట్టేశారు. అమరావతిలో నెలకొల్పాల్సిన సంస్థలు, అమరావతి నూతన రైల్వేలైన్ పనులు, అమరావతి ఓఆర్‌ఆర్, ఐఆర్‌ఆర్ వంటి వాటిని కూడా రానివ్వకుండా చేశారు.

ఇప్పుడేం జరుగుతోంది..

- కూటమి ప్రభుత్వం రావటంతోనే రూ. 43 కోట్లతో అమరావతిలో పెరిగిపోయిన పిచ్చిచెట్లను తొలగించింది.
- ఐదేళ్లుగా శాశ్వత రాజధాని భవనాలు నీటిలో నాని ఉండటం వల్ల అసలు అవి పనికొస్తాయో, లేదో తెలుసుకునేందుకు టెక్నికల్ కమిటీని నియమించింది. చెన్నై, హైదరాబాద్ ఐఐటీ బృందాలు కాంక్రీట్, స్టీల్ శాంపిళ్లను సేకరించి పరీక్షించాక ఇవి దృఢంగా ఉన్నాయని రిపోర్టు ఇచ్చాయి. దీంతో గవర్నమెంట్ కాంప్లెక్స్ పనులను పునఃప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 75% పురోగతిలో ఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆలిండియా సర్వీసు అధికారుల భవనాల పాత టెండర్‌ను రద్దుచేసి రూ. 524.70 కోట్లతో తిరిగి పూర్తి చేసేందుకు సిద్ధమైంది.
- ఆగిపోయిన సీఆర్‌డీఏ ప్రాజెక్టు కాంప్లెక్స్ పనులకు ఇటీవలే సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు.
- నిలిచిపోయిన ట్రంక్ ఇన్ఫ్రా పనులను ముందుకు తీసుకెళ్లేందుకు డీపీఆర్ తయారీకి సీఆర్‌డీఏ సిద్ధమైంది. సీడ్ యాక్సెస్ రోడ్డు రెండో దశ పనులతో పాటు ఈ-11, ఈ-13 రోడ్లను ఎన్‌హెచ్-16కు అనుసంధానం చేసేందుకు టెండర్లు పిలవటానికి సిద్ధమైంది.
- హ్యాపీనెస్ట్ ప్రాజెక్టును మళ్లీ మొదలుపెట్టి పూర్తి చేసేందుకు ఇటీవలే టెండర్లు పిలిచింది.
- శాశ్వత వరద నివారణ చర్యల్లో భాగంగా కొండవీడు వాగు, గ్రావిటీ వాగు, పాలవాగులను విస్తరించి అభివృద్ధి చేసేందుకు అంచనాలు తయారు చేయిస్తున్నారు. 3 పంపింగ్ స్టేషన్లు, ఆరు రిజర్వాయర్లను కూడా అభివృద్ధి చేసేందుకు టెండర్లు పిలవనున్నారు.
- రాజధాని పనులన్నీ మహాయజ్ఞంలా ప్రారంభమై.. కొత్త సంవత్సరంలో రేయింబవళ్లు పనులు జరగనున్నాయి.

ఉచ్చు బిగుస్తోంది!

వైసీపీ నేతలకు దడదడ.. 'వైపీఎస్' అధికారుల్లోనూ వణుకు

- పలు కేసుల్లో పక్కాగా ముందుకు
- చంద్రబాబు ఆదేశాలతో దర్యాప్తు వేగం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ హయాంలో అరాచకాలు సృష్టించిన వైసీపీ గూండాలకు, వారికి సహకరించిన 'వైపీఎస్' అధికారులకు ఉచ్చు బిగుస్తోంది. వైసీపీ నేతల తప్పులకు సంబంధించి పక్కా ఆధారాలు సేకరించి చర్యలు తీసుకునే దిశగా సీఎం చంద్రబాబు పోలీసులను నడిపిస్తున్నారు. ఫలితంగా వైసీపీ జమానాలో రెచ్చిపోయినవారి వెన్నులో వణుకు పుడుతోంది. వారికి వంత పాడిన ఖాకీలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి నరసాపురం ఎంపీ, ప్రస్తుత ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును రాత్రికి రాత్రి హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి సీఐడీ కార్యాలయంలో చిత్రహింసలకు గురిచేశారు. ఈ వ్యవహారంలో తనను వేధించి, హింసించిన ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్, వ్యూహరచన చేసిన పీఎస్‌ఆర్ ఆంజనేయులు, అమలు చేసిన అడిషనల్ ఎస్పీ విజయ్‌పాల్‌పై గుంటూరు ఎస్పీకి రఘురామ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ముగ్గురిపై కేసు నమోదు చేసిన గుంటూరు పోలీసులు హత్యాయత్నం సెక్షన్లు పెట్టారు. అయితే నిందితులు సీనియర్ ఐపీఎస్‌లు కావడం, అదనపు ఎస్పీ స్థాయిలో పనిచేసిన విజయ్‌పాల్ దర్యాప్తు అధికారికి సహకరించక పోవడంతో కేసు నీరుగారి పోతోందన్న భావన వ్యక్తమైంది. దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షించి కేసు దర్యాప్తు బాధ్యతలను ప్రకాశం జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న దామోదర్‌కు అప్పగించింది. దీంతో విజయ్‌పాల్ నోరు విప్పక తప్పని పరిస్థితి ఏర్పడనుంది. పాల్ నోరు విప్పితే ఎవరెవరు కుట్ర చేశారు? ఎవరు అమలు చేశారు? తదితర విషయాలన్నీ వెలుగులోకి వస్తాయి. ఈ కేసులో నిందితుడైన మాజీ సీఎం జగన్ పాత్రా వెలుగులోకి వస్తుందని భావిస్తున్నారు.



జెత్వానీ కేసు సీఐడీకి

ముంబై నటి కాదంబరీ జెత్వానీ కేసులో విజయవాడ ఏసీపీ దర్యాప్తు అధికారిగా వ్యవహరించారు. కేసులో ప్రధాన నిందితుడైన వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ అరెస్టయి జైలుకు వెళ్లారు. ఇతర నిందితుల్లో డీజీపీ ర్యాంకు అధికారి పీఎస్‌ఆర్ ఆంజనేయులు, ఐజీ ర్యాంకు అధికారి కాంతి రాణా తాతా, డీఐజీ ర్యాంకు అధికారి విశాల్ గున్నీ, ఏసీపీ హనుమంతరావు, సీఐ సత్యనారాయణ, మరో న్యాయవాది ఉన్నారు. వీరందరినీ విచారించి కేసు నిలబెట్టాలంటే సీఐడీకి అప్పగించడమే సమంజసమని సర్కారు భావించింది. అడిషనల్ డీజీ ర్యాంకు అధికారి చీఫ్‌గా ఉన్న సీఐడీలో ఐజీ వరకు విచారించేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

బాబు ఇల్లు, టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసుల్లో..

వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే జోగి రమేశ్ నేరుగా ప్రతిపక్ష నేత ఇంటిపైకి చెప్పి మరీ తన అనుచరులతో వెళ్లి దాడికి దిగారు. అడ్డుకోబోయిన టీడీపీ శ్రేణులపై హత్యాయత్నం, అట్రాసిటీ కేసులు నమోదు చేసిన తాడేపల్లి పోలీసులు అదే వైసీపీ ఎమ్మెల్యే, అతని అనుచరులపై సాధారణ సెక్షన్ల కింద కేసు పెట్టారు. అప్పటి సీఎం జగన్ ఈ దాడులను ఖండించక పోగా "నన్ను తిట్టారు.. మా వాళ్లు కొట్టారు" అని సమర్థించారు. తర్వాత కాలంలో జోగికి మంత్రి పదవి కట్టబెట్టారు. కాగా, రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే పెండింగ్ కేసులపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. తాడేపల్లి పోలీసులు కొందరు నిందితులను అరెస్టు చెయ్యగానే ప్రధాన కుట్రదారు జోగి రమేశ్ ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. దీనిలో పోలీసులు సరిగా వ్యవహరించలేదని ప్రభుత్వం భావించింది. అదేవిధంగా టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి కేసులోనూ పోలీసుల పనితీరు ప్రభుత్వ పెద్దలకు సంతృప్తిగా అనిపించలేదు. డీజీపీ కార్యాలయం పక్కనే ఉన్న తమ ఆఫీసుపై పట్టపగలు బీభత్సం సృష్టించిన వారిని అరెస్టు చేయడంలో మంగళగిరి పోలీసులు సరిగా వ్యవహరించలేదని భావించింది. ఈ నేపథ్యంలోనే ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాశ్ వంటి వారు ముందస్తు బెయిల్ తెచ్చుకోగలిగారనే నిర్ధారణకు వచ్చింది.

సీఎం అసంతృప్తితో!

దాడులు, కుట్ర కేసులపై ఇటీవల సమీక్షించిన సీఎం చంద్రబాబు "వాళ్లలా(వైసీపీ) నేను అరచకాలు, దౌర్జన్యాలకు మద్దతివ్వను. కానీ, తప్పుచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోలేకపోతే ఎలా?" అని పోలీసు ఉన్నతాధికారుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో లోపాన్ని గ్రహించిన పోలీసు ఉన్నతాధికారులు చంద్రబాబు ఇల్లు, టీడీపీ ఆఫీసుపై దాడి కేసులను సీఐడీకి అప్పగించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. దీంతో ఆ రెండు కేసులను ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ఇక, మదనపల్లె ఫైల్స్ దహనం కేసును కూడా సీరియస్‌గా తీసుకుని బాధ్యుల్ని చట్టపరంగా శిక్షించాలని ఆదేశించింది. మరోవైపు రాష్ట్రంలో అత్యాచార ఘటనలు అరికట్టేందుకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటుకు చర్యలు చేపడుతోంది.

తీవ్ర తుఫాన్‌పై పూర్తి అప్రమత్తత: సిసోడియా

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తీవ్ర తుఫాన్ ఏర్పడనున్న నేపథ్యంలో అవసరమైతే తీర ప్రాంతాల్లో నివసించే ప్రజల్ని సురక్షిత ప్రదేశాలకు, సహాయ పునరావాస శిబిరాలకు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధతపై సోమవారం కేంద్ర కేబినెట్ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఒడిశా, బెంగాల్ సీఎస్‌లతో పాటు ఏపీ నుంచి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా పాల్గొని, తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్రంలో తీసుకున్న ముందస్తు చర్యలను వివరించారు. మత్స్యకారులు 25వ తేదీ వరకు సముద్రంలోకి వెళ్లరాదని హెచ్చరించి, ఇప్పటికే సముద్రంలోకి వెళ్లిన వారిని నేవీ సహకారంతో వెనక్కి రప్పించామన్నారు.

ముగిసిన టెట్.. రికార్డు స్థాయిలో 86.28% హాజరు

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్షలు ముగిశాయి. ఈనెల 3న ప్రారంభమైన ఈ పరీక్షలు సోమవారంతో పూర్తయ్యాయి. మొత్తం 17 రోజుల పాటు పరీక్షలు జరిగాయి. టెట్‌కు 4,27,300 మంది దరఖాస్తు చేసుకోగా.. 3,68,661(86.28 శాతం) మంది హాజరయ్యారు. 58,639 మంది పరీక్షలు రాయలేదు. రాష్ట్రంతో పాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లో ఏర్పాటు చేసిన ఏపీ టెట్ సెంటర్లలో పరీక్షలు జరిగాయి. పరీక్షలు ముగిసిన వెంటనే అధికారులు ఎప్పటికప్పుడు సంబంధిత పేపర్ల 'కీ'లను అందుబాటులో ఉంచారు. వాటిపై అభ్యంతరాలు స్వీకరించారు. త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడబోతున్నందున టెట్‌కు అభ్యర్థులు ఎక్కువ ఆసక్తి చూపించారు. చిన్నపాటి ఇబ్బంది కూడా తలెత్తకుండా టెట్ పరీక్షలు పూర్తి చేసినట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రికార్డు స్థాయిలో 86.28 శాతం మంది పరీక్షలకు హాజరుకావడం ఇదే తొలిసారి అన్నారు.

నేటి నుంచి రైతులకు ఈ-క్రాప్ రశీదుల పంపిణీ

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్‌లో నమోదైన రైతులకు రశీదులు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్ ఢిల్లీరావు తెలిపారు. మొబైల్ ఫోన్లకు ఎస్‌ఎంఎస్‌లు కూడా పంపుతామన్నారు. సోమవారం జిల్లాల వ్యవసాయాధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాంకేతికత ద్వారా కేంద్రం కొత్తగా ప్రవేశపెట్టిన జాతీయ పురుగు, తెగుళ్ల నిఘా వ్యవస్థలోని యాప్‌ను ఉపయోగించుకోవాలని అధికారులకు సూచించారు. నమో డ్రోన్ దీదీ పథకం అమలుపై చర్చించారు.

నమో డ్రోన్ దీదీ పథకం అమలు కమిటీ సవరణ

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలకు డ్రోన్లు అందించే నమో డ్రోన్ దీదీ పథకం అమలు చేసే కమిటీని సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుత నోడల్ డిపార్ట్‌మెంట్లుగా ఉన్న వ్యవసాయ, వ్యవసాయ ఇంజనీరింగ్ శాఖలకు బదులు వ్యవసాయశాఖ డైరెక్టర్‌ను నోడల్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నియమించింది. పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్, సీఈవో సెర్ప్, సహకార శాఖ కమిషనర్, నాబార్డు సీజీఎం, ఇఫ్కో స్టేట్ మేనేజర్, రంగా వర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్‌లను ప్రభుత్వం నామినేట్ చేసే సభ్యులుగా నియమించింది.

సీఎస్‌ఆర్ నిధులు విడుదల చేయండి

- పెట్రోలియం కార్యదర్శి పంకజ్ జైన్‌కు టీడీపీ ఎంపీ పుట్టా విజ్ఞప్తి

న్యూఢిల్లీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన అనంతర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకంగా సీఎస్‌ఆర్ నిధులు విడుదల చేసి ఆదుకోవాలని కేంద్ర పెట్రోలియం కార్యదర్శి పంకజ్ జైన్‌కు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం పెట్రోలియం కార్యదర్శిని కలిసిన ఎంపీ వినతిపత్రం అందజేసి, పరిస్థితిని వివరించారు. జైన్ సానుకూలంగా స్పందించారని ఎంపీ ఒక ప్రకటనలో తెలిపారు.

జగన్ గగ్గోలు.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లే: వర్ల

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణ లేదని, శాంతిభద్రతలు క్షీణించాయని జగన్ గగ్గోలు పెడుతున్నారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా మాట్లాడుతున్న ఆయనకు శాంతిభద్రతల గురించి మాట్లాడే నైతిక అర్హత ఉందా?' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య సోమవారమిక్కడ మండిపడ్డారు.

రాష్ట్రాలతో కాదు.. దేశాలతోనూ పోటీ!

- ఏపీని ఐటీ, ఎలక్ట్రానిక్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం
- 20 లక్షల ఉద్యోగాల కల్పనలో వీటిదే కీలక పాత్ర
- ఐసీఈఏ సమావేశంలో మంత్రి లోకేశ్

న్యూఢిల్లీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా, ఇతర దేశాలతో కూడా తాము పోటీపడుతున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఇండియన్ సెల్యులర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) ప్రతినిధులతో ఆయన సోమవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీని ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మార్చడానికి చేపడుతున్న చర్యలు, రాష్ట్రంలో ఉన్న అనుకూల పరిస్థితులను పారిశ్రామికవేత్తలకు వివరించారు. పేరెన్నికగన్న పారిశ్రామికవేత్తలతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని, తరచూ వారితో సమావేశమై విధాన సమస్యలు, సవాళ్లను అధిగమించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏపీలో రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సాధించడంలో ఐటీ, ఎలక్ట్రానిక్ రంగాలు కీలకపాత్ర పోషిస్తాయని, టైలర్ మేడ్ పాలసీలను రూపొందిస్తామని చెప్పారు.

అంతర్జాతీయ ఏఐ రాజధానిగా విశాఖ

"ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు దేశంలోనే అత్యంత సులభతరమైన ఇండస్ట్రీ ఫ్రెండ్లీ పాలసీలను అమలు చేస్తోంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నినాదంతో ముందుకు సాగుతున్నాం. సరైన ప్రాతిపాదనలతో వచ్చే వారికి తగిన ప్రోత్సాహకాలు అందించడానికి సిద్ధంగా ఉన్నాం. ఏపీని ఇన్నోవేషన్, టెక్నాలజీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పవర్‌హౌస్‌గా మార్చడంపై దృష్టి సారించాం. విశాఖను ఐటీ పవర్ హౌస్‌గా, అంతర్జాతీయ ఏఐ రాజధానిగా తీర్చిదిద్దాలన్న కృతనిశ్చయంతో ఉన్నాం. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధికి ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీస్ యూనివర్సిటీ, డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాం' అని లోకేశ్ వివరించారు. తిరుపతిని ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మార్చడానికి పారిశ్రామికవేత్తల సహకారం కోరుతున్నామన్నారు. ఇప్పటికే ప్రముఖ డిక్సన్, డైకిన్, టీసీఎల్ కంపెనీలు తమ యూనిట్లను ఏపీలో ఏర్పాటు చేశాయని అన్నారు. అనంతపురంలో కియా మోటార్స్ పనిచేస్తోందని, అనంతపురం, కర్నూలు జిల్లాలను ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఈవీ రంగాలకు కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నామని చెప్పారు. అమెరికాలో వాషింగ్టన్ మాదిరిగా ఏపీ రాజధాని అమరావతిని తీర్చిదిద్దడంపై దృష్టి సారించామన్నారు. భారత్‌లో మొబైల్ తయారీ రంగ అభివృద్ధికి గల అవకాశాలు, అందులో పీఎల్ఐ పాత్రపై గణాంకాలతో పారిశ్రామికవేత్తలు వివరించారు. అన్నివిధాలా అనువైన వాతావరణంతో వ్యూహాత్మక పెట్టుబడి కేంద్రంగా ఏపీ ముందుకు సాగుతోందని, రాష్ట్రాభివృద్ధికి మీ వంతు సహకారం అందించాలని వారికి మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు.



ఢిల్లీలో స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రి జయంత్ చౌదరితో సమావేశమైన మంత్రి లోకేశ్, పక్కన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

నైపుణ్య గణనకు సహకరించండి

కేంద్ర మంత్రి జయంత్ చౌదరికి లోకేశ్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రణాళికల రూపకల్పనకు, దేశంలోనే తొలిసారిగా చేపడుతున్న నైపుణ్య గణన (స్కిల్ సెన్సస్)కు సహకారం అందించాలని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరికి రాష్ట్ర మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. సెంట్రల్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అధికారులు అతుల్ కుమార్ తివారీ, వేద్ మణి తివారీతో సోమవారం ఢిల్లీలో లోకేశ్, రాష్ట్ర అధికారులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో చేపట్టనున్న నైపుణ్య గణనపై లోకేశ్ స్పెషల్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. స్కిల్ డెవలప్‌మెంట్ లక్ష్యం చేరుకునేందుకు కేంద్రం, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, మంత్రిత్వ శాఖల నుంచి ఏపీకి ఏమేం కావాలో వివరిస్తూ ఓ లేఖను కేంద్ర మంత్రికి అందజేశారు. సమావేశంలో పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర అధికారులు కోన శశిధర్, విజయ రామరాజు, గణేష్ కుమార్, ఈడీ దినేష్ కుమార్ పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ చేసిన విజ్ఞప్తులు..

నైపుణ్యం గల మానవ వనరులను అందించేందుకు ఏపీలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం మోడల్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్ సెంటర్‌ను అమరావతిలో నెలకొల్పాలి. స్కిల్ ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్ కావాలి. గతంలోనే విశాఖలో 7 ఎకరాల కేటాయింపు జరిగిన చోట నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయాలి. మంగళగిరిలో జెమ్స్ అండ్ జువెలరీ, అమరావతిలో నిర్మాణ రంగం, కర్నూలులో రెన్యువబుల్ ఎనర్జీ, చేనేత-హస్తకళలు, విశాఖలో ఫార్మా ల్యాబ్స్, నెల్లూరు, తిరుపతిల్లో ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్, మ్యానుఫ్యాక్చరింగ్ సెంటర్లు నెలకొల్పేందుకు స్కిల్ కౌన్సిల్ సహకారం అందించాలి. పీఎంకేవీవై (ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన) కేటాయింపులు జరగాలి. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ వెబ్‌సైట్లతో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్‌ను అనుసంధానం చేయాలి. గిరిజన నైపుణ్య శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు నిధులు కేటాయించాలి.

'హయగ్రీవ' భూ లావాదేవీల్లో రూ.200 కోట్ల మనీలాండరింగ్!

- ఎంవీవీ, ఆడిటర్ జీవీ నివాసాలు, ఆఫీసుల్లో సోదాలు అందుకే: ఈడీ

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): 'హయగ్రీవ' భూమి అక్రమ బదలాయింపు ద్వారా రూ.200 కోట్ల మనీలాండరింగ్‌కు పాల్పడ్డారనే అభియోగంపై విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఆయన స్నేహితుడు, ఆడిటర్ గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ)కి చెందిన నివాసాలు, కార్యాలయాల్లో ఐదు చోట్ల సోదాలు నిర్వహించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ప్రకటించారు. వృద్ధులకు కాటేజీలు, వృద్ధాశ్రమం నిర్మాణం కోసం హయగ్రీవ ఫర్మ్స్ అండ్ డెవలపర్స్ సంస్థకు రాష్ట్రప్రభుత్వం 2008లో 12.51 ఎకరాలు కేటాయించింది. రూ.30.25 కోట్ల మార్కెట్ విలువ కలిగిన భూమిని కేవలం రూ.5.63 కోట్లకు కేటాయించింది. అయితే ఆ భూమిని.. ఫోర్జరీ సంతకాలతో తప్పుడు పత్రాలు సృష్టించి తమ నుంచి లాక్కున్నారని, ప్లాట్లుగా విభజించి ఇతరులకు విక్రయించేశారని, ఈ క్రమంలో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ 'హయగ్రీవ' సంస్థ ప్రొప్రయిటర్ సీహెచ్ జగదీశ్వరుడు ఈ ఏడాది జూన్‌లో ఫిర్యాదుచేశారు. ఆరిలోవ పోలీసులు ఎంవీవీ, జీవీతోపాటు గాదె బ్రహ్మాజీ అనే మరొకరిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా ఈడీ విశాఖ సబ్ జోనల్ కార్యాలయం అధికారులు ఈనెల 19న ఎంవీవీ సత్యనారాయణకు చెందిన 2 నివాసాలు, కార్యాలయంతోపాటు జీవీ నివాసం, కార్యాలయంలో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. హయగ్రీవ భూ లావాదేవీల్లో దాదాపు రూ.200 కోట్లు వరకూ మనీ లాండరింగ్‌కు పాల్పడినట్లు గుర్తించారు. బినామీల పేర్లతో ఫోర్జరీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలు, డిజిటల్ డివైజ్‌లు, ఎంవీవీ, జీవీతోపాటు వారి కుటుంబ సభ్యుల పేర్లతో ఉన్న 300కిపైగా సేల్‌డీడ్‌లు, చరాస్తులకు సంబంధించి రూ.50 కోట్లు లావాదేవీలు జరిగినట్లు నిర్ధారించే పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారులు పేర్కొన్నారు.

ఉద్యోగం చేసే వారికీ డిప్లొమా

- రాత్రి వేళలు, ఆదివారాల్లో తరగతులు
- రెండేళ్ల కాలంలోనే కోర్సు పూర్తి
- రాష్ట్రంలో అమల్లోకి నూతన విధానం
- ఆరు కాలేజీల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఇకపై ఉద్యోగం చేస్తున్న వారు కూడా డిప్లొమా చదవొచ్చు. పగలు ఉద్యోగం చేసుకుంటూ.. రాత్రి వేళలు, ఆదివారాల్లో డిప్లొమా తరగతులకు హాజరు కావొచ్చు. రెగ్యులర్ విద్యార్థులు మూడేళ్లలో డిప్లొమా పూర్తి చేస్తే, ఇలా ఉద్యోగాలు చేసుకునే వాళ్లు రెండేళ్లలోనే కోర్సును పూర్తిచేసే అవకాశాన్ని సాంకేతిక విద్యాశాఖ కల్పించింది. రాష్ట్రంలో తొలిసారి వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకంగా డిప్లొమా కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏఐసీటీఈ అనుమతితో రాష్ట్రంలో ఆరు కాలేజీల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీచేసింది. వాటిలో ఒక ప్రభుత్వ, ఐదు ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. అభ్యర్థులు ఈనెల 26లోగా దరఖాస్తులు సమర్పించాలని సాంకేతిక విద్యా మండలి కార్యదర్శి వి.విజయ్‌కుమార్ తెలిపారు. సంబంధిత పాలిటెక్నిక్‌లో 28న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఇంటర్మీడియట్ లేదా రెండేళ్ల ఐటీఐ పూర్తిచేసిన వారు ఈ కోర్సులకు అర్హులు. విశాఖపట్నంలోని ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో 169 సీట్లు అందుబాటులోకి తెచ్చారు. మిగిలిన ఐదు ప్రైవేటు కాలేజీల్లో ఒక్కో బ్రాంచ్‌కు 33 సీట్లు చొప్పున ఉన్నాయి.

ఏపీలో ఫోరెన్సిక్ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటు చేయండి

- అమిత్‌షాకు టీడీపీపీ నేత లావు విజ్ఞప్తి



కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

న్యూఢిల్లీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీలో నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ(ఎన్ఎఫ్ఎస్‌యూ) క్యాంపస్ ఏర్పాటు చేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం లేదా అమరావతిలో దీన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సోమవారం ఢిల్లీలో అమిత్‌షాతో ఎంపీ భేటీ అయ్యారు. ఎన్ఎఫ్ఎస్‌యూ క్యాంపస్ ఏర్పాటుతో రాష్ట్ర ఫోరెన్సిక్ సామర్థ్యాలను బలోపేతం చేయడమే కాకుండా ఏపీలో విద్యా, అభివృద్ధి అవకాశాలను మరింత పెంచుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చండి..

బేడా(బుడగ) జంగం సామాజిక వర్గాన్ని ఏపీలో నోటిఫై చేసిన ఎస్సీల జాబితాలో మళ్లీ చేర్చాలని గతేడాది రాష్ట్ర కేబినెట్, శాసనసభ చేసిన తీర్మానాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అమిత్‌షాకు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సాంస్కృతిక, సామాజిక నిర్మాణంలో ప్రత్యేక పాత్ర పోషిస్తున్న బుడగ జంగం సమాజం.. సామాజిక, ఆర్థిక, జీవనోపాధి పరిస్థితులకు సంబంధించి అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని వివరించారు. వారికి సంక్షేమ పథకాలు, విద్య, ఉపాధి అవకాశాలతో సహా సామాజిక, ఆర్థిక అవసరాలను తీర్చడానికి సమగ్ర విధానాన్ని రూపొందించడం చాలా ముఖ్యమన్నారు. రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ) కేటగిరీలో చేర్చాలన్న వారి డిమాండ్‌ను ప్రాధాన్య ప్రాతిపదికన పరిశీలించాలని కోరారు.

రూ.99 లిక్కర్‌పై క్రేజ్



సరఫరాకు పెద్ద కంపెనీల ఆసక్తి

ఇప్పటికే ఏడు బ్రాండ్లకు అనుమతి

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'క్వార్టర్ రూ.99 మద్యం' విని యోగదారులతో పాటు మద్యం కంపెనీల్లోనూ క్రేజ్ పెంచింది. తక్కువ ధరకు వస్తున్న లిక్కర్ బ్రాండ్ల అమ్మకాలు పెరుగుతాయని ఊహిస్తున్న కంపెనీలు తమ బ్రాండ్లను కూడా తక్కువ ధరకు తీసుకొస్తే ఎలా ఉంటుందన్న దానిపై ఆరా తీస్తున్నాయి. మీడియం కేటగిరీ మద్యం ఉత్పత్తి చేసే ప్రముఖ కంపెనీలు ఈ విషయంపై ఎక్సైజ్ శాఖతో చర్చలు జరిపినట్లు తెలిసింది. ఇప్పటికే నాలుగు కంపెనీలు ఏడు రకాల బ్రాండ్లను రూ.99 ఎమ్మార్పీపై సరఫరా చేసేందుకు అనుమతులు పొందాయి. దాదాపు 30 వేల కేసులను ఉత్పత్తి చేశాయి. అక్కడి నుంచి లైసెన్సీలు ఈ మద్యాన్ని తీసుకుంటున్నారు. ఈ నెలాఖరు నాటికి 2.4 లక్షల కేసులు అందుబాటులోకి తీసుకొస్తామని ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. అమ్మకాల ట్రెండ్ ఆధారంగా తాము అదే ధరకు మద్యం సరఫరా చేస్తే ఎలా ఉంటుందనే దానిపై లిక్కర్ కంపెనీలు కసరత్తు చేస్తున్నాయి. కొంతకాలం వేచిచూసి విని యోగదారుల స్పందన చూసి ముందుకురావాలని మరికొన్ని కంపెనీలు భావిస్తున్నాయి. తక్కువ ధర ఉన్న మద్యంపై వ్యాపారులకు తక్కువ మార్జిన్ వస్తుంది. అదే ఎక్కువ ధర ఉన్న మద్యం విక్రయిస్తే ఎక్కువ మార్జిన్ వస్తుంది కాబట్టి, తక్కువ ధర మద్యాన్ని ఎక్కువగా తీసుకోకపోవచ్చనే వాదన వినిపిస్తోంది.

జగన్ మీడియాపై కేంద్రానికి 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఫిర్యాదు

- 'సాక్షి' చానల్‌కు కేంద్ర హోం శాఖ నుంచి సెక్యూరిటీ క్లియరెన్స్ లేదన్న విషయమూ ఫిర్యాదులో ప్రస్తావన
- శాటిలైట్ ఫ్రీక్వెన్సీ హ్యాకింగ్‌పైనా విజయవాడలో కేసు

అమరావతి, హైదరాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ మీడియా.. సైబర్ ఫ్రాడ్, వెబ్‌సైట్ హ్యాకింగ్ వంటి అనైతిక చర్యలకు పాల్పడుతున్న వైనంపై 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' కేంద్ర సమాచార, ప్రసార శాఖకు ఫిర్యాదు చేసింది. తెలుగు రాష్ట్రాల్లో విశేష ఆదరణ, సాక్షి కంటే మెరుగైన ర్యాంకింగ్ ఉన్న 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' వెబ్‌సైట్‌కు వచ్చే ట్రాఫిక్‌ను సైబర్ నేరగాళ్లు ట్యాగ్స్ ద్వారా మళ్లిస్తున్నారని.. వారికి 'సాక్షి'తో సంబంధాలు ఉన్నాయని బలంగా అనుమానిస్తున్నట్టు వెల్లడించింది. జగన్ రోత మీడియా చేస్తున్న ఈ చర్యల వల్ల వాటిల్లుతున్న ఆర్థిక నష్టం గురించి, సంస్థ ప్రతిష్ఠ తీవ్రంగా దెబ్బతింటున్న వైనం గురించి ఈ లేఖలో పేర్కొంది. 'న్యూస్ బ్రాడ్‌కాస్టింగ్ స్టాండర్డ్స్ అథారిటీ' రూపొందించిన నైతిక నియమావళిని సాక్షి టీవీ గతంలో పలు సందర్భాల్లో ఉల్లంఘించిన విషయాన్ని కూడా 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' తన లేఖలో గుర్తుచేసింది. 2022 జనవరి 20న.. కేంద్ర హోం శాఖ నిఘా నివేదికలను ఉటంకిస్తూ సాక్షి చానల్‌కు సెక్యూరిటీ క్లియరెన్స్ ఇవ్వడానికి నిరాకరించిన విషయాన్ని, ప్రస్తుతం ఆ చానల్ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులపై నడుస్తున్న విషయాన్ని సమాచార శాఖ కార్యదర్శి దృష్టికి తీసుకొచ్చింది. మరోవైపు.. జగన్ మీడియాపై విజయవాడలో సైబర్ కేసు నమోదైంది. రెండు నెలలుగా ఇంటర్‌నెట్‌లో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' వెబ్‌సైట్ చూడాలనుకుంటే.. సాక్షి వెబ్‌సైట్ వచ్చేలా ఫ్రాడ్ జరిగిందని, దీనివల్ల నెలకు రూ.50 లక్షల నష్టం వాటిల్లుతోందని, అలాగే ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఓబీ వ్యాన్ శాటిలైట్ ఫ్రీక్వెన్సీని కూడా హ్యాక్ చేశారని.. దీనిపై ఇస్రోకూ ఫిర్యాదు చేశామని, దీని వెనుక కూడా సాక్షి హస్తం ఉందని అనుమానిస్తూ విజయవాడలో సంస్థ యాజమాన్యం ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు.. బీఎన్ఎస్ యాక్ట్‌లోని 318 (4), 319 (2) సెక్షన్లతోపాటు, ఐటీచట్టంలోని 66, 66సీ, 66డీ సెక్షన్ల కింద అభియోగాలు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.



టీడీపీ కేంద్ర కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి కె.పార్థసారథి, టీడీపీ సీనియర్ నేత ప్రభాకర్ చౌదరి, మహిళా నేతలు ఆచంట సునీత, జయలక్ష్మి తదితరులు

భూములు కబ్జా చేశారు!

- తోపుదుర్తి, పిన్నెల్లి, అంజాద్ బాషా అనుచరులపై ఫిర్యాదుల వెల్లువ
- తమకు న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో వినతుల స్వీకరణ

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, మాజీ ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచర వర్గం తమ భూములను కబ్జా చేశారని బాధితులు ఫిర్యాదు చేశారు. సోమవారం ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన వినతుల కార్యక్రమంలో పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థ సారధి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, అంగన్‌వాడీ వర్కర్ల రాష్ట్ర యూనియన్ అధ్యక్షురాలు ఆచంట సునీత, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి అన్నాబత్తుని జయలక్ష్మి వినతులు స్వీకరించారు. అంజాద్ బాషా, అతని తమ్ముడు అహ్మద్ బాషా, ఇతర అనుచరులు తమ భూములకు దొంగ పత్రాలు సృష్టించి కబ్జా చేశారని, భూమి వద్దకు వెళ్తే దౌర్జన్యం చేస్తున్నారని కడపకు చెందిన వి.శోభారాణి ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, అతని సోదరుడు చంద్రశేఖర రెడ్డి, వారి అనుచరులు కలిసి తన భూమిని ఆక్రమించి అమ్ముకొన్నారని టీడీపీ న్యాయ విభాగం రాష్ట్ర కార్యదర్శి పి.లక్ష్మన్న ఫిర్యాదు చేశారు. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డి కలిసి తమపై తప్పుడు కేసులు పెట్టి బెదిరించి, తమ భూమిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వేరే వారికి రిజిస్ట్రేషన్ చేయించారని బాధితులు ఫిర్యాదు చేశారు. వైసీపీ నేతలు అశోక్, విజయ్‌కుమార్ తదితరులు తమ ఇంటిపై దాడి చేసి కొట్టి, ఖాళీ పత్రాలపై సంతకాలు చేయించుకోవడంతో పాటు తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని అనంతపురానికి చెందిన ఎం.పద్మజ ఫిర్యాదు చేశారు.

జగన్... నీకు సిగ్గులేదా?

- రాజశేఖరరెడ్డి కొడుకువై ఉండి రూ.3,500 కోట్ల ఫీజు బకాయిలా?: షర్మిల



అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.3,500 కోట్ల బకాయి పెట్టేందుకు సిగ్గులేదా అని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిలదీశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మానసపుత్రిక అని ఎక్స్ వేదికగా సోమవారం ఆమె స్పష్టం చేశారు. నాడు వైఎస్ఆర్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అద్భుతంగా అమలు చేశారని, ఆయన సొంత కొడుకై ఉండి జగన్ తన హయాంలో ఈ పథకాన్ని నీరుగార్చారని అసహనం వ్యక్తం చేశారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూటమి ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అమరావతికి మారనున్న షర్మిల మకాం!

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఇకపై అమరావతి కేంద్రంగా రాజకీయ కార్యకలాపాలు సాగించాలని నిర్ణయించారు. ఉండవల్లి సమీపంలో అనువైన స్థలం కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కృష్ణా నది ఒడ్డున మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమం సమీపంలో స్థలాలను ఇటీవల ఆమె పరిశీలించారు. ఇంటి నిర్మాణం పూర్తయ్యేలోపు నివాసం ఉండేందుకు ఏదైనా భవనాన్ని అద్దెకు తీసుకోవాలని భావిస్తున్నారు.

ఆరోపణలతో పబ్బం గడుపుకోవడం తగదు: బొత్స

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ప్రభుత్వం గుర్ల మండలంలో జరిగిన సమస్యను గుర్తించాలి. ఆరోపణలతో పబ్బం గడుపుకోవడం తగదు' అని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. సోమవారం విజయనగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'గుర్ల మండలంలో 8 గ్రామాల్లో డయేరియా కారణంగా 16 మంది మృతి చెందారు. సామాన్యుల ప్రాణాలతో చెలగాటం ఆడుకోవడం తగదు. తక్షణమే ఆయా గ్రామాలను రెడ్ జోన్లుగా ప్రకటించి సహాయ చర్యలు ముమ్మరం చేయాలి. రూ.500 కోట్లతో రుషికొండ కట్టారంటూ పవన్ ఆరోపణలు చేయడం తగదు. అది ప్రభుత్వ భవనం' అని అన్నారు.

వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధి అరెస్టు.. బెయిల్

గుడివాడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును అవినీతిపరుడంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కంటెంట్ రైటర్ ఇంటూరి రవికిరణ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తెలుగు మహిళ నాయకురాలు అసిలేటి నిర్మల గుడివాడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పలుమార్లు విచారణ నిమిత్తం పిలిచినా ఆయన స్పందించలేదు. దీంతో సెక్షన్లు 193, 353(2), 336(4), 340(2) కింద రవికిరణ్‌ను సోమవారం అరెస్టు చేశారు. అనంతరం న్యాయాధికారి ముందు హాజరుపరచగా.. 14 రోజుల రిమాండ్ విధించారు. ఆ వెంటనే రూ.10 వేల డిపాజిట్, ఇద్దరు వ్యక్తిగత పూచీకత్తులపై రవికిరణ్‌కు బెయిల్ మంజూరు చేశారు.

మంత్రి సత్యకుమార్‌పై హత్యాయత్నంపై ఫిర్యాదు

గుంటూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌పై గత వైసీపీ ప్రభుత్వ హయాంలో హత్యాయత్నం జరిగిందని బీజేవైఎం నేత పనతల సురేశ్ ఫిర్యాదు చేశారు. సోమవారం గుంటూరు జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు అందజేశారు. మందడంలో రాజధాని రైతుల దీక్షకు 2023 మార్చి 31న సంఘీభావం ప్రకటించి తిరిగి వస్తున్న సమయంలో సత్యకుమార్‌పైకి వైసీపీ అప్పటి ఎంపీ నందిగం సురేశ్, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్ అనుచరులు కత్తులు, రాడ్లు, రాళ్లు తదితర మారణాయుధాలతో దూసుకువచ్చారన్నారు. అడ్డుకునేందుకు యత్నించిన తనను, తమ కార్యకర్తలను పక్కకు ఈడ్చుకొచ్చి విచక్షణారహితంగా కొట్టి తీవ్రంగా బెదిరించారన్నారు. తమ కార్లను ధ్వంసం చేశారన్నారు. సుమారు 60, 70 మంది జై బోరుగడ్డ, జై నందిగం సురేశ్, జై సజ్జల అంటూ నినాదాలు చేశారన్నారు. నాడు తాము తుళ్లూరు, మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా ఫిర్యాదు తీసుకోలేదన్నారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను కూడా ఎస్పీకి ఇచ్చామని పనతల సురేశ్ తెలిపారు. స్పందించిన ఎస్పీ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడొద్దు

పోలీసు శాఖకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది


- పోలీసు అమరవీరుల సంస్మరణ సందర్భంగా సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): "శాంతి భద్రతల పరిరక్షణలో ఎక్కడా రాజీ పడొద్దు. పోలీసు శాఖకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుంది. రాష్ట్రంలో ఆడబిడ్డలపై గంజాయి మత్తులో అత్యాచారాలకు పాల్పడుతున్నారు. అటువంటి వారికి అదే చివరి రోజు కావాలి. హిందూపురం, బద్వేలు, బాపట్లలో మహిళలపై అత్యాచారాలు, హత్యలకు పాల్పడిన వారికి ప్రత్యేక కోర్టుల ద్వారా కఠిన శిక్షలు పడేందుకు కృషిచేయాలి' అని పోలీసు శాఖకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రైమ్ రేట్ జీరోకు రావాలని, డ్రగ్స్, గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట పడాలని చెప్పారు.

పోలీసులకు టెక్నాలజీ నాలుగో నేస్తం

పోలీసులు టెక్నాలజీని నాలుగో నేస్తంగా వినియోగించుకుని నేరస్తుల ఆట కట్టించాలని సీఎం చంద్రబాబు అన్నారు. 2047 నాటికి దేశంలోనే ఏపీ పోలీస్ నంబర్‌వన్‌గా ఉండేలా పోలీసు శాఖలోని ప్రతి ఒక్కరూ శ్రమిస్తే అందుకు అవసరమైన తోడ్పాటు ప్రభుత్వం అందిస్తుందని చంద్రబాబు చెప్పారు. తమ ప్రభుత్వానికి శాంతి భద్రతలే ముఖ్యమని, పోలీసు శాఖకు ఆయుధాలు, టెక్నాలజీతో పాటు 6,100 మంది సిబ్బందిని అందజేసే బాధ్యత తీసుకుంటామన్నారు.

పోలీసు సంక్షేమానికి ఏటా 20 కోట్లు



ప్రభుత్వ సొమ్ము రూ.500 కోట్లు ఖర్చు చేసి విశాఖలో ప్యాలెస్ కట్టుకున్న పేదల ముఖ్యమంత్రి పోలీసులకు సరెండర్ లీవులు కూడా ఇవ్వలేదంటూ జగన్‌పై చంద్రబాబు సెటైర్లు వేశారు. పోలీసులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.763 కోట్లు విడతల వారీగా విడుదల చేస్తామన్నారు. ఐదేళ్లుగా పోలీసు సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఇకపై ప్రతి ఏటా రూ. 20 కోట్ల చొప్పున విడుదల చేస్తామని తెలిపారు. పోలీసు అమరవీరుల స్థూపాన్ని అమరావతిలో నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో హోంమంత్రి అనిత, సీఎస్ నీరబ్ కుమార్, డీజీపీ ద్వారకా తిరుమల రావు పాల్గొని పోలీసు అమర వీరులకు నివాళులర్పించారు.

ప్రత్యేక సీటు వద్దు..

తన కోసం పోలీసులు కుర్చీపై టవళ్లు వేసి ప్రత్యేకంగా ఏర్పాటు చేయడాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తిరస్కరించారు. వేదికపై ఉన్నవారందరితో సమానంగా కూర్చుంటానని తన కుర్చీపై ఉన్న టవల్‌ను ఆయనే స్వయంగా తీసేశారు.

'దీపం'తో దీపావళి!

(మొదటి పేజీ తరువాయి)

నాదెండ్ల మనోహర్, ఆ శాఖ ఉన్నతాధికారులు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందూస్థాన్ పెట్రోలియం ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. ఉచిత గ్యాస్ సిలిండర్లను ఈనెల 24 నుంచే బుకింగ్ చేసుకునేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈనెల 31న దీపావళి పండుగ రోజున లబ్ధిదారులకు పంపిణీ ప్రారంభిస్తామన్నారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో సిలిండర్ ధరను చెల్లించాల్సి ఉంటుంది. అందులో కేంద్ర ప్రభుత్వం తన రాయితీ రూ.25ను లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తుంది. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల్లోనే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుంది. వెరసి... వారికి సిలిండర్ పూర్తి ఉచితంగా లభిస్తుంది. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని పారదర్శకంగా వర్తింపజేయాలని, విమర్శలు లేకుండా చూడాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

'సూపర్ సిక్స్' హామీ...

మహిళలకు ఇంటిఖర్చులు తగ్గించేందుకు ఉమ్మడిరాష్ట్రంలో 'దీపం' పథకం అమలులోకి తెచ్చామని, ఇప్పుడు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల ద్వారా వారికి ఎంతో మేలు జరుగుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. "దీపం పథకం దీపావళి పండుగకు ఇళ్లల్లో వెలుగులు తెస్తుంది. వంట గ్యాస్ కోసం ఖర్చు చేసే డబ్బులను గృహిణులు ఇతర అవసరాలకు వాడుకోవచ్చు. అందుకే ఆర్థిక సమస్యలున్నా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టాం" అని ముఖ్యమంత్రి తెలిపారు. అంతకుముందు.. ఈ పథకం అమలుకు తీసుకున్న చర్యలపై పౌరసరఫరాల శాఖ కార్యదర్శి జి.వీరపాండియన్ ముఖ్యమంత్రికి వివరించారు. ప్రతి 4నెలలకు ఒకటి చొప్పున ఉచిత సిలిండర్ తీసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. "ప్రస్తుతం సిలిండర్ ధర రూ.876. కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ రూ.25పోనూ.. మిగిలిన రూ.851 పూర్తి రాయితీతో ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు తీసుకోవచ్చు. ఈ పథకంతో రాష్ట్ర ప్రభుత్వంపై ఏటా రూ.2,684 కోట్ల భారం పడుతుంది" అని వివరించారు.



కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశమైన మంత్రి సత్యకుమార్

కాంగ్రెస్ వైపు జగన్ మొగ్గు!

- సత్యకుమార్ ధ్వజం.. ఢిల్లీలో అమిత్‌షాతో భేటీ

న్యూఢిల్లీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని బీజేపీ నేత, రాష్ట్ర ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు తెలిపారు. హరియాణా ఎన్నికల ఫలితాల తర్వాత జగన్ చేసిన ప్రకటనలను, ఎన్నికల కమిషన్, ఈవీఎంలను తప్పుబట్టిన తీరును ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సత్యకుమార్ సోమవారమిక్కడ హోంమంత్రిని కలిశారు. చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమిత్ షాను ఆయన కలవడం ఇదే మొదటిసారి. జగన్ బెంగళూరులో మకాంవేసి అప్పుడప్పుడూ ఏపీకి వచ్చి రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని సత్యకుమార్ ఈ సందర్భంగా విమర్శించారు. నిజానికి ఆయన సృష్టించిన సమస్యలు, అరాచక పాలనతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బాగా దెబ్బతిందని.. రూ.11 లక్షల కోట్ల అప్పులు చేసి పోయారని చెప్పారు. అప్పులు తీర్చడానికి ఏటా రూ.72 వేల కోట్లు కట్టాల్సి వస్తోందని చెప్పినప్పుడు అమిత్ షా ఆశ్చర్యపోయినట్లు సమాచారం. రాష్ట్ర ఆదాయం రూ.96 వేల కోట్లయితే అందులో అధిక భాగం జీతాలు, పింఛన్లకే పోతోందని సత్యకుమార్ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నిర్వహించడం చాలా కష్టతరంగా ఉందన్నారు. అయినప్పటికీ సీఎం చంద్రబాబు సంయమనంగా పాలన నిర్వహిస్తున్నారని, కూటమి నేతల మధ్య సమన్వయం బాగుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రం మద్దతు ఇవ్వకుంటే పరిస్థితి ఇంకా దారుణంగా ఉండేదన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసినందుకు అమిత్ షాకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో తన నియోజకవర్గం ధర్మవరంలో అమిత్ షా పర్యటన తర్వాతే రాష్ట్ర రాజకీయ పరిస్థితిలో ఎంతో మార్పు వచ్చిందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం బాగానే జరుగుతోందని అమిత్‌షాకు తెలిపారు.

ఏపీ అభివృద్ధి చెందేలా డ్రోన్ సదస్సు

- యువత, విద్యార్థులను భాగస్వామ్యం చేయండి
- డ్రోన్ కార్పొరేషన్ సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ రంగంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందడానికి దిశానిర్దేశం చేసేలా అమరావతి డ్రోన్ సదస్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అమరావతి సచివాలయంలో సోమవారం ఆయన డ్రోన్ కార్పొరేషన్‌పై సమీక్ష నిర్వహించారు. అమరావతి డ్రోన్ సదస్సుకు చేసిన ఏర్పాట్ల గురించి ప్రభుత్వ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి సురేశ్ కుమార్, డ్రోన్ కార్పొరేషన్ ఎండీ దినేశ్ కుమార్ సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. డ్రోన్ సదస్సులో ఎక్కువ మంది యువత, విద్యార్థులు భాగస్వామ్యం అయ్యేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో డేటా అనేది గొప్ప సంపదని అన్నారు. డ్రోన్ల యూఎస్ కేసెస్‌లో ఎన్నింటిని మనం ఉపయోగించుకోగలమనే దానిపై ఒక అంచనా ఉండాలని, ప్రధానంగా డ్రోన్లను ఉపయోగించుకునే అవకాశాలున్న శాఖల ఉన్నతాధికారులతో ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసి అధ్యయనం చేయాలన్నారు. కృత్రిమ మేధతో అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని, డ్రోన్ల యూఎస్ కేసెస్‌లో ఏఐకి ఉన్న అవకాశాలను పరిశీలించి సమర్థంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రోన్ల ద్వారా భూసార పరీక్షలు నిర్వహించవచ్చని, పంట ఎంత దిగుబడి వస్తుందో అంచనా వేయొచ్చన్నారు. దోమల నివారణ, విద్యుత్ లైన్ల పర్యవేక్షణ, రహదారుల పర్యవేక్షణ.. ఇలా పలు రంగాలు, పలు విధాలుగా డ్రోన్లను వినియోగించుకోవచ్చని చంద్రబాబు అన్నారు. ఈ సమావేశంలో మంత్రి బీసీ జనార్దనరెడ్డి, సీఎస్ నీరబ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల జీవన ప్రమాణాలు పెరగాలి

- పిల్లలందరూ పాఠశాలల్లో చేరేలా చర్యలు: సీఎం

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని సీఎం చంద్రబాబు కోరారు. గిరిజనుల సంక్షేమానికి, వారి ప్రాంతాల అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాల ప్రగతిపై సోమవారం ఆయన సమీక్షించారు. కేంద్ర పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం పేర్కొన్నారు. విద్య, వైద్య, ఆరోగ్యం, తాగునీటి సరఫరా, రహదారులు, కమ్యూనికేషన్ తదితర మౌలిక వసతుల కల్పనతో పాటు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు జీవనోపాధి కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు. అక్షయ పాత్ర సంస్థ ద్వారా గిరిజన విద్యార్థులకు పోషకాహారం అందించే ప్రతిపాదనలకు సీఎం ఆమోదం తెలిపారు. అందుకు రూ.337 కోట్లు మంజూరు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. తల్లీ, బిడ్డల మరణాల రేటును తగ్గించే విధంగా, సికిల్‌సెల్ వ్యాధిని నివారించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గిరిజన ప్రాంతాల్లో అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యాన్ని కల్పించేందుకు రూ.1200 కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టును రూపొందించాలన్నారు. జనవరి కల్లా బీఎస్ఎన్ఎల్‌తో పాటు ఇతర నెట్‌వర్కులను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సోలార్ విద్యుత్తు వినియోగాన్ని పెంచే విధంగా ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఆ శాఖ కార్యదర్శి కన్నబాబు, సీఎం కార్యదర్శి ప్రద్యుమ్న, జీసీసీ అధికారులు, ఐటీడీఏ పీఓలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక దుర్వినియోగం కారాదు



తూర్పుగోదావరి జిల్లా వేమగిరి-కడియపులంక ర్యాంపు నుంచి ఉచిత ఇసుకను తరలించేందుకు బారులు తీరిన ట్రాక్టర్లు

- బ్లాక్ మార్కెటింగ్‌ను పూర్తిగా నిరోధించండి
- ఇతర రాష్ట్రాలకు తరలించకుండా నిఘా
- గనుల శాఖకు సీఎం చంద్రబాబు ఆదేశాలు

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక దుర్వినియోగాన్ని అరికట్టేందుకు, బ్లాక్ మార్కెటింగ్‌ను పూర్తిగా నిరోధించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలించకుండా ప్రత్యేక టీమ్‌లతో నిరంతర నిఘా, పర్యవేక్షణ సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతర్రాష్ట్ర అక్రమ రవాణాను పూర్తిగా అడ్డుకోవాలని, సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ఉచిత ఇసుక పాలసీ అమలుపై ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. నిర్వహణ, రవాణా చార్జీల భారం తగ్గించేందుకు సాధ్యమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తాను చెప్పినట్లుగా ఇసుకపై సీనరేజీ ఫీజు రద్దు చేయాలన్నారు. ప్రస్తుతం టన్ను ఇసుకపై 88 రూపాయల సీనరేజీ వసూలు చేస్తున్నారు. 20 టన్నుల లారీకి 1,760 రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారు. ఉచితంగా ఇచ్చే ఇసుకకు సీనరేజీని మినహాయింపునిస్తూ త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామని గనుల శాఖ అధికారులు నివేదించారు. ఈ సందర్భంగా జీఎస్టీ మినహాయింపుపై సీఎం ఆరా తీశారు. జీఎస్టీ కౌన్సిల్ ఆమోదం ద్వారానే ఇసుకపై జీఎస్టీని వినహాయించగలమని అధికారులు నివేదించారు. 'రాష్ట్రం తనకు తానుగా జీఎస్టీని మినహాయించలేదు. ఇసుకను జీఎస్టీలో 2505 కోడ్ కింద నమోదు చేశారు. నిర్మాణ రంగానికి ఇచ్చే ఇసుకపై 5 శాతం జీఎస్టీ ఉంటుంది. దీన్ని మినహాయించలేరు. అలాగే ఇసుక అమ్మకాలపై 18 శాతం జీఎస్టీ ఉంది. దాన్ని వినహాయించాలంటే కేంద్ర జీఎస్టీ కౌన్సిల్‌లోనే నిర్ణయం తీసుకోవాలి. రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకోవడం కుదరదు. కావాలంటే ఉచిత ఇసుక లబ్ధిదారులు చెల్లించిన జీఎస్టీని ప్రభుత్వం తిరిగి వారికి రీయింబర్స్‌మెంట్ చేయవచ్చు. అది కూడా సాంకేతికంగా సంక్లిష్టమైనది. జీఎస్టీ మినహాయింపు అనేది కేవలం ఒకటి రెండు రాష్ట్రాల కోసం కాకుండా జాతీయ స్థాయిలో అమలయ్యేలా నిర్ణయించాలి. కాబట్టి ముందు ఈ విషయాన్ని జీఎస్టీ కౌన్సిల్‌కు నివేదించాలి' అని ఓ అధికారి ప్రతిపాదించినట్లు తెలిసింది. ఈ విషయంపై కేంద్రంతో మాట్లాడుదామని సీఎం చెప్పినట్లు తెలిసింది. ప్రైవేటు ఏజెన్సీల ద్వారా ఇసుక సరఫరాపై అధ్యయనం చేయాలని గనుల శాఖను సీఎం ఆదేశించారు.

ఆ జిల్లాల్లో ప్రైవేట్ స్టాక్‌యార్డ్‌లు

ఇసుక రీచ్, స్టాక్‌యార్డులు అందుబాటులో లేని జిల్లాల్లో ప్రత్యేక చర్యలతో ఇసుక లభ్యత తీసుకురావాలని సర్కారు భావిస్తోంది. ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు మినరల్ డీలర్ లైసెన్సు(ఎండీఎల్) ఇచ్చి వారితో ఇసుక అందించే ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు చర్చకొచ్చాయి. వీటిని కూడా పరిశీలన చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. విశాఖపట్నం, అనకాపల్లి, తిరుపతి, నంద్యాల, ప్రకాశం, ఏలూరు తదితర జిల్లాల పరిధిలో ఇలాంటి విధానం చేపట్టే అవకాశం ఉంది. ఈ ప్రాంతాల్లో ప్రైవేటు వ్యక్తులు ఇసుక స్టాక్‌యార్డులను తెరిచి తక్కువ ధరకే ఇసుక అమ్మకాలు చేపట్టేలా విధానం తీసుకురావాలన్నది ఈ ప్రతిపాదన సారాంశం.

వ్యక్తిగత అవసరాలకే ట్రాక్టర్ ఇసుక

గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత ఇసుక విధానంలో ట్రాక్టర్‌కు వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల(జీఓ-64)ను కొందరు అప్పుడే తమ స్వార్థం కోసం దుర్వినియోగం చేస్తున్నారు. ఇసుకను బ్లాక్‌మార్కెట్‌లో అమ్ముకునేందుకు లెక్కలేని విధంగా తరలించుకుపోతున్నారు. ఇదే విషయాన్ని అధికారులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. జీఓ 64 లక్ష్యాలు పక్కాగా అమలయ్యేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. కేవలం సొంత అవసరాలకే ట్రాక్టర్ ఇసుక అని, దాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటారన్న విషయం తెలియజేయాలని ఆదేశించారు. వ్యక్తిగతంగా ట్రాక్టర్ ద్వారా ఇసుక తీసుకెళ్లాలంటే సంబంధిత గ్రామ సచివాలయంలో రిజిస్టర్ చేసుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

అమరావతికి రూ. 11 వేల కోట్ల హడ్కో రుణం

- ఢిల్లీలో ఆ సంస్థ అధికారులతో మంత్రి నారాయణ చర్చలు సఫలం
- సీఆర్‌డీఏకు రుణం ఇచ్చేందుకు హడ్కో సీఈఓ అంగీకారం



హడ్కో సీఎండీ సంజయ్ కుల్‌శ్రేష్ఠతో మంత్రి నారాయణ, ఎంపీ బాలశౌరి, అధికారులు


అమరావతి, న్యూఢిల్లీ, గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణానికి అడుగులు వేగంగా పడుతున్నాయి. అమరావతిని నంబర్ వన్ రాజధానిగా తీర్చిదిద్దాలన్న సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యాలకు అనుగుణంగా అన్నివైపుల నుంచి సహకారం అందుతోంది. అమరావతి నిర్మాణానికి హడ్కో రూ.11 వేల కోట్ల రుణం అందించేందుకు ముందుకొచ్చింది. ఇప్పటికే ప్రపంచబ్యాంకు రూ. 15 వేల కోట్లు ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. దానికి సంబంధించిన ప్రక్రియ డిసెంబర్ కల్లా పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. రాజధాని నిర్మాణంలో ప్రభుత్వ భవనాల కాంప్లెక్, ల్యాండ్ పూలింగ్ ద్వారా రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలో మౌలిక వసతులు అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సదుపాయం వంటి ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి మిగిలిన పనుల పూర్తికి రూ.50 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. అయితే వాటిలో మొదటి విడత పనుల పూర్తికి రూ. 26 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ నిధుల సమీకరణ కోసం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దృష్టిసారించింది. ఇప్పటికే ప్రపంచబ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు కలిసి రూ.15 వేల కోట్లు ఇచ్చేందుకు అంగీకారం తెలిపాయి. ఇక మిగిలిన రూ. 11 వేల కోట్ల నిధుల మంజూరుకు హడ్కో ఓకే చెప్పింది. సోమవారం ఢిల్లీలో పర్యటించిన మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ హడ్కో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో హడ్కో సీఈఓ సంజయ్ కుల్‌శ్రేష్ఠ, హడ్కో విజయవాడ రీజినల్ చీఫ్ బీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు. అమరావతి నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ ప్రతిపాదనలకు సంతృప్తి చెందిన హడ్కో సీఈఓ అమరావతి నిర్మాణం కోసం ఏపీసీఆర్‌డీఏకు రూ.11 వేల కోట్ల రుణం మంజూరుకు అంగీకారం తెలిపారు. ఈ విషయాన్ని నారాయణ ఎక్స్ వేదికగా తెలిపారు. దీంతో అమరావతి ఫేజ్-1 నిర్మాణానికి అవసరమైన మొత్తం రూ.26 వేల కోట్లు సర్దుబాటు అయినట్టయింది. ఈ నిధులు విడుదలైతే రాజధాని పనులు వేగంగా ముందుకు సాగనున్నాయి.

పొత్తు వల్లే భారీగా గ్రాంట్లు: పెమ్మసాని

బీజేపీతో పొత్తు పెట్టుకోవడంలోనే చంద్రబాబు ముందుచూపు, దార్శనికత కనిపిస్తోందని, అందువల్లే అతి తక్కువ సమయంలో, అద్భుత రీతిలో గ్రాంట్లు రాబట్టగలిగామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.



జాతీయ డ్రోన్ కేపిటల్‌గా అమరావతి!



» నేడు, రేపు అమరావతి డ్రోన్-2024 సదస్సు

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మానవ రహిత కృత్రిమ సాంకేతిక లోహ విహంగాల (డ్రోన్) జాతీయ రాజధానిగా అమరావతిని నిలపాలన్న లక్ష్యంతో రాష్ట్ర డ్రోన్ కార్పొరేషన్ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. మంగళ, బుధవారాల్లో గుంటూరు జిల్లా మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో 'అమరావతి డ్రోన్ సమ్మిట్- 2024' పేరిట జాతీయ స్థాయిలో మేధోమథనం చేపడుతోంది. 2029 నాటికి రూ.1,000 కోట్ల పెట్టుబడులు, రూ.6,000 కోట్ల రాబడి, 12,500 మందికి డ్రోన్ యాజమాన్య నిర్వహణలో ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పాలసీని రూపొందించేందుకు డ్రోన్ వినియోగదారుల ఆలోచనలను పంచుకోనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథిగా రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో డ్రోన్ యాజమాన్య నిర్వహణపై కార్యాచరణ ప్రణాళికలను ఆవిష్కరించనున్నారు. నూతన ఆవిష్కరణలతో డ్రోన్ కేపిటల్ ఆఫ్ ఇండియాగా అమరావతిని ప్రకటిస్తూ ప్రత్యేక తీర్మానం చేయనున్నారు. ఈ సదస్సులో డ్రోన్‌ల తయారీ, వినియోగంలో అత్యాధునిక సాంకేతిక, విప్లవాత్మకమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో కూడిన సేవలతో పాటు వ్యవసాయం, పట్టణ ప్రణాళిక, విపత్తుల నిర్వహణ, రవాణా, ఆరోగ్యం, పరిశోధన, అభివృద్ధి, మౌలిక సదుపాయాల రంగాల్లో డ్రోన్‌ల వినియోగంపై కొత్త ఆవిష్కరణలపై సమీక్షించనున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి నిపుణులు 400 మంది ఈ సదస్సులో పాల్గొంటారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రోన్ పాలసీ-2024 తీసుకువచ్చేందుకు అవసరమైన సలహాలు, సూచనలు నిపుణుల నుంచి స్వీకరిస్తారు. 40 మందికిపైగా ఎగ్జిబిటర్లు సదస్సులో భాగస్వాములవుతారు. వివిధ రంగాలు, విభాగాల్లో వినియోగించేందుకు అనువైన డ్రోన్‌లను ప్రదర్శిస్తారు.



విజయవాడ బబ్బూరి గ్రౌండ్స్‌లో డ్రోన్ విన్యాసాల ట్రైల్ రన్

డ్రోన్‌ల వినియోగం ద్వారా పంటలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. పురుగు మందులు చల్లడం, ఎరువులు వేయడం వంటి సేవలనూ డ్రోన్ కార్పొరేషన్ అందుబాటులోకి తెస్తుంది. విపత్తుల సమయంలో బాధితులకు అండగా నిలిచేలా ప్రణాళికలు సిద్ధం చేసింది.

విజన్ డాక్యుమెంట్ రూపకల్పన

జాతీయ డ్రోన్ రాజధానిగా అమరావతిని నిలిపేందుకు ఈ సదస్సులో విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నారు. ఇందుకోసం ఇన్నోవేషన్-ఎకనామిక్ గ్రోత్, కెపాసిటీ బిల్డింగ్, గ్లోబల్ కొలాబిరేషన్ ఇండస్ట్రియల్ పార్టనర్‌షిప్ అనే 3 అంశాలను అమలుచేస్తారు. ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీలు, సాంకేతిక సంస్థలతో డ్రోన్ కార్పొరేషన్ భాగస్వామ్యం అవుతుంది. వర్సిటీల్లో ఏఐ డ్రోన్ కోర్సులు నిర్వహిస్తారు. ఏపీ డ్రోన్ కార్పొరేషన్ జాతీయ స్థాయిలో ఒక మోడల్‌గా నిలిచేలా కార్యాచరణ అమలు చేస్తారు.

పన్ను రాయితీ, ప్రోత్సాహకాలు

డ్రోన్ సదస్సులో 303 కంపెనీలు, 43 కేంద్ర ప్రభుత్వ శాఖలు పాల్గొంటున్నాయి. విదేశీ ప్రతినిధులు కూడా హాజరు కానున్నారు. ఈ సదస్సు ద్వారా దేశీయ డ్రోన్ తయారీ రంగంలోని సంస్థలను ఒకే చోటకు చేరుస్తారు. యువత ఉపాధి అవకాశాలనూ పెంచుతారు. ఇప్పటికే రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులను ప్రవేశ పెట్టారు. వీటిలో ఏఐ డ్రోన్ సిలబస్‌నూ చేరుస్తారు. అమరావతిని డ్రోన్ సిటీగా గుర్తింపు తెచ్చేలా అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడులను ఆకర్షిస్తారు. డ్రోన్ రంగంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు పన్ను రాయితీ సబ్సిడీ, ప్రోత్సాహకాలను ఇస్తారు.

నేడు డ్రోన్‌ల హాక్‌థాన్

రెండురోజుల సదస్సులో మంగళవారం సాయంత్రం కృష్ణా నదీ తీరాన పున్నమి ఘాట్ వద్ద 5,500 డ్రోన్‌లతో జాతీయ స్థాయి హాక్‌థాన్ నిర్వహిస్తారు. ప్రథమ స్థానంలో నిలిచిన డ్రోన్ నిర్వాహకుడికి బహుమతిగా రూ.24 లక్షలు డ్రోన్ కార్పొరేషన్ అందిస్తుంది. బుధవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.

నెల రోజుల్లో డ్రోన్ పాలసీ

నెల రోజుల్లో డ్రోన్ పాలసీ తీసుకువస్తామని రాష్ట్ర మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి సురేశ్ కుమార్ ప్రకటించారు. డ్రోన్ సదస్సు నిర్వహణ సందర్భంగా ఏపీ డ్రోన్ కార్పొరేషన్ సీఎండీ దినేశ్‌కుమార్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. మంగళవారం ఉదయం 10:30కు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఈ సదస్సును ప్రారంభిస్తారని చెప్పారు. సదస్సులో నాలెడ్జ్ పార్ట్‌నర్‌షిప్‌పై ఎంఓయూ కుదుర్చుకుంటామని వెల్లడించారు. తిరుపతి ఐఐటీతో డ్రోన్ సిస్టమ్ కోసం స్ట్రాటజీ ఫ్రేమ్‌వర్క్‌పై ఒప్పందం చేసుకుంటున్నామన్నారు. డ్రోన్ వినియోగానికి సంబంధించి 24 రంగాలు ఉన్నాయని సురేశ్‌కుమార్ చెప్పారు.



విజయనగరం జిల్లాలో అతిసార బారిన పడి గుర్ల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

'గుర్ల'పై ప్రత్యేక విచారణ

» స్పెషల్ సీఎస్ విజయానంద్‌కు బాధ్యతలు

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా కేసులు ప్రబలడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ వ్యవహారంపై ప్రత్యేకంగా విచారణ జరిపించాలని నిర్ణయించింది. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను విచారణాధికారిగా నియమించింది. ఈ మేరకు సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇంకోవైపు.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోమవారం అక్కడకు వెళ్లి బాధితులను పరామర్శించడంతో పాటు ఉన్నతాధికారులతో సమీక్షించి డయేరియా ప్రబలడానికి కారణాలను తెలుసుకున్నారు. ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు కూడా అక్కడే ఉండి బాధితులకు వైద్య సేవలు అందిస్తున్నారు.

కొత్త కేసులు నమోదు కాలేదు..

కాగా.. గుర్లలో కొత్తగా డయేరియా కేసులు నమోదు కాలేదని ఆరోగ్య మంత్రి సత్యకుమార్ కార్యాలయం తెలిపింది. ఆది, సోమవారాల్లో ఒక్క కేసు కూడా వెలుగులోకి రాలేదని వెల్లడించింది. 120 మంది వైద్య సిబ్బందిని గుర్ల గ్రామానికి తరలించామని, వారంతా మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారని తెలిపింది.

పల్లెలకివ్వకుండా ప్యాలెస్‌కు 500 కోట్లా?

(మొదటి పేజీ తరువాయి)

తప్పిదాలను వారసత్వంగా తీసుకోకూడదని, ఇప్పుడు ఎవరినీ నిందించే సమయం కాదని తెలిపారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. ఈ సమస్యను లోతుగా విశ్లేషిస్తే.. గత ఐదేళ్ల ప్రభుత్వం పంచాయతీ నిధులు సద్వినియోగం చేయలేదని, పారిశుధ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ధ్వజమెత్తారు. అలాగని గత ప్రభుత్వం మీద నెట్టేసి తాము బాధ్యతల నుంచి తప్పుకోలేదన్నారు. గుర్ల ఘటనపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని, ఇందుకోసం సీనియర్ ఐఏఎస్ అధికారి విజయానంద్‌ను నియమించారని, దీనిపై ఆయన నివేదిక ఇస్తారని చెప్పారు. ఆ తర్వాత మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. తాను మానవతా కోణంలో మృతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున సాయం అందిస్తానని ప్రకటించారు. ఇటీవల గుడివాడలోని వెలుగొండలో పల్లె పండగలో కలుషిత నీటి సమస్యపై ప్రజలు చెప్పారని, వెంటనే నీటి పరీక్షలు జరిపించి నిధులు కేటాయించామని చెప్పారు. గుర్లలో చంపావతి తాగునీటి సోర్స్ పాయింట్ పరిశీలించామని, ఒక లైన్ గుర్లకు.. మరో లైన్ గరివిడికి వెళ్తున్నాయని, గుర్ల వెళ్లే లైన్‌లో నీరు కలుషితమైనట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు చెప్పారు. ఉత్తరాంధ్రలో వాగులు, గెడ్డలను పరిశుభ్రంగా ఉండేలా చేస్తామన్నారు. ఈ నెల 18వ తేదీన జలజీవన్ విషన్ పనులకు సంబంధించి రూ.580 కోట్లు విడుదల అయ్యాయని, ఆ నిధులను పూర్తి స్థాయిలో వినియోగిస్తున్నామని తెలిపారు. జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కిమిడి కళా వెంకట్రావు, కోళ్ల లలిత కుమారి, పూసపాటి అదితి గజపతిరాజు, లోకం మాధవి, జిల్లా కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, మన్యం జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వైద్యసేవలపై పవన్ ఆరా

డిప్యూటీ సీఎం పవన్ చంపావతి నదిలోని పంపుహౌస్‌ను కూడా పరిశీలించారు. అక్కడి నుంచి గుర్ల పీహెచ్‌సీకి వచ్చి డయేరియా బాధితులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరుగురు బాధితుల వద్దకు వెళ్లి పరామర్శించారు. అక్కడి నుంచి గ్రామంలోకి వెళ్లారు. రామమందిరం వద్ద ఉన్న కలిశెట్టి సీతమ్మ ఇంటి వద్దకు వెళ్లారు. బాధితులు, మృతుల కుటుంబ సభ్యులను అక్కడకు పిలిపించి మాట్లాడారు. ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. తాను సొంతంగా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు.

డిప్యూటీ సీఎం రుషికొండ సందర్శన

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం పర్యాటకం పేరుతో రుషికొండపై రూ.500 కోట్ల ప్రజాధనంతో నిర్మించిన భవన సముదాయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. గుర్లలో డయేరియా బాధితులను పరామర్శించడానికి వెళ్లిన ఆయన తిరుగుప్రయాణంలో ఆకస్మికంగా రుషికొండను సందర్శించారు. విశాఖపట్నం టీడీపీ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎలమంచిలి జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, కూటమి నాయకులతో కలిసి.. లోపలకు వెళ్లకుండా బయటి నుంచే ఆ భవనాన్ని ఆమూలాగ్రం చూశారు. భవనం నిర్మాణంలో ఉన్నప్పుడు నిరుడు ఒకసారి ఆయన దానిని చూడడానికి వెళ్లగా అప్పటి ప్రభుత్వం అనుమతివ్వలేదు. ఆయన బయట రోడ్డు పైనుంచే చూసి వెళ్లిపోయారు. తాజాగా 'రుషికొండ.. గుడిబండ' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించడంతో ఆ ప్యాలెస్‌ను ఏ విధంగా ఉపయోగించుకుంటే బాగుంటుందో అంచనా వేయడానికి పవన్ వచ్చినట్లు జనసేన నాయకులు తెలిపారు. పూర్తి సమాచారం తెప్పించుకుని దీనిపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారన్నారు. దీనిపై తర్వాత మాట్లాడతానని పవన్ విలేకరులకు తెలిపారు. రుషికొండ భవన ప్రాంగణం సమీపంలో కూలిపనులు చేసుకుంటున్న వారు రాగా ఆయన వారితో మాట్లాడి ఫొటోలు దిగారు. ఈ పర్యటనలో పవన్ అభిమాని ఒకరు కారుకు అడ్డుపడగా పోలీసులు స్టేషన్‌కు తరలించారు.



దివ్యాంగురాలి సమస్య తెలుసుకుంటున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

దివ్యాంగురాలికి పవన్ భరోసా

విజయనగరం అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గుర్ల గ్రామానికి వచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసేందుకు విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం మొయిద గ్రామానికి చెందిన దివ్యాంగురాలు బి.రమాదేవి మండుటెండలో రోడ్డుపక్కన కూర్చుంది. ఆమెను చూసి కారు ఆపిన పవన్ సమస్య తెలుసుకున్నారు. తనకు రూ.6 వేలు మాత్రమే పింఛన్ ఇస్తున్నారని, 90 శాతం వైకల్యం ఉన్నవారికి రూ.15 వేలు ఇవ్వాల్సి ఉందని రమాదేవి కోరింది. అధికారులతో మాట్లాడతానని పవన్ ఆమెకు భరోసా ఇచ్చారు.

తిరుమల లడ్డూపై వ్యాఖ్యలు..

పవన్‌కు సమన్లు

» నవంబరు 22న విచారణకు రావాలని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు నోటీసులు

హైదరాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూల్లో కల్తీ నెయ్యి వినియోగించారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై దాఖలైన పిటిషన్‌ను హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు విచారణకు స్వీకరించింది. వచ్చే నెల 22న కోర్టు ముందు హాజరు కావాలని పవన్ కల్యాణ్‌తో పాటు తెలంగాణ సీఎస్ శాంతికుమారి, సమాచార శాఖ ముఖ్య కార్యదర్శికి సమన్లు జారీ చేసింది. గత జనవరిలో అయోధ్య రామ మందిర ప్రాణప్రతిష్ఠ సందర్భంగా అక్కడకు పంపిన తిరుమల లడ్డూల్లో జంతువుల కొవ్వు పదార్థాలు కలిశాయని పవన్ ఆధారాల్లేకుండా చేసిన వ్యాఖ్యలతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని న్యాయవాది ఇమ్మనేని రామారావు పిటిషన్‌లో పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధుల కేసుల విచారణ

వేగవంతమెలా?

» పరిష్కారంతో రండి.. సర్కారుకు హైకోర్టు ఆదేశం

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): 'ప్రజాప్రతినిధులపై నమోదయిన క్రిమినల్ కేసుల విచారణ విజయవాడలోని ప్రత్యేక కోర్టులో నడుస్తున్నాయి. పలు కేసుల విచారణపై హైకోర్టు స్టే విధించింది. వాటి విచారణల్లో వేగం పెంచేందుకు పరిష్కార మార్గాలను కోర్టు ముందు ఉంచండి' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేశ్ రెడ్డి, జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డితో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రజాప్రతినిధులుపై నమోదైన కేసుల విచారణల్లో వేగం పెంచేందుకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు సుమోటో పిల్ నమోదు చేసింది. పిటిషన్ సోమవారం విచారణకు వచ్చింది. ప్రత్యేక కోర్టు తరఫున న్యాయవాది వివేక్ చంద్రశేఖర్ స్పందిస్తూ.. మొత్తం 78 కేసుల విచారణ వివిధ దశల్లో పెండింగ్‌లో ఉందని ప్రత్యేక కోర్టు నివేదిక సమర్పించిందన్నారు. ఈ వివరాలు పరిశీలించిన ధర్మాసనం.. హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేసేందుకు చర్యలు తీసుకోవాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణకు సూచించింది.

నలుగురు ఐఏఎస్‌లకు

బెయిలబుల్ వారెంట్

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కోర్టు ధిక్కరణ కేసులో నలుగురు ఐఏఎస్ అధికారులపై హైకోర్టు బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. తామిచ్చిన ఆదేశాలను అమలు చేయని పక్షంలో కోర్టు ముందు నేరుగా హాజరై వివరణ ఇవ్వాలని ఇచ్చిన ఆదేశాలను అధికారులు పాటించక పోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.ఎస్.రావత్, కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జలవనరుల శాఖ ఈఈ డీపీ.రామ్‌గోపాల్‌పై బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. హైకోర్టు రిజిస్ట్రీ.. వారెంట్ అమలు చేసేందుకు వీలుగా విచారణను నవంబర్ 27కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు.

పినిపే తనయుడి అరెస్టు

» వలంటీర్ హత్య కేసులో సూత్రధారిగా గుర్తింపు

అమలాపురం/రామచంద్రపురం/చెన్నై, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో రెండున్నరేళ్ల కిందట అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జరిగిన దళిత వలంటీర్ దారుణ హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన సూత్రధారి మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత పినిపే విశ్వరూప్ తనయుడు పినిపే శ్రీకాంత్‌ను సోమవారం తమిళనాడులోని మదురై సమీపంలో ఏపీ పోలీసులు సినీ ఫక్కీలో అరెస్టు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హత్య కేసు విచారణ వేగవంతమైంది. దీంతో శ్రీకాంత్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో శ్రీకాంత్ తమిళనాడులోని తూత్తుకుడిలో ఉన్నట్టు సమాచారం రావడంతో ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ నేతృత్వంలో ప్రత్యేక పోలీస్ బృందం దక్షిణాది జిల్లాల్లో మకాం వేసి నిందితుడి కదలికలను నిశితంగా గమనించింది. ఆదివారం రాత్రి తూత్తుకుడి నుంచి మదురైకు(150 కిలోమీటర్లు) శ్రీకాంత్ కారులో బయలుదేరినట్టు సమాచారం రావడంతో పోలీసులు అనుసరించారు. ఆ విషయాన్ని పసిగట్టిన శ్రీకాంత్ తన కారును అతి వేగంతో ముందుకునడిపారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సినీ ఫక్కీలో చేజ్ చేసి.. మదురై జిల్లా తిరుమంగళంలో అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. సోమవారం ఉదయం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి, ట్రాన్సిట్ వారెంట్‌పై శ్రీకాంత్‌ను ఏపీకి తరలించారు. కాగా, హత్య వెనుక మహిళా సంబంధాలు ఉండి ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు.

రాజకీయ ప్రోద్బలంతో..

కోనసీమ జిల్లాలోని అయినవిల్లి గ్రామంలో వలంటీర్‌గా పనిచేస్తున్న దళిత యువకుడు జనుపల్లి దుర్గాప్రసాద్(27) జూన్ 6, 2022న హత్యకు గురయ్యారు. ఆ తర్వాత మృతదేహం కోటిపల్లి రేవులో దొరికింది. ఈ హత్య కేసుపై విచారణ జరపాలని ప్రజాసంఘాలు అప్పట్లో ఆందోళన చేసినా రాజకీయ ప్రోద్బలంతో కేసును పక్కన పెట్టేశారు. అయితే, రాష్ట్రంలో కూటమి సర్కారు వచ్చాక దుర్గాప్రసాద్ భార్య ఆదర్శ. మంత్రి వాసంశెట్టి సుభాశ్‌ను కలిసి విచారణ జరిగేలా చూడాలని విన్నవించారు.



వలంటీర్ దుర్గాప్రసాద్

మంత్రి సుభాశ్ కుట్ర: విశ్వరూప్

తన తనయుడి అరెస్టుపై మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ స్పందించారు. తాను తిరువనంతపురం వెళ్తుండగా తనకు ఈ విషయం తెలిసిందన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే మంత్రి వాసంశెట్టి సుభాశ్ తన కుమారుడిపై అక్రమ కేసును బనాయించేందుకు కుట్ర చేశారని ఆరోపించారు.

విశ్వరూప్ అడ్డుపడ్డారు: మంత్రి వాసంశెట్టి

పినిపే శ్రీకాంత్ అరెస్టుపై మంత్రి వాసంశెట్టి సుభాశ్ స్పందించారు. ఈ అరెస్టు వెనుక కుట్ర జరిగిందన్న విశ్వరూప్ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఎలాంటి కక్ష సాధింపులు లేవన్నారు. శ్రీకాంత్‌కు అత్యంత సన్నిహితుడైన దుర్గాప్రసాద్‌ను ఎందుకు హత్యచేయాల్సి వచ్చిందో విచారణలో తెలుస్తుందన్నారు. సోమవారం రామచంద్రపురంలో మాట్లాడుతూ.. మృతుడు దుర్గాప్రసాద్ తన కుమారుడికి 'శ్రీకాంత్' అని పేరు పెట్టింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఈ కేసులో అమలాపురానికి చెందిన రౌడీషీటర్లు ఉన్నారని, వారు కూడా బయటకు వస్తారని అన్నారు. హత్య అనంతరం.. దుర్గాప్రసాద్ భార్య వద్దకు అప్పటి మంత్రి విశ్వరూప్ వెళ్లి కేసు పెట్టవద్దని, రెండు ఎకరాలు ఇస్తామని చెప్పిన మాట వాస్తవం కాదా? అన్నారు.

ప్లాన్ శ్రీకాంత్‌దే

» కీలక నిందితుడి వాంగ్మూలం

దుర్గాప్రసాద్ హత్యకు పినిపే తనయుడు శ్రీకాంతే పక్కాప్లాన్ చేసినట్టు కీలక నిందితుడు పోలీసులకు తెలిపారు. ఉప్పలగుప్తం మండలం విలసవిల్లి గ్రామానికి చెందిన వడ్డి ధర్మేశ్‌ను ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. ధర్మేశ్ నుంచి లిఖిత పూర్వక వాంగ్మూలం తీసుకున్నారు. "జూన్ 5, 2022న అనాతవరం దగ్గరున్న గ్రాండ్ పార్క్ వద్ద శ్రీకాంత్‌తోపాటు మరికొందరు మద్యం సేవించారు. ఆ సమయంలో నేను కూడా ఉన్నా. మద్యం తాగుతున్న సమయంలో దుర్గాప్రసాద్ హత్యకు శ్రీకాంత్ పక్కా ప్లాన్ చేశారు. 2022, జూన్ 6వ తేదీ సాయంత్రం ముక్తేశ్వరం సెంటర్‌కు నలుగురు వ్యక్తులు కారు వేసుకుని వస్తారని, వారికి దుర్గాప్రసాద్ ఉన్న ప్రదేశాన్ని చూపించాలని శ్రీకాంత్ నన్ను ఆదేశించారు. దీంతో నేను దుర్గాప్రసాద్‌ను వారికి చూపించా. ఆ తర్వాత వారు దుర్గాప్రసాద్‌తో మాటలు కలిపి పడవలో కోటిపల్లి వైపునకు తీసుకెళ్లి దాడి చేశారు. మెడకుతాడు బిగించి ఊపిరి ఆడకుండా చంపేశారు. తర్వాత మృతదేహాన్ని అక్కడే పడేశారు. దుర్గాప్రసాద్.. శ్రీకాంత్‌కు అత్యంత సన్నిహితుడు" అని ధర్మేశ్ తన వాంగ్మూలంలో పేర్కొన్నారు. కాగా, తమపై ఎవరికీ అనుమానం రాకుండా దుర్గాప్రసాద్ భార్య ఆదర్శ, వారి ఇద్దరి పిల్లలతోపాటు కొందరు యువకులను పిలిచి వలంటీర్‌ను హత్య చేసిన నిందితులను అరెస్టు చేయాలని నిరసన చేపట్టినట్టు ధర్మేశ్ పోలీసులకు తెలిపారు. అదేవిధంగా దుర్గాప్రసాద్ కుటుంబానికి పినిపే శ్రీకాంత్ రూ.లక్ష సాయం చేశారని, ఎస్పీని కలిసి విచారణ చేపట్టాలని కోరారని పేర్కొన్నారు.

ఆవాస్ ప్లస్ యాప్.. గేమ్ ఛేంజర్

» మోదీ, చంద్రబాబు విజనరీ లీడర్లు: పెమ్మసాని

» గుంటూరులో 5 రాష్ట్రాల శిక్షణ సదస్సు

గుంటూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆవాస్ ప్లస్ 2024 యాప్ గేమ్ ఛేంజర్‌గా మారబోతున్నదని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కృత్రిమ మేధ(ఏఐ) ను వినియోగించుకొంటూ ముఖ గుర్తింపుతో గృహ నిర్మాణ పథకం దుర్వినియోగం కాకుండా ఈ యాప్ ద్వారా కట్టడి చేయవచ్చన్నారు. సోమవారం గుంటూరులో పీఎం ఆవాస్ యోజన గ్రామీణ్, ఆవాస్ ప్లస్ 2024 యాప్ వినియోగంపై ఐదు రాష్ట్రాల గృహనిర్మాణ శాఖ అధికారులకు నిర్వహించిన శిక్షణ శిబిరం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ.. అందరికీ ఇళ్లు అనేది కేవలం నినాదంగానే ఉండిపోకుండా నిజం చేసే విజనరీ లీడర్లుగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబులను అభివర్ణించారు. అసోంలో షేరింగ్ విధానంలో రూ.2 లక్షల యూనిట్ కాస్ట్‌తో గృహ నిర్మాణాలు చక్కగా జరిగాయని వివరించారు. 29 లక్షల ఇళ్ల నిర్మాణాలు ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాల్సి ఉందన్నారు. ప్రధాన మంత్రి జన్‌మన్ స్కీం కింద మారుమూల ప్రాంతాల్లో 3.27 లక్షల గృహాలను మంజూరు చేయగా, వాటిల్లో 42 వేల గృహాలు ఇప్పటికే పూర్తి చేశామన్నారు. రాష్ట్ర గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడు తూ రానున్న ఐదేళ్లలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు నిర్మించాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు ఉన్నారన్నారు. కేంద్రం పీఎంఏవై గ్రామీణ్ అర్హతకు విధించిన 10 పాయింట్లలో మూడింటిని పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. 3, 4 చక్రాల మోటారు వాహనాలను వివిధ అవసరాల నిమిత్తం పేద కుటుంబాలు సైతం వినియోగిస్తున్నాయని, బ్యాంకర్ల నుంచి రుణాలు తీసుకొని కొనుగోలు చేస్తున్నాయని, వారికి మినహాయింపు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ, ఇతర కార్మికులు, చేతివృత్తులవారి ఆదా య పరిమితిని కనీసం రూ.25 వేలకు పెంచాలని సూచించారు. గృహాలను నిర్మించడానికి యూనిట్ ధర ఏమాత్రం సరిపోదని, బేస్‌మెంట్‌కే దాదాపు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు ఖర్చవుతోందన్నారు. కేంద్రం గృహనిర్మాణాల యూనిట్ ధరను పెంచాలని కోరారు. రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు 9 లక్షలు గృహాలు పూర్తయ్యాయన్నారు.



పీఎంఏవై గ్రామీణ్, ఆవాస్ ప్లస్ 2024 యాప్‌పై ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, వేదికపై మంత్రి పార్థసారధి

అవినాశ్, జోగి అండ్ కో సహకరించడం లేదు

» సుప్రీం ఆదేశాలనూ పాటించడం లేదు

» టీడీపీ ఆఫీసు, బాబు నివాసంపై దాడి కేసుల్లో సుప్రీంకోర్టుకు ఆంధ్ర ప్రభుత్వం నివేదన

న్యూఢిల్లీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయం, ఆ పార్టీ అధినేత చంద్రబాబు నివాసంపై దాడుల కేసుల్లో నిందితులు విచారణకు సహకరించడం లేదని ఆంధ్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దర్యాప్తు సంస్థలకు సహకరించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నా పాటించడం లేదని సోమవారం తెలిపారు. ఈ వ్యవహారంలో అత్యవసర విచారణ జరపాలని అభ్యర్థించారు. జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణను డిసెంబరు 17 కి వాయిదా వేసింది. నిందితులకు కల్పించిన మధ్యంతర రక్షణను అప్పటివరకు పొడిగించిం ది. టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో వైసీపీ నేత లు దేవినేని అవినాశ్, లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్, మరికొందరిపై కేసులు నమోదు చేశారు. వీరికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు అంగీకరించలేదు. దీంతో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ పొందారు. అయితే, దర్యాప్తునకు సహకరించాలని కోర్టు ఆదేశించింది. ఈ పిటిషన్లపై సోమవారం విచారణ జరిగింది. నిందితుల తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ విచారణను జనవరికి వాయిదా వేయాలని కోరారు. దీనిపై లూథ్రా అభ్యంతరం తెలిపారు. నిందితులు దర్యాప్తునకు సహకరించడం లేదని, అత్యవసర విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు.

సీజే ఆదేశాలతో తగిన బెంచ్ ముందుంచండి

» సజ్జల పిటిషన్‌పై రిజిస్ట్రీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): లుకౌట్ సర్క్యులర్(ఎల్‌వోసీ) రద్దు చేయాలని కోరుతూ వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సీజే అనుమతితో తగిన బెంచ్ ముందు ఉంచాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్‌పై తొందరపాటు చర్యలు వద్దన్న తర్వాత ఎల్‌వోసీ జారీ చేయడం ధిక్కరణ కిందకి వస్తుందా? లేదా? అనే విషయం సంబంధిత న్యాయమూర్తి తేల్చడమే సబబని వ్యాఖ్యానించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో సజ్జల రామకృష్ణారెడ్డిని పోలీసులు 120వ నిందితుడిగా చేర్చారు. ఈ కేసులో హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేయడంతో పాటు సజ్జలపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు స్పష్టం చేసింది. అయితే ఈ ఉత్తర్వులు ఇచ్చాక గుంటూరు ఎస్పీ ఎల్‌వోసీ జారీ చేయడం ధిక్కరణ కిందకి వస్తుందని, దానిని రద్దు చేయాలని కోరుతూ సజ్జల హైకోర్టును ఆశ్రయించారు. దానిలో హోం ముఖ్యకార్యదర్శి, డీజీపీ, గుంటూరు జిల్లా ఎస్పీ, మంగళగిరి సీఐలను ప్రతివాదులుగా చేర్చారు.

నంద్యాలలో నమోదైన కేసులు కొట్టేయండి

» హైకోర్టుకు అల్లు అర్జున్, మాజీ ఎమ్మెల్యే రవిచంద్ర

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా అధికారులు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించామంటూ ఈ ఏడాది మే 11న నంద్యాల టూటౌన్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ సినీనటుడు అల్లు అర్జున్, వైసీపీ మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. కేసులో తదుపరి చర్యలన్నింటినీ నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్ బుధవారం విచారణకు రానుంది. ఈ ఏడాది మే 11న అప్పటి వైసీపీ ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్‌రెడ్డి ఇంటికి అల్లు అర్జున్ వచ్చారు. ఈ విషయం తెలుసుకొని అభిమానులు, ప్రజలు భారీగా చేరుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో 144వ సెక్షన్ అమల్లో ఉన్నందున అంతమంది ఒకే చోటకు చేరడం ఎన్నికల కోడ్‌కు విరుద్ధమని, చర్యలు తీసుకోవాలని కోరుతూ డిప్యూటీ తహశీల్దార్ పి.రామచంద్ర ఫిర్యాదు చేశారు. 'రెండు కుటుంబాల మధ్య ఉన్న స్నేహంతో ఎన్నికల్లో పోటీ చేస్తున్న రవిని అభినందించేందుకు నంద్యాల వెళ్లాను. స్నేహితుడి ఇంటికి వెళ్లడం చట్ట ఉల్లంఘనగా పరిగణించకూడదు. పర్యటనలో ఎలాంటి బహిరంగ సభలు నిర్వహించలేదు. డిప్యూటీ తహశీల్దార్ అత్యుత్సాహంతో ఫిర్యాదు చేశారు. రవిచంద్ర కిషోర్‌రెడ్డి ఇంటికి వెళ్లడం నా వ్యక్తిగతం. దీనికి అధికారుల అనుమతి అవసరం లేదు' అని అల్లు అర్జున్ పిటిషన్‌లో పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.